జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 12, డిసెంబర్ 2024 ‖ ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం




## ఏపీలో విశాఖ గూగుల్‌కు

# వ్యూహాత్మక కేంద్రం!

◆ సీఎం చంద్రబాబును కలిసిన ప్రతినిధుల బృందం

**అమరావతి, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గూగుల్ వ్యూహాత్మక పెట్టుబడులకు విశాఖపట్నం కేంద్రంగా మారనుంది. గూగుల్ సంస్థకు చెందిన ప్రతినిధుల బృందం బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసింది. బృందానికి గూగుల్ గ్లోబల్

మిగతా.. 2లో

# పెత్తందార్లం కాదు..

# ప్రజా సేవకులం!

- ◆ 'పీపుల్ ఫస్ట్' మన విధానం
- ◆ హెల్తీ, వెల్తీ, హ్యాపీ మన నినాదం
- ◆ మానవీయ కోణంలో సమస్యల పరిష్కారం
- ◆ వైసీపీ హయాంలో పోర్టులు, సెజ్‌లు కూడా కబ్జా
- ◆ గూగుల్‌తో ఎంవోయూ గేమ్ చేంజర్
- ◆ 13న స్వర్ణాంధ్ర -2047 డాక్యుమెంట్ విడుదల
- ◆ పాలనలో మరింత వేగం పెంచుదాం
- ◆ రెండవ జిల్లాల కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, మహానాడు:**

రాష్ట్రంలో ప్రతి అధికారి పెత్తందారులా కాకుండా ప్రజాసేవకుడిలా పనిచేయాలని, 'పీపుల్ ఫస్ట్' అనేది మన విధానమని, 'హెల్తీ–వెల్తీ–హ్యాపీ' మన నినాదం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాల కలెక్టర్లతో అన్నారు. ప్రజా సమస్యలను ఒక అధికారిలా కాకుండా.. మానవతా కోణంలో చూడాలని చెప్పారు. ప్రజలతో మన ప్రవర్తన మర్యాద పూర్వకంగా ఉండాలని, మనం మంచి పనులు చేస్తే ప్రజలు కచ్చితంగా అభినందిస్తారని ముఖ్య మంత్రి అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా సమస్యలు తెలుసుకోవడం, ప్రజల వినతుల వేగంగా పరిష్కరించడం అధికారుల ప్రథమ ప్రాధామ్యాలుగా ఉండాలన్నారు. బుధవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులు, 26 జిల్లాలకు చెందిన కలెక్టర్లతో రెండవ జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి గడిచిన 6 నెలల పాలనపైనా, భవిష్యత్ ప్రణాళికలపైనా చర్చించారు.

### మార్పు మొదలైంది.. వెలుగులు చూస్తున్నాం

ఆరు నెలల్లో మనమంతా రెండోసారి సమావేశం అయ్యామని అయితే మొదటి సమావేశానికి రెండవ సమావేశానికి స్పష్టమైన పురోగతి కనిపిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. మొదటి సమావేశం నాటికి రాష్ట్రంలో చీకట్లు






నెలకొనగా, అవి మెల్లిగా పోయి రెండో సమావేశం కల్లా వెలుగు రావడం మొదలైందని చెప్పారు. సాధారణ పరిస్థితులు నెలకొన్న రాష్ట్రాన్ని నడిపించడం సులభంగానే ఉంటుందని, విధ్వంసం జరిగిన రాష్ట్రంలో పాలన సాగించాలంటే ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. గత ప్రభుత్వం రూ. పది లక్షల కోట్ల పైనే అప్పులు–బకాయిలు మిగిల్చి వెళ్లడమే కాదు, రెండేళ్ల పాటు రాష్ట్రానికి వచ్చే నిధులను ముందుగానే వాడేసిందని ముఖ్యమంత్రి అన్నారు.

ప్రభుత్వ యంత్రాంగానికి జీతాలు ఇవ్వలేని పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించామని, సంక్షేమం–అభివృద్ధి వైపు వడిగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. గత పాలకులు పోర్టులు, సెజ్‌లు కూడా కబ్జా చేశారని.. ఇలా అన్నింటినీ ఒకొక్కటిగా సరిదిద్దుతున్నామని.. ఇందులో జిల్లాల కలెక్టర్లు చురుకైన పాత్ర పోషించాలని చెప్పారు. పీ 4 పాలసీ, జీరో పావర్టీ, ఉద్యోగాల కల్పన, జనాభావృద్ధి, జల సంరక్షణ, వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించడం – రైతులకు లాభాలు పెంచడం.. తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని సూచించారు.

మిగతా.. 2లో

## ఆక్వాకల్చర్, లైవ్ స్టాక్ దృష్టి పెట్టాలి

● ఉద్యానవన శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి, మహానాడు:**

ఇక్కడి జరిగిన మొదటి రోజు బుధవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో ఉద్యానవన శాఖపై సమీక్ష జరిగింది. ఉద్యాన పంటల ఉత్పత్తిని 15% పెంచాలనే లక్ష్యంగా పెట్టుకున్నాం. 3 లక్షల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం, లక్ష ఎకరాలలో ఉద్యాన పంటల సాగు లక్ష్యం పెట్టుకున్నాం. 35,000 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు–29% ఫలితాలు. హార్టికల్చర్‌లో ఆధునిక సాంకేతికత వాడకంతో మెరుగైన ఫలితాలు. నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, సరఫరా. సూక్ష్మ సేద్యం కోసం బడ్జెట్ పెంపు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణలో దేశంలోనే అగ్రస్థానంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు సూచనలు చేశారు. ఆక్వా కల్చర్, లైవ్ స్టాక్ దృష్టి పెట్టాలి. పంటలకు తెగుళ్లు రాకుండా నివారణ చర్యలు.. జీరో వేస్ట్ లక్ష్యం. కేంద్ర ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. హార్టికల్చర్ ఉన్న జిల్లాల్లో కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు మరింత పెంచాలి. అలాగే ఉద్యానవన శాఖపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యం. పంటలకు తెగుళ్లు రాకుండా చూడడం ప్రధాన లక్ష్యం.

కేంద్ర ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేయాలి. వ్యవసాయ సహకార సంఘాలను

మిగతా.. 2లో



యూపీఎస్సీ మెయిన్స్ 2024 ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థుల సత్తా

3లో




వైసీపీపై బిజెపి ఎమ్మెల్యేలు ఫైర్

3లో



మోహన్ బాబుకు తెలంగాణ హైకోర్టులో ఊరట

3లో



'ఉచితం' వద్దు.. ఉపాధి చూపండి

2లో



రాజీనామాలకు వెన్ను చూపి పారిపోయిన చరిత్ర రేవంత్ రెడ్డిది

3లో



కూటమి పాలనలో ఆనందంగా రాష్ట్రం!

4లో



చేతి గుర్తుకు ఓటేస్తే చేతకాని సీఎంని తెలంగాణ నెత్తిన రుద్దారు

5లో



రైస్ స్మగ్లింగ్ నిందితులపై పీడీ యాక్టు పెట్టండి

7లో

## మా పథకాలేవని ప్రజలు నిలదీస్తున్నారు

- ◆ చంద్రబాబు అబద్ధాలు మోసాలుగా మారాయి
- ◆ అవే ప్రజల్లో కోపంగా మారుతున్నాయి
- ◆ ఆర్థిక మంత్రి వియ్యంకుడు రైస్ ఎక్స్‌పోర్టర్
- ◆ ఆయన సరుకు ఎందుకు తనిఖీ చేయలేదు
- ◆ ధాన్యానికి మద్దతు ధర లేదు
- ◆ కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయి
- ◆ 6 నెలల్లో రూ.15వేల కోట్లు బాదుడు
- ◆ ప్రజల తరఫున వైఎస్సార్సీపీ పోరు బాట
- ◆ డిసెంబరు 13, డిసెంబరు 27, జనవరి 3న నిరసన కార్యక్రమాలు.
- ◆ జనవరి నుంచి జిల్లాల పర్యటన
- ◆ పార్లమెంటు నియోజకవర్గాల వారీగా పర్యటన
- ◆ ప్రతి బుధ, గురువారాల్లో కార్యకర్తలతో మమేకం
- ◆ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వైయస్సార్‌సీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో క్యాంప్ ఆఫీస్‌లో సమావేశమైన మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి



**తాడేపల్లి,మహానాడు:**

ఎన్నికలు అయిపోయి ఆరు నెలలు దాటింది. ఈ పరిస్థితుల్లో పార్టీని మనం మళ్లీ సమాయత్తం చేసే దిశగా అడుగులు వేస్తూ ఇవాళ కలుస్తున్నాం. ఆరు నెలల్లో ఇంత వ్యతిరేకత ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం మీద లేదు. ఆరు నెలల్లోనే ఈ ప్రభుత్వం మీద విపరీతమైన స్థాయిలో వ్యతిరేకత ఉంది. కేవలం చంద్రబాబు నాయుడు పాలనలో మాత్రమే

మిగతా.. 8లో

# నారాయణ.. నారాయణ!

- ◆ సీఆర్‌డీఏపై పెత్తనం కోసం నారాయణ పోరు
- ◆ కాటమనేని భాస్కర్‌ను మార్చాలని సీఎంపై ఒత్తిళ్లు
- ◆ ఇద్దరికీ రాజీ చేసినా కుదరని సయోధ్య
- ◆ చివరకు కాటమనేనిని బదిలీ చేయాలని నిర్ణయం
- ◆ ఆయన స్థానంలో షన్‌మోహన్ ◆ కలెక్టర్ల సదస్సు తర్వాత బదిలీ



**(అన్వేష్)**

సీఆర్‌డీఏపై తన ఒక్కరి పెత్తనమే సాగాలన్న మంత్రి నారాయణ లక్ష్యం నెరవేర నుంది. ఆయన కోరిక మరో రెండు రోజుల్లో ఫలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక సీఆర్‌డీఏపై నారాయణ కత్తికి ఎదురుండద న్నమాట.



మంత్రి నారాయణ–సమర్థుడు, నిజాయతి పరుడైన సీనియర్ ఐఏఎస్ అధికారి, కమ్మ సామాజికవర్గానికి చెందిన కాటమనేని భాస్కర్ మధ్య జరుగుతున్న అంతర్గత పోరులో, చివరాఖరకు నారాయణ నెగ్గేలా ఉన్నారు.



కాటమనేనిని తొలగించేందుకు మంత్రి నారాయణ గత కొద్దికాలం నుంచి చేస్తున్న ఒత్తిళ్లు ఎట్టకేలకూ ఫలించే సూచనలు కనిపిస్తున్నారు.కలెక్టర్ల సదస్సు తర్వాత భాస్కర్‌ను బదిలీ చేసి, ఆయన స్థానంలో షన్ మోహన్‌ను నియమించాలన్న నారాయణ ప్రయత్నం ఫలించనుంది.

వారిద్దరిమధ్య సయోధ్య కుదిర్చేందుకు సీఎం చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. ఫలితంగా కాటమనేని బదిలీ వైపే బాబు మొగ్గుచూపినట్లు సమాచారం. సీఆర్‌డీఏపై తన ఒక్కరి పెత్తనమే సాగాలన్న మంత్రి నారాయణ లక్ష్యం నెరవేర నుంది. ఆయన కోరిక మరో రెండురోజుల్లో ఫలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక సీఆర్‌డీఏపై నారాయణ కత్తికి ఎదురుం డదన్నమాట.


అమరావతి పనులను కొత్త ఏడాది నుంచి పరుగులు పెట్టించాలని చంద్రబాబు సర్కారు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీనికి వీలుగా ఇప్పుడు గ్రౌండ్ అంతా ప్రిపేర్ అయిన తర్వాత.. అత్యంత కీలకమైన ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ ను బదిలీ చేయాలని సర్కారు నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ప్రపంచ బ్యాంకు ఒప్పందం తో పాటు, రాజధాని పనులు సాఫీగా సాగేందుకు

మిగతా.. 2లో

## ప్రజల మేలు కోసం... రాష్ట్రం బాగు కోసం సమష్టిగా పనిచేద్దాం

- ◆ పాలసీలు బలంగా చేసినా, అమలు చేసే బాధ్యత మీపైనే ఉంది
- ◆ గత పాలకులు వ్యవస్థలను నాశనం చేశారు
- ◆ గత ప్రభుత్వ హయాంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల తీరు చూస్తే ఆశ్చర్యంగా ఉండేది
- ◆ గాడిలో పెట్టేందుకే మాకు సమయం సరిపోతోంది
- ◆ క్షేత్ర స్థాయిలో తప్పులను నియంత్రించే బాధ్యత కార్యనిర్వాహక వర్గానిదే
- ◆ రాజ్యాంగబద్ధంగా పని చేస్తే ప్రభుత్వ మద్దతు ఉంటుంది
- ◆ ప్రజల్లో చైతన్యం మెండుగా ఉంది.. తప్పు జరిగితే తిరగబడతారు జాగ్రత్త
- ◆ సరికొత్త ఆంధ్రప్రదేశ్ కోసం సమన్వయంతో ముందుకు వెళ్దాం
- ◆ జిల్లా కలెక్టర్ల సదస్సులో ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**అమరావతి, మహానాడు:**

గత ఐదేళ్లలో రాష్ట్రంలో వ్యవస్థల మూలాలు కదిలిపోయాయి. వ్యవస్థల్లోకి నిర్లక్ష్యం, నిర్లిప్తత ఆవహించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. పట్టాలు తప్పిన వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టడానికే చాలా సమయం వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన చెందారు. శాఖాపరంగా సమీక్షలు చేస్తున్నప్పుడు గత ఐదేళ్లలో వ్యవస్థలు ఎంత దారుణంగా పని చేశాయో తెలుసుకొంటుంటే ఆశ్చర్యపోవడమే నా వంతవుతోందన్నారు. ఈ పద్ధతి పూర్తిగా మారాలని, ప్రజల బాగు కోసం,

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

2

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 12, డిసెంబర్ 2024

## ఏపీలో విశాఖ గూగుల్‌కు వ్యూహాత్మక కేంద్రం!

(మొదటిపేజీ తరువాయి..)

నెట్‌వర్కింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(జీజీఎన్ఐ) వైస్ ప్రెసిడెంట్ బికాష్ కోలే నాయకత్వం వహించారు. వివిధ కృత్రిమ మేధ(ఏఐ) కార్యక్రమాలపై సహకరించే ప్రక్రియలో భాగంగా గూగుల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య డిసెంబర్ 5న విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో అవగాహన ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత ఈ బృందం పర్యటన జరిగింది. భారతదేశంలో గూగుల్ కార్యకలాపాలు, దాని భవిష్యత్తు ప్రణాళికలు, ముఖ్యంగా విశాఖపట్నం కేంద్రంగా ప్రతిపాదించిన వ్యూహాత్మక పెట్టుబడుల ప్రణాళికలపై ఆ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రికి వివరించింది.

గూగుల్ గ్లోబల్ నెట్వర్క్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఉపాధ్యక్షుడు బికాష్ కోలే మాట్లాడుతూ గూగుల్‌కు ఆంధ్ర ప్రదేశ్ కీలక భాగస్వామి రాష్ట్రమని పేర్కొన్నారు. భవిష్యత్తులో చేపట్టనున్న ముఖ్యమైన కొత్త కార్యక్రమాల గురించి ఆయన తన ఆసక్తిని వ్యక్తం చేశారు. సందర్భంగా ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తన నాయకత్వంలో చేసిన కృషి ఫలితంగా ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై ఐటీ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఐటి రంగం ఘణనీయమైన అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు.

అంతేగాక దేశంలో ఐటీ రంగాన్ని ఆంధ్రప్రదేశ్ ఎలా మారుస్తుందో సీఎం తెలిపారు. రాష్ట్రంలో గూగుల్ ప్రతిపాదించిన పెట్టుబడులను స్వాగతిస్తున్నట్టు సీఎం పేర్కొన్నారు. అంతేగాక గూగుల్ సంస్థకు అవసరమైన ప్రోత్సాహకాలను అందించనున్నట్టు సీఎం హామీ ఇచ్చారు. ఈ చర్యలు రాష్ట్రంలో పటిష్ఠమైన సాంకేతిక పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు దోహదపడనున్నాయి.

గూగుల్ సంస్థ రాష్ట్ర భాగస్వామ్యంతో పురోగమిస్తున్నందున గూగుల్ గ్లోబల్, స్థానిక బృందం క్రమం తప్పకుండా నిమగ్నమవ్వడం కొనసాగించనున్నాయి. దీని కోసం రెండు వైపులా వ్యూహాత్మక సహకార అవగాహనా ఒప్పందంపై కూడా సంతకం చేశాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ ఇటీవల తన అమెరికా పర్యటనలో భాగంగా గూగుల్ లీడర్‌షిప్‌తో తన సమావేశాన్ని గుర్తు చేసుకున్నారు. అక్కడ గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడానికి, ఆ సంస్థ పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో చర్చించే అవకాశం కూడా లభించిందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

కొత్త ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడిదారుల అభిప్రాయాల్లో గణనీయమైన మార్పును సాధించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలల్లోనే రాష్ట్రం ఇప్పటికే రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా గ్రూప్, ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్, భారత్ ఫోర్జ్ వంటి గ్లోబల్, ఇండియన్ మేజర్‌ల నుండి పెద్ద ఎత్తున పెట్టుబడుల ప్రతిపాదనలను ఆకర్షించింది. ఈ పరిణామాలు కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే పరిమితం కాకుండా యావత్ దేశానికి ఐటి రంగం అభివృద్ధికి ఒక గ్రోత్ ఇంజిన్‌గా దృఢంగా నిలబెట్టానున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పెత్తందార్లం కాదు.. ప్రజా సేవకులం!

(మొదటిపేజీ తరువాయి..)

### కూకటి వేళ్లతో సహా తొలగించండి

గత ప్రభుత్వంలో భూ అక్రమాలు, లిక్కర్ మాఫియా, ఇసుక దోపిడీ, గంజాయి సాగు, డ్రగ్స్ సరఫరా, ఎర్ర చందనం స్మగ్లింగ్, రేషన్ బియ్యం విదేశాలకు అక్రమ రవాణా.. ఇలా అన్ని మూలాల్లోకి మాఫియా వెళ్లిపోయిందని.., ఇప్పుడు వాటిని కూకటి వేళ్లతో సహా తొలిగించాల్సిన బాధ్యత జిల్లాల కలెక్టర్లపైనే ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఎక్కడా గత ప్రభుత్వ పాలనకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించకూడదని, ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీసిన వారిని క్షమించొద్దని, విశ్వసనీయతను – నమ్మకాన్ని తిరిగి నిలబెట్టి రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని ముఖ్యమంత్రి మార్గదర్శనం చేశారు.

### నిరూపించుకునే అవకాశమిస్తున్నాం

పాలనలో కూడా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' రావాలని, ప్రభుత్వ నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. జిల్లాల కలెక్టర్లు ఒకరితో ఒకరు పోటీ పడితేనే ఫలితాలు ఆశించినట్టుగా వస్తాయన్నారు. మిమ్మల్ని మీరు నిరూపించుకునేందుకు అందరికీ అవకాశం ఇస్తున్నానని ముఖ్యమంత్రి చెప్పారు. జిల్లాకు ఏడు నియోజకవర్గాలే ఉన్నందున పాలన సులభతరమేనని, మానవ వనరుల అభివృద్ధి నుంచి శాంతి భద్రతల అమలు వరకు అన్నింటా సమర్థత చూపాలన్నారు. డబ్బులు లేవని అభివృద్ధి పనులు ఆపొద్దని, వినూత్నంగా ఆలోచించి ముందుకు సాగాలని, వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి పరిపూర్ణత రావాలన్నారు. పనిచేయని వాళ్లతో పనిచేయించాలని.. అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు చెప్పారు.

### ఫలితాలు ఆలస్యమైనా కర్తవ్యం మరవొద్దు

కొన్నిసార్లు ఫలితాలు వెంటనే రాకపోవచ్చని, అలా అని నిరుత్సాహ పడకుండా పనిచేస్తే ఎప్పటికైనా అనుకున్నది సాధిస్తామని... ఇటీవల ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటనను ముఖ్యమంత్రి ఇందుకు ఉదహరించారు. లోకేష్ అమెరికా పర్యటన ఫలితంగా ఇప్పుడు రాష్ట్రానికి గూగుల్ వంటి సంస్థ విశాఖపట్నం రావాలని నిర్ణయించిందని చెప్పారు. ఇందుకు సంబంధించి బుధవారం గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ చేసుకుందన్నారు.

రాష్ట్రంలోని యువతతో సహా అందరికీ డిసెంబర్ 11 ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. గూగుల్‌తో ఎంవోయూ ద్వారా విశాఖపట్నం రూపురేఖలు మారి, రాష్ట్రానికి గేమ్ చేంజర్ అవుతుందన్నారు. డేటా సెంటర్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సీ కేబుల్ వంటివి వస్తే ప్రపంచం చూపు విశాఖ వైపు ఉంటుందన్నారు. నాలెడ్జ్ సొసైటీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలి అనుకుంటున్నామని, ఆర్టీజీఎస్‌తో గూగుల్‌ని అనుసంధానం చేస్తున్నట్టు, ఇది ప్రభుత్వంలో పెద్ద మార్పు తీసుకువస్తుందని అన్నారు.

### మారిన పరిస్థితులతో భారీగా పెట్టుబడులు

అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిపై 7 శ్వేత పత్రాలు విడుదల చేశామని, 20 పాలసీలు తీసుకువచ్చామని.. ఇవన్నీ చూసి రూ. 4 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, వీటి ద్వారా 4 లక్షల ఉద్యోగావకాశాలు కలుగుతాయని వివరించారు. అమరావతి అభివృద్ధికి రూ. 31 వేల కోట్లు సమకూర్చామని, పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు గ్రామ సభలు నిర్వహించడం ద్వారా గ్రామాల్లో తలపెట్టిన వివిధ అభివృద్ధి పనులను వచ్చే సంక్రాంతి నాటికి పూర్తయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు.

### పింఛన్ల పంపిణీలో మనదే రికార్డు

దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనంతగా 64 లక్షల మంది పేదలకు పింఛన్లు ఇస్తున్నామని, ప్రతీ ఏడాది 33 వేల కోట్లు ఇందుకోసం ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. దీపం –2 కింద ఇప్పటికే 40 లక్షల సిలండర్లు పేద కుటుంబాలకు అందించామని అన్నారు. రాష్ట్రంలో 199 అన్న కేంటిన్లు ఏర్పాటు చేశామన్నారు. 43 వేల పాఠశాలల్లో కోటి 20 లక్షల మందితో నిర్వహించిన పేరెంట్స్ – టీచర్స్ మీటింగ్ విజయవంతమైందని, 16 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి త్వరలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

### రెవెన్యూ సదస్సులతో శాశ్వత పరిష్కారం

ప్రజల నుంచి మనకు వచ్చే వినతుల్లో అత్యధికంగా 60 శాతం భూసంబంధితమైనవే ఉంటున్నాయని అందుకే భూ సమస్యలు పరిష్కరించేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని, ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్టును తీసుకు వచ్చామని ముఖ్యమంత్రి చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లాల కలెక్టర్లు రెవెన్యూ సదస్సులను నామమాత్రంగా కాకుండా, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నిర్వహించాలని ఆదేశించారు.

ప్రజలు పదే పదే అర్జీలు పట్టుకుని తిరిగే పరిస్థితి పోవాలని, బాధిత వర్గాలకు ఎలా న్యాయం చేయాలనేది అధికారులు ఆలోచించి పనిచేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ప్రస్తుతం పని చేస్తున్న విధానంతో మార్పు రాదని, తనకు వచ్చిన అర్జీని ఆర్డీవో తాసీల్దార్‌కు పంపితే సమస్య పరిష్కరించినట్టు కాదన్నారు. సంతృప్తికరమైన పరిష్కారం చూపితేనే ప్రజల నుంచి సానుకూలత వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఎన్నిసార్లు తిరిగినా సమస్య పరిష్కారం కాకపోతే ప్రజల్లో వ్యతిరేకత మొదలు అవుతుందన్నారు.

### సంక్రాంతి కల్లా రహదారుల మరమ్మతులు

ధాన్యం సేకరణ వేగంగా జరుగుతోందని, 48 గంటల్లో డబ్బులు జమ చేస్తున్నామని, ఐదేళ్లలో పాడైన రోడ్లన్నింటికీ మరమ్మతులు చేస్తున్నామని.. సంక్రాంతి కల్లా గుంతలు పూడుస్తామని ముఖ్యమంత్రి అన్నారు. గూగుల్ సాయంతో విశాఖ ఏజెన్సీలో గంజాయి సాగును కనుగొన్నామని, సాయిల్ టెస్టింగ్, సాయిల్ హెల్త్ వంటి వాటికి కూడా టెక్నాలజీ సాయం తీసుకుంటామన్నారు.

### స్వర్ణాంధ్ర - 2047 విజన్‌తో పాలన

స్వర్ణాంధ్ర విజన్–2047ను ఈనెల 13న ఆవిష్కరిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ స్థాయిలో విజన్ రూపొందించామని దాని ఆధారంగా పాలన సాగాలన్నారు. 15 శాతం వృద్ధి రేటును లక్ష్యంగా పెట్టుకుని జిల్లాల కలెక్టర్లు ఫలితాలు రాబట్టాల్సి ఉంటుందన్నారు. రెండురోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సహా, మంత్రులు హాజరయ్యారు.

## ఆక్వాకల్చర్, లైవ్ స్టాక్ దృష్టి పెట్టాలి

(మొదటిపేజీ తరువాయి..)

బలోపేతం చేయాలన్న దానిపై చర్చ జరిగింది. అలాగే, సూక్ష్మ సేద్యంలో మొదటి స్థానాల్లో చిత్తూరు, అనంతపురం జిల్లాలు ఉన్నాయని, హార్టికల్చర్‌లో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని చర్చించారు.

## ప్రజల మేలు కోసం... రాష్ట్రం బాగు కోసం సమష్టిగా పనిచేద్దాం

(మొదటిపేజీ తరువాయి..)

రాష్ట్ర క్షేమం కోసం పనిచేసే విధానం అందరిలో రావాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ల సమావేశం బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన మొదలైంది.

ఈ సదస్సులో పవన్ కల్యాణ్ మాట్లాడారు. ప్రజల అభ్యున్నతి కోసం పాలసీలు చేయాల్సిన బాధ్యత పాలకులుగా మాపై ఉంటే... దానిని అంతే సక్రమంగా ప్రజలకు అందించాల్సిన బాధ్యత కార్యనిర్వాహక వ్యవస్థగా కలెక్టర్లపైన ఉంటుంది. అప్పుడే ప్రజలకు మంచి పాలన, సుస్థిరమైన అభివృద్ధి సమపాళ్లలో అందుతుంది. గత ఐదేళ్లుగా ఈ పద్ధతి పూర్తిగా పక్కన పెట్టేశారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా సాగిన అప్పటి పాలనను కలిసికట్టుగా ఎదుర్కోవాలనే గత ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లి వారి ఆశీర్వాదం పొందాం. గత ప్రభుత్వ హయాంలో మేం ఎన్నో ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొనే ముందుకు వెళ్లాం. అప్పటి పాలకులు చట్టాలు, నిబంధనలు పట్టించుకోలేదు.

### కళ్ల ముందే తప్పు జరుగుతున్నా స్పందించలేదు

రాజ్యాంగ విరుద్ధ నిర్ణయాలను నియంత్రించే శక్తి ఉన్న బ్యూరోక్రసీ కూడా నిస్సహాయంగా ఉండటం చూసి బాధ కలిగించింది. ఇంతమంది బ్యూరోక్రాట్లకు అప్పట్లో జరిగిన అన్యాయాలను ఎదిరించే ధైర్యం లేకపోయింది. ఆ నిస్సహాయత నుంచే మేం రోడ్ల మీదకు వచ్చి ప్రజల తరఫున పోరాడాం. సినిమా టికెట్ల దగ్గర నుంచి ఇసుక వరకు, మద్యం అమ్మకాల దగ్గర నుంచి సహజ వనరుల దోపిడీ వరకు కళ్లముందే తప్పు జరుగుతున్నా అప్పట్లో ఎవరూ స్పందించలేదు. కష్టపడి సివిల్స్ పాసై ముస్సోరిలో ఐఏఎస్, హైదరాబాద్‌లో ఐపీఎస్ శిక్షణ పొంది, పాలనలో నిష్ణాతులుగా బయటకు వచ్చే అధికారులు గత ప్రభుత్వంలో ఏం జరిగినా మౌనంగా ఉండిపోవడం చూసి ఆశ్చర్యమేసేది. సిరియా, శ్రీలంక వంటి దేశాల్లో పాలకులు విఫలమైనా కార్యనిర్వాహక వ్యవస్థ బలంగా నిలబడి పరిస్థితిని చక్కదిద్దింది.

గత ప్రభుత్వ పాలకులు చేసిన ఎన్నో ఆకృత్యాలకు ప్రజలు బలయ్యారు. ఇప్పుడు కుప్పలుతెప్పలుగా ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు చూస్తుంటే బాధేస్తోంది. జీతభత్యాలు లేక ఉద్యోగులు, సిబ్బంది బాధపడ్డారు. ప్రజలకు అన్ని విషయాల్లోనూ బాధలు ఎక్కువయ్యాయి. సత్యసాయి జిల్లాలో వాటర్ స్కీమ్ లో పని చేసే క్షేత్ర స్థాయి సిబ్బందికి వేతనాలు నెలల తరబడి అందలేదని నా దృష్టికి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాం. అలాంటి సమస్యలు రాష్ట్రంలో చాలా ఉన్నాయి. వాటిని పరిష్కరించేందుకు కార్యనిర్వాహక వ్యవస్థ బలంగా పనిచేయాలి. అప్పుడే అన్ని వర్గాలకు సరైన మేలు జరుగుతుంది. ప్రజలలో ఇప్పుడు బలమైన చైతన్యం ఉంది. ఏ తప్పు జరిగినా వారు తిరగబడతారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు సీరియస్ గా పని చేయాలి. నిర్లక్ష్యాన్ని వీడాలి.

### మూడు చెక్ పోస్టులు పెట్టినా స్మగ్లింగ్ జరుగుతోంది

కాకినాడ పోర్టులో ఇటీవల నేను పర్యటించినప్పుడు అక్కడ జరుగుతున్న బియ్యం స్మగ్లింగ్ పరిస్థితి చూసి షాక్ అయ్యాను. నేను పర్యటించక ముందు చాలాసార్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించి స్మగ్లింగ్ నిరోధం కోసం సూచనలు చేశారు. మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేయించారు. అయినప్పటికీ నేను వెళ్లి స్వయంగా పరిశీలించిన సందర్భంగా ఎన్నో అవకతవకలు, స్మగ్లింగ్ కార్యకలాపాలు యథేచ్ఛగా జరగడం చూసి వ్యవస్థలు ఎలా పనిచేస్తున్నాయో అర్థమైంది. పాలకులు చెబుతున్న విషయాలను బ్యూరోక్రాట్లు పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. అక్కడున్న కలెక్టర్ తోపాటు జిల్లా ఎస్పీ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాల్సిన బాధ్యత ఉంది.

### స్మగ్లింగ్ నిరోధించకపోతే...

కేవలం బియ్యం స్మగ్లింగ్ కోసం మాత్రమే నేను ఆ రోజు మాట్లాడలేదు. స్మగ్లింగ్ వంటి కార్యకలాపాలు నిరోధించలేకపోతే దేశానికి హాని కలిగించే తీవ్రవాద మూకలు, పేలుడు పదార్థాలు సులభంగా దేశంలోకి రావడానికి ఆస్కారం ఉంది. 2008లో కసబ్ లాంటి తీవ్రవాదులు ముంబై పోర్టు నుంచి దేశంలోకి వచ్చి 300 మంది ప్రాణాలు బలిగొన్నారు. కాకినాడ పోర్టు భద్రంగా లేకపోతే అలాంటివి జరగవు అని గ్యారెంటీ ఏంటి.. కేవలం అక్రమ బియ్యం నిరోధం పైనే కాకుండా రాబోయే విపత్తులను కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

### ఏపీ సివిల్ సర్వీస్ అధికారులు నాడు - నేడు

నేను చెప్పేది ఒక్కటే రాష్ట్రం కోసం, ప్రజల కోసం సమన్వయంతో పని చేయాల్సిన సమయం ఇది. మీరు మరింత జాగ్రత్తగా పని చేయాలి. ముఖ్యమంత్రి ఉచిత ఇసుక విధానం మీద చాలాసార్లు సమీక్షలు చేసి పలు సూచనలు చేశారు. నేను కూడా పలు శాఖలపై వాటి పని తీరుపై ప్రభుత్వ విధానాలను బ్యూరోక్రాట్లకు తెలియజేస్తున్నాను. వ్యవస్థల్లో చాలా నిర్లక్ష్యం పేరుకుపోయింది. దీన్ని పూర్తిగా తొలగించాలి. ప్రజలు మా నుంచి చాలా ఆశిస్తున్నారు. దానిని మీ సహకారం లేకుండా మేం చేరుకోలేమని భావిస్తున్నాం.

గతంలో ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీస్ అధికారులంటే దేశం మొత్తానికి ఒక బ్రాండ్ అంబాసిడర్ గా ఉండేవారని, ఇటీవల ఢిల్లీ పర్యటనలో కూడా కొందరు పెద్దలు చెప్పడం నాకు గుర్తు ఉంది. గత ఐదేళ్లలో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సివిల్ సర్వీస్ అధికారులు ఎలా ఉండకూడదో ఆంధ్ర అధికారులను చూపిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోండి. మీరు ప్రజలకు మంచి చేస్తే మా నుంచి పూర్తి సహకారం ఉంటుంది. మీ ఆలోచనలు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేవి అయితే మేం వాటిని ముందుకు తీసుకెళ్లే బాధ్యతను మీ పర్యవేక్షణలోనే తీసుకుంటాం.

ఒకప్పుడు సైబరాబాద్ ప్రాంతం రాళ్లురప్పలుగా ఉండేది. ఆ రాళ్లురప్పల్లోనే భవిష్యత్తును చూపిన గొప్ప నాయకుడు నారా చంద్రబాబు నాయుడు. ఆయన నాయకత్వంలో, మార్గదర్శకంలో మనమంతా పనిచేయడం అదృష్టంగా భావించాలి. రాష్ట్ర భవిష్యత్తు మీద ఆయనకున్న విజన్ అద్భుతం. దానికి అనుగుణంగా మనం ముందుకు వెళ్తే రాష్ట్రం కచ్చితంగా అభివృద్ధి ఆంధ్రగా మారుతుంది. మీ చేతిలో అతి పెద్ద జిల్లా వ్యవస్థలున్నాయి. వాటిని ప్రజల కోసం, పాలసీలను వారికి అందించడం కోసం బలంగా పని చేయించే బాధ్యత మీ మీద ఉంది. దాన్ని పటిష్ఠంగా అమలు చేసేలా చూడండి. అంతా కలిసి వ్యవస్థలను బలోపేతం చేద్దాం. సరికొత్త ఆంధ్రప్రదేశ్ రూపకల్పనకు సమష్టిగా ముందడుగు వేద్దామని అన్నారు.

## నారాయణ.. నారాయణ!

(మొదటిపేజీ తరువాయి..)

అవసరమైన గ్రౌండ్ అంతా ఆయన సిద్ధం చేసి పెట్టారు. అయినా సరే మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కు, కాటంనేని భాస్కర్ కు సఖ్యత లేనందు వల్ల, ఆ ప్రభావం పనులపై పడకుండా చూసేందుకు.. కాటంనేని భాస్కర్‌ను కలెక్టర్ల సమావేశం ముగిసిన వెంటనే బదిలీ చేసే అవకాశం ఉంది అని చెబుతున్నారు.

ఆయన ప్లేసులో ప్రస్తుతం కాకినాడ కలెక్టర్ గా ఉన్న షాన్ మోహన్ ని నియమించేందుకు రంగం సిద్ధం అయినట్లు కూడా అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. షాన్ మోహన్ గతంలో సిఆర్డీఏ అదనపు కమిషనర్‌గా పని చేశారు. దీంతో ఆయన అయితే తమకు అన్ని రకాలుగా అనుకూలంగా ఉంటుంది అని మంత్రి నారాయణ చేసిన వాదనకు ప్రభుత్వ పెద్దలు ఓకే చేసినట్లు చెపుతున్నారు.

గతంలో కూడా మంత్రి నారాయణ కు, కాటంనేని భాస్కర్ కు మధ్య పొసగటం లేదు అని..ఆయన్ను అక్కడ నుంచి తప్పించాలని చంద్రబాబు పై పెద్ద ఎత్తున ఒత్తిడి తెచ్చినట్లు మీడియా లో వార్తలు వచ్చాయి. కానీ కారణాలు ఏమైనా అప్పటిలో ఆగిపోయినా బదిలీ ఈ సారి మాత్రం పక్కాగా జరుగుతుంది అని చెబుతున్నారు. అయితే భాస్కర్ ఏపీఐఐసీ ఎండీగా లేదా మరో పోస్ట్‌లో నియమించే అవకాశం ఉంది అని అధికార వర్గాలు చెపుతున్నాయి.

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రూల్స్ కంటే కూడా కాంట్రాక్టుల కేటాయింపుతో పాటు అన్నిటిలోనూ, తాను చెప్పినట్లు జరగాలి అనే తరహాలో వ్యవహరిస్తారు అని అధికార వర్గాలు చెబుతున్నాయి. గతంలో కూడా చాలా మంది అధికారులు ఆయన తీరుతో ఇబ్బంది పడ్డారు. అయినా సరే చంద్రబాబు దగ్గర ఉన్న పట్టుతో, అధికారుల బదిలీలు కూడా నారాయణ చేయించుకుంటున్నారు అనే ప్రచారం ఉంది.

తాజాగా ఎంఏయుడిలో తన సొంత సామాజికవర్గానికి చెందిన అధికారినే నారాయణ ఏరికోరి నియమించుకోవడం ప్రస్తావనార్హం. ఇప్పుడు మళ్లీ నిజాయితీపరుడు, ముక్కుసూటి అధికారి, రాత్రింబవళ్లు ఆఫీసులో కూర్చుని పనిచేసే భాస్కర్‌ను బదిలీ చేసేందుకు, రంగం సిద్ధం చేయడాన్ని సీనియర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. నారాయణ దగ్గర ఒక సామాజికవర్గం అధికారులకు మాత్రమే స్థానం ఉంటుందన్న ప్రచారం గతంలోనూ జరిగిన విషం తెలిసిందే.

కాగా కడప జిల్లా గాండ్ల సామాజికవర్గానికి చెందిన షన్‌మోహన్.. పైవారి ఆదే శాలు పాటించి, తనకు అప్పగించిన పనిని పూర్తి చేయడంలో సమర్థుడైన అధికారిగా పేరుంది. కాటమనేని భాస్కర్ నిజాయతీపరుడైన అధికారి అయినప్పటికీ.. ముక్కుసూటిగా పనిచేస్తుంటారు. పని చేయిస్తారు కూడా. ప్రతిభ–పనితీరును ప్రాతిపదికగా తీసుకునే ఆయన పనితీరు మంత్రులకు రుచించదు.


ఆయన కలెక్టరుగా పనిచేసిన అన్ని జిల్లాల్లో రాత్రివరకూ కలెక్టరేట్‌లోనే కొలువుదీరేవారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిపార్సులు ఖాతరు చేయరు. అయితే రాజకీయ కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకునే మంత్రి నారాయణకు.. బహుశా ఈ కారణాలతోనే, కాటమనేని సీఆర్‌డీఏలో కొనసాగడం నచ్చి ఉండక పోవచ్చని అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

## 'ఉచితం' వద్దు.. ఉపాధి చూపండి

◆ కేంద్ర సర్కారుకు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ,మహానాడు: ఎంతకాలం ఉచిత పథకాలు ఇస్తూ పోతారు. ఉపాధి కల్పించలేరా? అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. 81 కోట్ల మందికి ఉచితంగా లేదా సబ్సిడీపై రేషన్ అందజేయడంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఎంతకాలం ఉచితంగా వస్తువులను ఇస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ వలస కార్మికులకు ఉపాధి అవకాశాలు, సామర్థ్యాల పెంపుదలపై మనం ఎందుకు పని చేయకూడదని కోర్టు గట్టిగానే ప్రశ్నించింది. కోవిడ్ దగ్గర నుంచి వలస కార్మికులకు ఫ్రీ రేషన్ ఇస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి.. నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాల్సి ఉందని పేర్కొంది.

జాతీయ ఆహార భద్రత చట్టం 2013 కింద 81 కోట్ల మందికి ఉచితంగా గానీ, రాయతీపైన గానీ రేషన్ పంపిణీ చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం ధర్మాసనానికి తెలిపింది. కేంద్రం మాటలు విన్న ధర్మాసనం ఆశ్చర్య పోయింది. పన్ను చెల్లింపుదార్లనే విడిచిపెట్టారు అంటూ వ్యాఖ్యానించింది. కోవిడ్ సమయంలో వలస కార్మికుల సమస్యలపై సుమోటోగా చేపట్టిన వ్యాజ్యంపై అత్యున్నత ధర్మాసనం విచారణ జరిపింది. ఓ స్వచ్ఛంద సంస్థ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషన్ వాదనలు వినిపించారు. కోవిడ్ సమయంలో ఈ శ్రమ్ పోర్టల్ లో పేర్లు నమోదు చేసుకున్న వలస కార్మికు లకు కూడా ఫ్రీగా రేషన్ ఇచ్చారంటూ.. దాన్ని కొనసాగించాలని కోరారు. దీనిపై సుప్రీంకోర్టు స్పందించింది. ఇంకెంత కాలం ఉచితాలు కొనసాగిస్తారు. వారికి ఉపాధి ఎందుకు



కల్పించడం లేదని ప్రశ్నించింది. ఉచిత వస్తువులను ఎప్పటి వరకు ఇవ్వగలం? ఈ వలస కార్మికులకు ఉపాధి అవకాశాలు, సామర్థ్యాన్ని పెంపొందించడంపై మనం ఎందుకు పని చేయకూడదు? అని ప్రశ్నించింది.

వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని, కేంద్రం అందించే ఉచిత రేషన్ ప్రయోజనాలను పొందేందుకు వీలుగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ కోర్టు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీచేస్తోందని ప్రశాంత్ భూషణ్ తెలిపారు. ఎవరికైనా రేషన్‌కార్డు లేకుంటే, ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నట్లయితే, వారికి కూడా కేంద్ర ప్రభుత్వం ఉచిత రేషన్‌ను అందజేస్తుందని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 12, డిసెంబర్ 2024

## యూపీఎస్సీ మెయిన్స్ 2024 ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థుల సత్తా

- అభ్యర్థులకు ప్రభుత్వ ఆర్థిక సాయం
- రేవంత్ రెడ్డి అభినందనలు



**హైదరాబాద్,మహానాడు:** యూపీఎస్సీ మెయిన్స్ 2024 ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. ఈ ఏడాది తొలి సారిగా రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది.

సివిల్స్ సాధించే లక్ష్యంతో ప్రిపేరయ్యే పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని, ఈ ఏడాది తొలిసారిగా అమలు చేసింది. సింగరేణి సంస్థ అధ్వర్యంలో 135 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఈ ఏడాది ఆగస్ట్ 26న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వీరికి చెక్కులు పంపిణీ చేశారు.

రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థుల్లో 20 మంది తాజాగా యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాల్లోనూ విజేతలుగా నిలిచారు. వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన ఈ. సాయి శివాని, రాహుల్ శంకేషి, పోతరాజు హరి ప్రసాద్, విక్రమ్ బేతి, ఖమ్మం జిల్లాకు చెందిన నల్లమల సాయికుమార్, బానోతు నాగ రాజా నాయక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన కదారి శ్రీవాణి, గాదె శ్వేత, రాపర్తి ప్రీతి, మెదక్ జిల్లాకు చెందిన కుమ్మరి శ్రవణ్ కుమార్, రంగారెడ్డి జిల్లాకు చెందిన మొహమ్మద్ అశ్ఫాక్, తొగరు సూర్యతేజ, మహబూబాబాద్ జిల్లాకు చెందిన బెస్త ప్రియాంజలి, సిద్ధిపేటకు చెందిన నరిగె స్వామి, నాగర్‌కర్నూలుకు చెందిన గోకమల్ల అంజనేయులు, ఆదిలాబాద్‌కు చెందిన ఆర్. ప్రమోద్ కుమార్, వికారాబాద్‌కు చెందిన బి. ప్రహ్లాద్, జగిత్యాలకు చెందిన బురుగుపెల్లి నీరజ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన జస్వంత్ కుమార్, అసిఫాబాద్-కుమ్రంభీం జిల్లాకు చెందిన రామ్టెంకి సుధాకర్ మెయిన్స్ క్వాలిఫై అయిన జాబితాలో ఉన్నారు. రాష్ట్రం నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులంద రికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

## ఇది రైతుల పక్షాన నిలబడాల్సిన సందర్భం

- 13న జిల్లా కేంద్రాల్లో రైతుల కోసం తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- అనుమతులు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే న్యాయపరంగా ఎదుర్కొందాం
- రైతులకు న్యాయం జరగాలని శాంతియుతంగా వైయస్ఆర్ సిపి ఈ కార్యక్రమం చేపడుతోంది
- జిల్లా పార్టీ అధ్యక్షులు క్రియాశీలకంగా దీనిలో పాల్గొనాలి
- పార్టీ జిల్లా అధ్యక్షులతో జూమ్ కాన్ఫరెన్స్ లో పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపు




**తాడేపల్లి,మహానాడు:** రాష్ట్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేవారు లేక, గిట్టుబాటుధర అందక అల్లాడుతున్న నేపథ్యంలో వారికి అండగా నిలిచేందుకు ఈ నెల 13వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో తలపెట్టిన ర్యాలీలు, మెమోరాండం సమర్పించే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనాలని పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.

తాడేపల్లిలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో రైతు సమస్యలను నిర్లక్ష్యంగా చూస్తున్న ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చేందుకు వైయస్ఆర్ కాంగ్రెస్ అధినేత వైయస్ జగన్ ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చారు.

అన్ని జిల్లా కేంద్రాల్లోనూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు సంయుక్తంగా ర్యాలీగా కలెక్టర్ కార్యాలయంకు వెళ్ళి, అధికారులకు మెమోరాండంను సమర్పించాలి. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు మొత్తం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలి. ఇది రైతులకు అండగా నిలబడాల్సిన సమయం, సందర్భం. ప్రభుత్వం ధాన్యం సేకరణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చి, రైతులకు న్యాయం జరిగేలా వత్తిడి చేసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. శాంతియుతంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి కావాలని అనుమతులు నిరాకరించి, కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తే, దానిని కూడా న్యాయపరంగా ఎదుర్కొంటాం.

కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ, రైతులకు అండగా నిలుస్తూ, ఎన్నికల తరువాత వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో చేపడుతున్న ఈ కార్యక్రమంపై జాతీయ స్థాయిలోనూ ఆసక్తి వ్యక్తమవుతుంది. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంత బలంగా ఉందో, ప్రజాసమస్యలపై ఎంత దృఢంగా ఉందో ఈ కార్యక్రమం ద్వారా వెల్లడవుతుంది. జిల్లా పార్టీ అధ్యక్షులు కీలకంగా అందరినీ సమన్వయం చేసుకుంటూ దీనిని విజయవంతం చేయాలి.

ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రైతులకు అండగా, ధాన్యం కొనుగోళ్ళు చేపట్టాలని వైయస్ఆర్ సిపి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ శ్రేణులు సైతం భారీగా ఈ కార్యక్రమంలో పాల్గొని, రైతుల గొంతుకగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు కృషి చేయాలి.

## రాజీనామాలకు వెన్ను చూపి పారిపోయిన చరిత్ర రేవంత్ రెడ్డిది

- గురుకులాల్లో 49 మంది విద్యార్థులు చనిపోవడం నువ్వు తెచ్చిన మార్పు
- టీజీ చేయడం, తెలంగాణ తల్లిని మార్చడం కాదు
- తెలంగాణ ద్రోహ చరిత్ర నీది రేవంత్ రెడ్డి
- సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు

**సంగారెడ్డి,మహానాడు:** వంద ఎలుకలు తిన్న రాబందు తీర్థయాత్రలకు పోయినట్లు, దయ్యాలు వేదాలు వల్లించినట్లు రేవంత్ రెడ్డి వైఖరి ఉంది.ఒక్కనాడు జై తెలంగాణ అనలేదు, అమరవీరులకు పువ్వు పెట్టింది లేదు. ఉద్యమంలో ఏనాడూ పాల్గొన్న వ్యక్తి కాదు.

డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటన కేసీఆర్ ఆమరణ దీక్ష ఫలితం ఎవరో దయ వల్ల తెలంగాణ వచ్చింది అనడం ఉద్యమ కారులను, తెలంగాణ వారిని అవమానించడమే. తెలంగాణకు అడుగడుగునా అడ్డు పడ్డది కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ ది ద్రోహాల చరిత్ర.

2001లో కేసీఆర్ పార్టీ పెట్టకుంటే, పోరాటం చేయకుంటే అసలు తెలంగాణ మాటే లేదు. 2004లో హామీ ఇస్తే కేంద్ర క్యాబినెట్‌లో చేరారు. తెలంగాణ ఇవ్వక పోగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకునే ప్రయత్నం చేశారు. ఉద్యమాన్ని కాలరాసే ప్రయత్నం చేశారు.కేంద్రంలో మంత్రిగా ఉండి ఆర్ఎస్ఎస్ ఆఫీస్ నుంచి ఆర్ఎస్ యూ ఆఫీసు దాకా తిరిగిండు. దేశంలో 32 రాజకీయ పార్టీలను ఒప్పించి మెప్పించి ప్రణబ్ ముఖర్జీ కి లేఖ ఇచ్చింది కేసీఆర్.

చివరకు కేసీఆర్ కేంద్ర మంత్రి పదవికి, ఎంపీ పదవికి రాజీనామ చేసి ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. డిసెంబర్ 9 ప్రకటన కేసీఆర్ పోరాట ఫలితం కాదా చిదంబరం జయశంకర్ కి ఫోన్ చేసారు. జయశంకర్ , కేసీఆర్ రాసి ఇచ్చిందే చిదంబరం చదివారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం అయిందని ప్రకటించారు. నవంబర్ 29 లేకుంటే, డిసెంబర్ 9 లేదు, ఇవి లేకుంటే జూన్ 2 తెలంగాణ ఏర్పాటు లేదు.

చంద్రబాబును ఎవరు నిలదీస్తున్నరు అని రైఫిల్ పట్టుకొని ఉద్యమ కారుల మీదికి వెళ్లింది ఈ రైఫిల్ రెడ్డి. రాజీనామాలకు వెన్ను చూపి పారిపోయిన చరిత్ర రేవంత్ రెడ్డిది. వంట వార్పులో, రైలు రోకోలో, మిలియన్ మార్చులో, సకల జనుల సమ్మెలో, సాగర హారంలో రేవంత్ రెడ్డి లేడు. ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది ఉద్యమం గురించి

నీ ద్రోహ చరిత్ర, రెండు కళ్ల సిద్దాంతం సేవలో ఉన్నవు.

తెలంగాణ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. రేవంత్ రెడ్డి మీద ఒక్క కేసు అయినా ఉన్నదా



నాడు సోనియా బలి దేవత అన్నడు, నేడు దేవత అంటున్నడు.

నాడు తెలంగాణ ఉద్యమానికి ద్రోహం చేసాడు, వెన్నుపోటు పొడిచాడు. వక్రీకరించిన మాత్రాన తెలంగాణ చరిత్ర చెరిగిపోదు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడా పెట్టలేదని రేవంత్ మాట్లాడటం సిగ్గుచేటు. అవగాహన రాహిత్యం. సంగారెడ్డి కలెక్టరేట్ లోనే జూన్ 2, 2015 నాడు నేను, ఎమ్మెల్యే, కలెక్టర్ రాహుల్ బొజ్జా కలిసి విగ్రహం ఆవిష్కరించాం.

అమరుల స్తూపం కూడా ఆవిష్కరించాం.

సచివాలయం ముందు అమరుల స్తూపం ముందు తెలంగాణ తల్లి కాంస్య విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారు. భారత మాతను ఏ పార్టీ మార్చలేదు.

మార్పు మార్పు అని ఏం చేసావు

కేసీఆర్ కిట్ బంధు, న్యూట్రీషన్ కిట్టు బంధు, దళిత, బీసీ, రైతు బంధు బంద్ పెట్టినవు. గురుకులాల్లో 49 మంది విద్యార్థులు చనిపోవడం నువ్వు తెచ్చిన మార్పు. టీజీ చేయడం, తెలంగాణ తల్లిని మార్చడం కాదు.. తెలంగాణ ద్రోహ చరిత్ర నీది రేవంత్ రెడ్డి.

## వైసీపీపై బిజెపి ఎమ్మెల్యేలు ఫైర్

- వైసీపీ స్కాంలు వెలికి తీయడానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి
- బిజెపి ఫ్లోర్ లీడర్ పెన్మత్స విష్ణు కుమార్ రాజు
- బిసీలకు రాజ్యాధికారం ఇచ్చిన పార్టీ బిజెపి మాత్రమే
- ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

**విజయవాడ,మహానాడు:** బిజెపి రాష్ట్ర కార్యాలయ లో వారధి కార్యక్రమం లో భాగంగా ప్రజల వద్ద నుండి సమస్యలు స్వీకరించే కార్యాక్రమంలో బజెపి ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ వి పార్థ సారధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమను కలసిన పాత్రికేయులతో ఇరువురు మాట్లాడారు.

వైసీపి ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కుంభకోణాలు వెలికి తీసి దర్యాప్తు చేయడానికి కూటమి ప్రభుత్వం ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని బిజెపి ఫ్లోర్ లీడర్ పెన్మత్స విష్ణుకుమార్ రాజు డిమాండ్ చేశారు. జగన్ ఆర్థిక స్కాం పై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలి.

2019-24 మధ్య ఏపీని అన్ని విధాలా నాశనం చేశారు. వైయస్ బిడ్డగా అవకాశం ఇస్తే అడ్డగోలుగా దోచారు.ఈసారి రెండు స్థానాలు కూడా జగన్ కు వచ్చే అవకాశం లేదు.జగన్ చేసిన అన్ని స్కాంల పైన ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖ ను పెట్టాలని సిఎంను కోరుతున్నా.వైసిపి నాయకులు చాలా మంది దుర్మార్గంగా వ్యవహరించారు. కాకినాడ పోర్ట్‌ను కెవి రావును బెదిరించి లాక్కున్నారు. వాటిపై విచారణ చేసి కెవి రావుకు ప్రభుత్వం న్యాయం చేయాలి.జగన్ అదానీ మధ్య జరిగిన ఒప్పందం లో 1750. కోట్లు అవినీతి జరిగింది.జగన్ డబ్బులు తీసుకున్నట్లు దర్యాప్తు సంస్థ లు నిర్ధారించాయి.ఈ స్కాం పై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేసి చర్యలు తీసుకోవాలి.

దోపిడీలు చేసి ఎవరికి వారు ఆర్థికంగా దోచుకుంటే ఎలా.ప్రజల సొమ్ములను కొట్టేసిన వారిని శిక్షించాలి.జగన్ ధన దాహానికి ఇప్పుడు ప్రజల పై విద్యుత్ భారం పడింది. 650 కోట్లకు గంగవరం ప్రాజెక్టు ను ఎలా అప్పగించారు.అదానీ ఏమైనా నీ తలమీద తుపాకీ పెట్టి ఇవ్వమన్నారా.జగన్ హయాంలో అత్యంత దారుణంగా, నిస్సిగ్గుగా దోపిడీ చేశాడు. కూటమి ప్రభుత్వంలో గత ప్రభుత్వం తాలూకా స్కాంలపై ఒక్కో విషయం తెలుస్తుంటే మతి పోతుంది.

విశాఖలో అడ్డగోలుగా భూములను భయపెట్టి దోచుకున్నారు. ప్రైవేటు ఆస్తులను కూడా బలవంతంగా లాక్కున్నారు.జగన్ తనఇంటిని మొత్తం పూర్తిగా మూసి వేశారు. ఒకసారి వాస్తు ను కూడా పరిశీలించండి అంటూ వ్యంగ్యోక్తులు విసిరారు.వచ్చే ఎన్నికలలో ఎలాగూ వైసిపి ఓటమి ఖాయం.కనీసం మీరైనా అసెంబ్లీకి వచ్చేలా పని చేసుకోండి అంటూ వైసీపిపై విమర్శల బాణాలు సంధించారు.

ఎమ్మెల్యే డాక్టర్ వి పార్థసారధి మాట్లాడూతూ.. వైసీపికి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఏవిషయం దొరకడంలేదు




కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వరుస క్రమంలో అమలు చేయడం జరుగుతుందన్నారు. బిజెపిలో బీసీ లందరూ చేరేందుకు సిద్దంకావాలని పిలుపు ఇచ్చారు.

బిసీ లకు రాజ్యాధికారం ఇచ్చిన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రేమే నని నొక్కి వక్కాణించారు. ఆర్ కృష్ణయ్య ను దేశ రాజకీయాల్లో కీలక పాత్ర కోసం జాతీయ పార్టీ రాజ్యసభకు ఎంపిక చేసిందన్నారు. దేశ హితం కోసం భవిష్యత్ లో అనేక బిల్లులు పార్లమెంటు ముందుకు రావలసిన అవసరం ఉందన్నారు అందువల్ల క్రుష్ణయ్యకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. సానా సతీష్,బీదా మస్తాన్, ఆర్ క్రుష్ణయ్య ల నామినేషన్ల స్క్రూట్నీ పూర్తి అయ్యిందని, ప్రకటించడం లాంఛనమే నని పార్థసారధి వివరించారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం కాపుగోపాలపురం గ్రామానికి చెందిన బడియాల అప్పల నాయుడు వరి రైతు పడుతున్న ఇబ్బందులు వారధిలో ఫిర్యాదు చేశారు. వరిని మిషన్ ద్వారా కటింగ్ చేయడానికి కూడా ఇబ్బందులు పడుతున్నామని అదేవిధంగా సకాలంలో గొనె సంచులు ఇవ్వడం లేదని ఆభారమంతా రైతు లపైనే పడుతోందని వాపోయారు.ధాన్యం అమ్మకాలలో ట్రేడర్లే రాజ్యమేలుతున్నారని అందువల్ల వరిరైతుకు కష్టానికి తగ్గ ఫలితం అందడంలేదని వాపోయారు.

వెంటనే ఈ విషయం ప్రభుత్వం ద్రుష్టికి తీసుకుని వెడతామని బిజెపి ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేతలు పైడి వేణు గోపాల్, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.


## మోహన్ బాబుకు తెలంగాణ హైకోర్టులో ఊరట

- పోలీసులు జారీ చేసిన నోటీసులపై హైకోర్టు స్టే
- పోలీసుల ముందు విచారణకు హాజరయ్యేందుకు ఈ నెల 24వ తేదీ వరకు మినహాయింపు

**హైదరాబాద్,మహానాడు:** మోహన్ బాబుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. మోహన్ బాబుకు పోలీసులు జారీ చేసిన నోటీసులపై హైకోర్టు స్టే ఇచ్చింది. మోహన్ బాబు, మంచు మనోజ్ పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఇరువురికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. రాచకొండ పోలీసులు తనకు ఇచ్చిన నోటీసులపై స్టే ఇవ్వాలని కోరుతూ మోహన్ బాబు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం రాచకొండ పోలీసులు జారీ చేసిన నోటీసులపై స్టే ఇచ్చింది.

పోలీసుల ముందు విచారణకు హాజరయ్యేందుకు ఈ నెల 24వ తేదీ వరకు మినహాయింపు ఇచ్చింది. జస్టిస్ బి.విజయసేన్ రెడ్డి ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

మోహన్ బాబుపై నమోదైన కేసులను ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు వివరించారు. పరస్పర ఫిర్యాదులతో కేసులు నమోదైనట్లు తెలిపారు. నిన్న జర్నలిస్ట్‌పై దాడి కేసులో మోహన్ బాబుపై మరో క్రిమినల్ కేసు నమోదైందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వ్యవహారంలో పోలీసుల నోటీసులు అందుకున్న మంచు మనోజ్ ఈ రోజు విచారణకు హాజరయ్యారని కోర్టుకు తెలిపారు.



మోహన్ బాబు ఇంటి వద్ద గస్తీ ఏర్పాటు చేయాలని ఆయన తరఫు న్యాయవాది కోర్టును కోరారు. అయితే నిత్యం గస్తీ ఏర్పాటు చేయడం కుదరదని.. రెండు గంటలకు ఓసారి పోలీసులు అక్కడి పరిస్థితులను గమనించి వస్తారని ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో.. రెండు గంటలకోసారి పోలీసులు మోహన్ బాబు ఇంటి వద్దకు వెళ్లాలని హైకోర్టు ఆదేశించింది.

## పెద్ద ప్రాజెక్టు నిర్మాణంలో చిన్న తప్పులు జరగడం సహజం..

- కమీషన్లు అన్నం పెట్టవు.
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, జిల్లాపరిషత్ మాజీ చైర్పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కార్మిక విభాగం నేత రూప్ సింగ్

**హైదరాబాద్, మహానాడు:** ఎస్సారెస్పీ పేస్ 1,పేస్ 2కు నీళ్లు ఇవ్వలేము యాసంగి పంట తక్కువ వేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం. రైతులకు యాసంగి పంట ముఖ్యమైనది. మెడిగడ్డ ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చేతిలో నిర్ణయం ఉందని ప్రభుత్వం అంటోంది.

డ్యామ్ సేఫ్టీ చట్టంలో ఎక్కడా ప్రాజెక్టు రిపేర్లు చేయడానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ పర్మిషన్ తీసుకోవాలని లేదు. వేల టీఎంసీల నీళ్లు సముద్రం పాలు అయ్యాయి. రైతుల యాసంగి పంటకు చివరి తడి నీళ్లు ఇవ్వలేని పరిస్థితి వచ్చింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలపై పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి సూచనలు చేసే అధికారం మాత్రమే ఉంది. వేల టీఎంసీల నీళ్లు వెళ్లినా



మేడిగడ్డ ప్రాజెక్టుకు ఏం కాలేదు. రిక్టర్ స్కేల్‌పై 5.3 భూకంపం వచ్చినా మేడిగడ్డ ప్రాజెక్టుకు ఏం కాలేదు.

కేసీఆర్‌ను బద్నాం చేయడానికి మేడిగడ్డ ప్రాజెక్టు కుంగింది అని చెప్పి కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారు. కమీషన్లు ఏం చేస్తాయి కమీషన్లు అన్నం పెట్టవు. పెద్ద ప్రాజెక్టు నిర్మాణంలో చిన్న తప్పులు జరగడం సహజం. తప్పు జరిగితే చర్యలు తీసుకోండి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులతో వెంటనే సమీక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాను.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 12, డిసెంబర్ 2024

## డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 2,85,450

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1 న ప్రారంభమైన మన

మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న

మా అభిమాన పాఠకుల

అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్

మార్తి సుబ్రమణ్యం

సంపాదక సారథ్యంలో





బోడపూడి సుబ్బారావు (BSR)

సారథ్యంలో



# కేంద్రమంత్రి దృష్టికి నెల్లూరు మత్స్యకారుల సమస్యలు

- పైడేరుకు ఇరువైపులా డ్రెడ్జింగ్, రివిట్‌మెంట్ పనులు చేపట్టండి
- రాజీవ్ రంజన్ సింగ్‌ని కోరిన ఎంపీ వేమిరెడ్డి



**న్యూఢిల్లీ, మహానాడు:** జిల్లాలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ, మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తో భేటీ అయి జిల్లాలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. కేంద్ర మంత్రికి ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ వేమిరెడ్డి.. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) కింద, మత్స్యకార సమాజం ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు లోతైన సముద్రపు చేపల వేట నౌకల కొనుగోలుకు మద్దతు కోసం పథకం ప్రవేశపెట్టబడిందన్నారు. అయితే, నెల్లూరు జిల్లాల సంప్రదాయ మత్స్యకారులకు గణనీయమైన ప్రాముఖ్యత ఉన్న నేపథ్యంలో పథకం కింద ప్రస్తుతం ఉన్న నిబంధనలు సవాలుగా మారాయన్నారు. ప్రత్యేకంగా యూనిట్ ధర, సబ్సిడీ, మెరుగైన ఉత్పాదకత, ఆదాయం కోసం తమ నౌకలను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం, డీప్ సీ ఫిషింగ్ నౌకల యూనిట్ ధర రూ.120.00 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ రూ.72.00 లక్షలు(60%), ఓసీ అండ్ బీసీలకు సబ్సిడీ రూ.48.00 లక్షలు (40%) గా ఉందన్నారు. అయితే, సంప్రదాయ మత్స్యకారులు ఇంత ఆర్థిక భారాన్ని మోసే స్థితిలో లేరని చెప్పారు. అలాగే బోగోలు మండలం జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభించిన నేపథ్యంలో పెద్ద ఓడలకు బదులుగా సులభమైన నిర్వహణ, తక్కువ ఖర్చుతో కూడిన మధ్య తరహా బోట్లను అందించాలని కోరారు.

అలాగే మత్స్యకారులపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి ప్రస్తుతం ఇస్తున్న 40% సబ్సిడీ సరిపోదని వివరించారు. గతంలో బ్లూ రివల్యూషన్ లేదా ఫిషరీస్ డెవలప్‌మెంట్ స్కీమ్స్ (ఎఫ్‌డీఎస్) కింద సబ్సిడీ 60% నుండి 75% వరకు ఉండేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సబ్సిడీ భాగాన్ని 40% నుండి 60% వరకు పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అలాగే డీప్‌సీ బోట్ల యూనిట్ ధరను రూ.120.00 లక్షల నుండి రూ.60.00 లక్షలకు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

### పొన్నపూడి పాతూరులో ఫిషింగ్ జెట్టీ

విడవలూరు మండలం, పొన్నపూడి పాతూరు గ్రామం వద్ద ఫిషింగ్ జెట్టీ ఏర్పాటు చేయాలని ఎంపీ వేమిరెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు.. సముద్రంలోకి వెళ్లేందుకు ఉపయోగపడే పైడేరు వాగు సముద్ర ముఖద్వారం వద్ద పూడిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. విడవలూరు మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాల ప్రజల జీవనోపాధి లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పొన్నపూడి పాతూరు గ్రామం వద్ద మత్స్యకార జెట్టీని నిర్మించి మండలంలో నడుస్తున్న 370 బోట్లకు బెర్తింగ్ సౌకర్యం కల్పించాల్సి ఉందన్నారు. ఈ జెట్టీ ఏర్పడితే తుపానుల సమయంలో పడవలను రక్షించడమే కాకుండా చేపల ల్యాండింగ్‌లను అన్‌లోడ్ చేయడానికి సురక్షితమైన ప్రాంతంగా మారుతుందన్నారు. అలాగే ప్రాజెక్ట్ పైడేరు వెంట ఉన్న 12 గ్రామాల్లో నివసిస్తున్న 1750 కుటుంబాలకు చెందిన సుమారు 6,000 మంది మత్స్యకారులకు నేరుగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. జెట్టీ ఏర్పాటుకు సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### పైడేరుకు ఇరువైపులా డ్రెడ్జింగ్, రివిట్‌మెంట్ పనులు

పైడేరు వాగు పొన్నపూడి పాతూరు గ్రామ సమీపం నుంచి 2 కిలోమీటర్ల మేర ప్రయాణించి సముద్రంలో కలుస్తుందని, ఈ కలిసే ప్రాంతం శాశ్వతంగా పూడిపోవడంతో స్థానిక మత్స్యకారులు తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. దాంతో మత్స్యకారులు ప్రస్తుతం ఇస్కపల్లి మీదుగా సముద్రంలోకి ప్రవేశించడానికి 6 కి.మీ.ల అదనపు దూరం ప్రయాణించవలసి వస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో సముద్ర ముఖద్వారాన్ని శాశ్వతంగా తెరిచేందుకు పైడేరుకు ఇరువైపులా డ్రెడ్జింగ్, రివిట్‌మెంట్ పనులు అవసరమని వివరించారు. డ్రెడ్జింగ్, రివిట్‌మెంట్ పనులు పూర్తయితే మత్స్యకారుల విలువైన ప్రయాణ సమయం ఆదా అవడంతో పాటు జీవనోపాధి మెరుగుపడుతుందని చెప్పారు.

ఈ నేపథ్యంలో తన ప్రతిపాదనలను పరిశీలించి సంబంధిత అధికారులకు ముందస్తు అధ్యయనాన్ని నిర్వహించేలా ఆదేశించాలని మంత్రిని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రతిపాదనపై స్పందించిన కేంద్ర మంత్రి తప్పకుండా పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి తప్పకుండా ప్రాధాన్యమిచ్చేలా కృషి చేస్తామని వివరించారు.

# కూటమి పాలనలో ఆనందంగా రాష్ట్రం!

- 6 నెలల్లో బోలెడు విజయాలు
- దమ్ముంటే చర్చకు రావాలంటూ పిలుపు
- జగన్‌కు టీడీపీ నేతలు సవాల్



**మంగళగిరి, మహానాడు:** ప్రజలు తమకు కావాలని కోరి తెచ్చుకొని మెచ్చుకున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. జగన్ ఏనాడైనా సమీక్షలు నిర్వహించారా చంద్రబాబు ఎప్పుడూ సమీక్షలు నిర్వహిస్తుంటారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం సమీక్షలు చేస్తూ.. ప్రజలకు దగ్గరగా ఉండాలన్నదే చంద్రబాబు విధానం, నినాదమని మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు.

2014నుండి 2019 వరకు చంద్రబాబు పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలన లో ప్రజలు కష్టాలు అనుభవించారు. వైసీపీ ప్రజలను నమ్మించి మోసం చేసింది. 2019-24 కాలంలో ప్రజలు స్వేచ్ఛా, స్వాతంత్రాలు కోల్పోయారు. బ్రిటీష్ వారితో పోరాడి సాధించుకున్న స్వేచ్ఛా స్వాతంత్రాలను వైసీపీ పాలనలో మరోసారి కోల్పోవడం బాధాకరం, విచారకరం. ఆ భయంకర పరిస్థితులను భరించలేక ప్రజలు తిరుగుబాటు చేసి వైసీపీని ఓడించారన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు తమ ఆస్తులకు, మాన ప్రాణాలకు రక్షణ లేకుండా బతికారు. ఆస్తుల విషయంలో బహిరంగంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తీసుకొచ్చారు. వారికి అనుకూలమైన వ్యక్తులను పెట్టి ప్రజల ఆస్తులను లూటీ చేశారు. ప్రభుత్వమే ఇలాంటి చర్యలకు పాల్పడితే ఇక ఎవరితో చెప్పు కోవాలి. వైసీపీ ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసిందని నమ్మి మరలా చంద్రబాబుకే పట్టం కట్టారు. ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని జనార్దన్ అన్నారు.



టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమి ప్రభుత్వంగా మారి అధికారంలోకి వచ్చి నేటికి ఆరు నెలలు గడిచింది. జూన్ 12న చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. నాటి నుండి ఈ రాష్ట్రానికి దశ తిరిగింది. వైసీపీ ప్రభుత్వానికి, చంద్రబాబు ప్రభుత్వానికి ఏనుగుకు దోమకు ఉన్నంత తేడా ఉంది. ఆరు నెలలో కూటమి ప్రభుత్వం టాప్ విజయాలు. చంద్రబాబు ప్రభుత్వం పింఛను ఒకేసారి రూ.1000 పెంచి రూ.4 వేలు 1వ తేదీనే ఇళ్ల వద్ద ఇవ్వడం జరుగుతోంది. ఏడాదికి రూ.33 వేల కోట్లు, ఐదేళ్ళల్లో రూ.1.60 లక్షల కోట్లు పింఛన్‌లకు ఖర్చు. ఇది దేశంలోనే రికార్డ్. గత జగన్ ప్రభుత్వం మొదటి 4 నెలల్లో పింఛన్‌లు రూ.250 పెంచడం తప్ప మరే ఇతర నవరత్న హామీలను అమలు చేయలేదు. 198 అన్న క్యాంటిన్లను తిరిగి ప్రారంభించి పేదల ఆకలి తీర్చుతోంది. దీపం-2 కింద ఇప్పటికే 80 లక్షలకు పైగా ఉచిత గ్యాస్ సిలిండర్ల బుక్ చేసుకున్నారు. ఇలా మరికొన్నింటిని సాధించిందన్నారు.

గురజాల మాల్యాద్రి మాట్లాడుతూ.. జగన్ రెడ్డి తెలుగుదేశం హామీల అమలులో ఫెయిల్ అయిందని అబద్ధాలు ఆడుతున్నారు. వైసీపీపై నిందలు వేస్తున్నారని పదే పదే మాట్లాడడం శుద్ధ అబద్ధం. ప్రతిపక్ష నేతగా జగన్ ఫెయిల్ అయ్యారుగానీ టీడీపీ ప్రభుత్వం ఫెయిల్ కాలేదు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడే నాటికి 10 లక్షల కోట్ల అప్పు ఉంది. తక్షణం చెల్లించాల్సిన బకాయిలు లక్ష కోట్లు ఉంది. జగన్ ఖజానాను దివాలా తీయించాడు. అయినా 6 నెలల్లోనే చంద్రబాబు 400 మంచి పనులతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టాడు. ఏ రాష్ట్రంలో కూడా మొదటి ఆరు నెలల్లోనే ఇన్ని పనులు చేసిన ప్రభుత్వం లేదు. చంద్రబాబు అనుభవం వల్లనే ఇది సాధ్యమైంది. ప్రతిపక్ష నేతగా వైఫల్యం చెందింది జగన్ రెడ్డే. మళ్లీ హామీలు అమలు చేయలేదని బురద జల్లడం విడ్డూరంగా ఉందన్నారు.

# ప్రజా సమస్యలపై సకాలంలో స్పందించాలి

- కలెక్టర్ల సదస్సులో ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా



**అమరావతి, మహానాడు:** ప్రజలకు సంబంధించిన అంశాల్లో అప్రమత్తంగా ఉండాలి. ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వాటిపై సకాలంలో స్పందించి పరిష్కారం దిశగా కలెక్టర్లు, అధికారుల చర్యలు ఉండాలి. పేదలకు సకాలంలో పెన్షన్, రేషన్ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే పేదలకు అవి ఎంతో అవసరమైనవి. వాటి పంపిణీ జరగకపోతే ప్రజలు జీవితాంతం గుర్తుంచుకుంటారని ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రారంభమైన కలెక్టర్‌ల సదస్సులో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. మనది వ్యవసాయాధారిత రాష్ట్రం. జీడీపీలో వ్యవసాయ వాటా మరింత పెరగాలి. రైతులకు ఎరువులు సకాలంలో అందాలి. లేకపోతే అతని జీవితమే తలకిందులవుతుంది. మన జీవితాల్లో మొబైల్ అత్యంత ప్రధానమైపోయింది. వాట్సాప్‌ను మనం విరివిగా వాడతాం. కానీ దాన్ని ప్రణాళికా బద్ధంగా ఎలా ఉపయోగించాలో కూడా తెలుసుకోవాలి.

ఆర్టీసీ బస్సు ఆలస్యంగా వస్తే ప్రజలు ప్రభుత్వాన్ని తిట్టుకుంటారు. అది చెడ్డపేరు తెస్తుంది. ఇలా ప్రజలపై ప్రభుత్వ పనితీరు ప్రభావితం చేసే 10 అంశాలను గుర్తించాం. ఈ అంశాలకు సంబంధించి సమస్యలను పరిష్కరించడంలో జిల్లా కలెక్టర్లందరూ ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. వీటి పరిష్కారంలో ప్రభుత్వానికి ఒక్కోసారి మంచిపేరు రావచ్చు చెడ్డపేరూ రావొచ్చు.

అది గమనిస్తూ అధికారులు తదుపరి కార్యాచరణతో ముందుకెళ్లాలి. ఆయా జిల్లాలో ప్రజా సమస్యలపైన అన్ని మాధ్యమాల్లో వచ్చే సమాచారం మొత్తం కలెక్టర్లు సులభంగా వీక్షించగలిగే సదుపాయం కల్పిస్తాం. దీనిద్వారా అనాలసిస్ కూడా చేస్తాం. అలాగే ప్రభుత్వం, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తాం.

### 48 గంటల్లో ధాన్యం డబ్బులు జమపై రైతుల సంతృప్తి

ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ కావడం పట్ల రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. 94.16 శాతం మంది రైతులు తమకు 48 గంటల్లోనే డబ్బులు పడ్డాయని చెప్పారు. తమ ధాన్యం నాణ్యతకు తగ్గ ధర చెల్లించినట్లు 91.6 శాతం మంది రైతులు చెప్పారు. అలాగే ఇంటికే వచ్చి పింఛను ఇస్తున్నారి 87 శాతం మంది చెప్పారు. ఏదైనా కొత్త విషయం చెబితే దాన్ని వెంటనే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా ఉండరు. తర్వాత వాళ్లు అది సాధ్యమేనని నమ్మడం ప్రారంభిస్తారు. మెల్లగా ఆచరణలో పెట్టి విజయం సాధిస్తారు. తర్వాత ప్రపంచం మొత్తం ఆ విషయాన్ని ఇంతకు ముందే ఎందుకు నమ్మలేదని ఆశ్చర్యపోతుంది.







# సర్వే కోసం అర్జీ పెట్టుకున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు!

- భూ సమస్యల పరిష్కారానికి టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జీదారుల వినతి
- వినతులు స్వీకరించిన టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు కావలి ప్రతిభా భారతి, ఎమ్మెల్యే గల్లా మాధవి

**మంగళగిరి, మహానాడు:** తెలుగుదేశం పార్టీ(టీడీపీ) జాతీయ ఉపాధ్యక్షురాలు కావలి ప్రతిభా భారతి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవిలు బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్జీ దారుల నుండి వినతులు స్వీకరించారు. వారి సమస్యలు విని వాటి పరిష్కారానికి కృషి చేశారు.

- నంద్యాల టౌన్ లోని ఉప్పరిపేటకు చెందిన పసుపులేటి లక్ష్మీదేవి విజ్ఞప్తి చేస్తూ.. నంద్యాల మండలంలోని కొత్తపల్లె గ్రామంలో తన భర్త పేరుమీద ఉన్న భూమిలో ఒక ఎకరా అమ్ముకొని తన కూతురికి పెళ్లి చేశామని, అయితే, ఆ పొలంలో భాగం ఉందంటూ.. తన భర్త చిన్నాన్న కొడుకు, తన భర్త చెల్లెలు తమపై దాడి చేసి ఇంటికి తాళం వేశారని.. వారికి సంబంధం లేకపోయినా కోర్టుకు వెళ్లారని.. సమస్య కోర్టులో ఉన్నా కూడా తమను బెదిరిస్తున్నారని.. వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.
- తన పొలాన్ని కబ్జా చేసి.. తనపై దాడులు చేస్తూ.. తనను చంపేందుకు చూస్తున్న కబ్జాదారులు.. వారికి కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని తన భూమిని విడిపించి తనకు న్యాయం చేయాలని బాపట్ల జిల్లా చుండూరుకు చెందిన సిడెపూడి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు.
- పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన పలువురు విజ్ఞప్తి చేస్తూ.. ఎస్సీ, ఎస్టీలమైన తమకు గతంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలను మంజూరు చేసిందని.. దాన్ని 2019 లో రద్దు చేశారని.. తమకు మళ్లీ ఇళ్ల స్థలాలను కేటాయించి ఇవ్వాలని వారు నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- గుంటూరులో నివాసం ఉంటున్న యాగాల కోటేశ్వర రావు విజ్ఞప్తి చేస్తూ.. సంతమాగలూరు మండలంలోని తమ గ్రామం ఫతేపురంలో తమకు 1.56 సెంట్ల భూమి ఉందని.. ఆ భూమిని సర్వే చేయమని ఎన్ని సార్లు అర్జీ పెట్టుకున్నా సర్వేయర్లు పట్టించుకోవడం లేదని.... తమ భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.
- నెల్లూరు జిల్లా అనుమసముద్రం మండలం చిరమన గ్రామానికి చెందిన చల్లకొలుచు మాలకొండయ్య విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమిని అక్బరాబాద్ అనే వ్యక్తి గతంలో కబ్జా చేశారని.. దానిపై ఎవరిని న్యాయం అడిగినా నాడు పట్టించుకోలేదని తనకు తన భూమిని విడిపించి ఇప్పించవలసిందిగా విన్నవించాడు.



- గతంలో రేపల్లె మండలం రాజుకాలువ గ్రామంలో తన తండ్రికి గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూమిపై తమకు హక్కులు కల్పించాలని అధికారులు చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని.. ఇప్పటికీ తమ తండ్రి పేరే ఆన్ లైన్ లో ఉంటే.. అధికారులు మీకు ఇక్కడ భూమి లేదని మాతో అబద్దాలు చెబుతున్నారని.. అధికారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కృష్ణా జిల్లా గుడివాడ మండలం మందపాడుకు చెందిన కర్ర యోహాను విజ్ఞప్తి చేశారు.

# కూటమి పాలనలో భూకబ్జాదారుకి భయం పుట్టాలి!

- మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి, మహానాడు:** సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా విజన్ ఆంధ్రా - 2047 లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. పేదవాడికి మెరుగైన జీవనం కల్పించాలని తపన పడే వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఆంధ్రాకు మంత్రి నారా లోకేష్ ఒక బ్రాండ్ అంబాసిడర్.

ఈ రాష్ట్రానికి వారసత్వంగా అప్పులు, భూకబ్జాలు, డ్రగ్స్ మాఫియా వచ్చాయి. కాని అందరికీ వారసత్వంగా వచ్చే భూమిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అలాంటి భూమి కబ్జాకు గురి అయ్యిందంటే ఆ బాధ వర్ణనాతీతం. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఎన్నో భూకబ్జాలు జరిగాయని కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. భూఅక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టించేలా ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ రద్దు చేశామని తెలిపారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే..

ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ రద్దుపై అసెంబ్లీలో ఆమోదం లభించింది.. త్వరలోనే చట్టం కాబోతోంది. ల్యాండ్ గ్రాబింగ్‌కు పాల్పడితే పదేళ్ల జైలు శిక్ష వంటి కఠిన నిర్ణయాలు తీసుకోబోతున్నాం. రాబోయే రోజుల్లో పేదవాడికి తన భూమిపై హక్కులు కల్పించేలా చేస్తాం. గత ప్రభుత్వంలో 9.26 లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్ పేరుతో చేశారు.. అందులో 4.21 లక్షల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి అంటే 45 శాతం భూములు కబ్జా చేశారని తేలింది. వీరందరికీ నూతన చట్టంతో గుణపాఠం చెప్పబోతున్నాం. గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాల పేరుతో మరో స్కాం చేశారు.. ప్లాట్లను తీసుకున్నవారు అమ్ముకోవచ్చని చెప్పారు. అలా చేసిన వారందరిపై చర్యలు తీసుకుంటాం. 45 వేల ఎకరాలను వారి అనుయాయులకే అసైన్డ్ చేశారు.

గ్రీవెన్స్ లో రెవెన్యూ శాఖలోనే అత్యధిక ఫిర్యాదులు వచ్చాయి. భూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఈనెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. వస్తున్న ఫిర్యాదులపై అక్కడికక్కడే పరిష్కరించే చర్యలు చేపడుతున్నాం. అక్రమాలకు పాల్పడిన అధికారులపైనా చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు 31,324 గ్రీవెన్స్ వస్తే వాటిలో 400 సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించాం. మిగతా వాటిని వెంటనే ఎందుకు పరిష్కరించలేకపోయామనే దానిపై పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. రీసర్వేపై ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగించాల్సిన అవసరం ఉంది.

గత ప్రభుత్వంలో సర్వే రాళ్లు, భూహక్కు పత్రాలపై కూడా వాళ్ల బొమ్మలు వేయించుకున్నారు.. ఇప్పుడు రూ.12 కోట్లు వెచ్చించి వాటిని తొలగిస్తున్నాం. గ్రీవెన్స్ లో వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించాకే రాజముద్ర, క్యూఆర్ కోడ్, ల్యాండ్ మ్యాప్ తో కూడిన భూహక్కు పత్రాలు అందిస్తాం. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచేది కలెక్టర్లు. రాష్ట్రాభివృద్ధిలో ఐఏఎస్ ఆఫీసర్లకు ఇదొక మంచి అవకాశం..

రాబోయే రోజుల్లో ఎలాంటి భూసమస్యలు లేకుండా చేద్దాం. సమస్యలకు పరిష్కారం చూపించేలా ఈ సదస్సులో చర్చిద్దాం.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 12, డిసెంబర్ 2024



## రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేద్దాం..

● మంత్రి పయ్యావుల కేశవ్



**అమరావతి, మహానాడు:** రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేద్దామని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, కమర్షియల్ ట్యాక్సెస్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. కలెక్టర్ సదస్సులో ఇంకా ఆయన ఏమన్నారంటే.. ప్రజల ఆశ లకు, ఆశయాలకు అనుగుణంగా ఈ సమావేశంలో చర్చిద్దాం.. సీఎం చంద్రబాబు సూచనలు, సలహాలకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేద్దాం.. 1994 నుండి అంటే దాదాపు 30 ఏళ్ల నుండి సీఎం చంద్రబాబు గారితో ప్రయాణం చేస్తున్నాం.. చంద్రబాబు మొదటిసారి సీఎం అయినప్పుడు ఎంత తపనతో పని చేశారో ఇప్పుడు కూడా అదే కమిట్‌మెంట్‌తో ముందుకెళ్తున్నారు.. మిగిలిన జీవితం ప్రజల కోసమే, ప్రతి పనిలోనూ మానవత్వం ఉండాలనే విధంగా అదే తపనతో పరిపాలన అందిస్తున్నారు.

చంద్రబాబు పనితీరు అందరికీ మార్గదర్శకం.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వారసత్వంగా వచ్చిన ప్రధాన సమస్య రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పు.. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి నెలలో 99 శాతం రాష్ట్ర ఆదాయం జీతభత్యాలకే సరిపోయిన పరిస్థితి.. అంతకుముందు రెండేళ్లు 107 శాతం రాష్ట్ర ఆదాయం జీతభత్యాలకే వెచ్చించిన పరిస్థితి..

ఒక లక్షా 14 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.. గత ప్రభుత్వంలో ప్రతి వ్యవస్థను నిర్వీర్యం చేశారు..

– తాజాగా రెండు జిల్లాల్లో రివ్యూ చేపట్టడం జరిగింది.. వాస్తవ పరిస్థితులు చూస్తే చాలా బాధనిపిస్తోంది.. రూ.3 కోట్లు ఖర్చు పెడితే సరిపోయేది కానీ అలా కూడా చేయలేదు..దీంతో కేసీ కెనాల్ గత ఐదేళ్లలో నాశనం అయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒకవైపు అప్పులు, ఆగిపోయిన ప్రాజెక్టులు, మరోవైపు ప్రజల ఆశలు, ఆకాంక్షలు.. మరో వ్యక్తి అయితే నిద్రపోలేని పరిస్థితి.. కానీ సీఎం చంద్రబాబు ప్రజాక్షేమమే ధ్యేయంగా కష్టపడుతున్నారు.. నేను ఈరోజు ఒక ఆర్థిక శాఖ మంత్రిగా ఈ స్థాయికి రావడం వెనుక సీఎం అందించిన ప్రోత్సాహం.. మనమంతా ఆయన అడుగుజాడల్లో పని చేద్దాం.. ఆయన హైదరాబాద్ ని ఎలా ట్రాన్స్ ఫార్మ్ చేశారో అనేది గమనించండి. ఈ రాష్ట్రాన్ని కూడా మళ్లీ పరుగులు పెట్టిస్తారు.

10 యూనివర్సిటీల్లో నేర్చుకోలేనిది ఒక చంద్రబాబు వద్ద నేర్చుకోవచ్చు. చంద్రబాబు వద్ద పనిచేయడం ఒక గొప్ప అవకాశం.. ప్రతి రూపాయి సంపాదించడానికి ఎంతో కష్టపడు తున్నాం. మిగిలిన శాఖలు కూడా ప్రతి రూపాయి ఖర్చు చేసేటప్పుడు జాగ్రత్తగా ఆలోచించి ఖర్చు చేయాలి. ముఖ్యమంత్రి ఈ ఆరు నెలల్లో మూడు నెలల పాటు తన డిన్నర్‌ని సెక్రటరి యేట్‌లో చేశారు.. ఆయన ఎందుకు అంత కష్టపడుతున్నారు అంటే ప్రజలకు సేవ చేయాలి, పని చేయాలి అనే తపన.. ఆయన పని చేస్తున్న తీరు చూస్తే, మనలో ఓ నమ్మకం ఏర్పడుతుంది.. ఈ రాష్ట్రాన్ని పునర్మించడానికి మనవంతు పని చేద్దాం.. మన సీఎం టీమ్ గా.. ప్రజల కోసం పనిచేద్దాం.. రాష్ట్ర ప్రజలకు నమ్మకాన్ని ఇచ్చే పరిస్థితుల్లో మీరున్నారు.. దీన్ని సద్వినియోగం చేసుకుందాం..

## వాట్సాప్‌తో ప్రభుత్వ సేవలు అందించవచ్చు

◆ వాట్సాప్ గవర్నెన్స్‌పై దినేష్ కుమార్



**అమరావతి, మహానాడు:** ఇన్నాళ్లు సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం స్మార్ట్ గవర్నెన్స్‌లో భాగంగా వర్చువల్‌గా సేవలందించేందుకు సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగానే వాట్సాప్ ద్వారా ప్రజలకు సేవలందించేందుకు మెటాతో ఈ యేడాది అక్టోబర్ 22న ఒప్పందం కుదుర్చు కుంది. వాట్సాప్ ద్వారా ప్రజలకు ఏ విధంగా సేవలందించ గలుగుతాం, మెటాతో ఏఐ ద్వారా ప్రజలకు ఏ స్కిల్లింగ్ ఇవ్వగలుగుతామన్నది చూడాలని డ్రోన్ కార్పొరేషన్ చైర్మన్ దినేష్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ల సదస్సులో వాట్సాప్ గవర్నెన్స్‌పై మాట్లాడారు.

దేశంలో ప్రస్తుతం 59 కోట్ల మంది వాట్సాప్ వాడుతున్నారు. రోజూ ఒక్కొక్కరు సగటున 30 సార్లు వాట్సాప్‌ను సెల్ ఫోన్‌లో తెరుస్తున్నారు. ఎక్కువ మంది, ఎక్కువ సమయం వినియోగిస్తున్న తరుణంలో వాట్సాప్ ద్వారా విరివిగా సేవలందించవచ్చు. అత్యవసర సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడం, మౌలిక వసతలు కల్పించే ప్రాంతంలో స్థానిక ప్రజలకు సమాచారం పంపడం, ఈ క్రాప్‌లో నమోదైన రైతులు ఏ సమయంలో ఏ మందులు వాడాలనేదిపై కూడా సమాచారం అందించవచ్చు. పంట ఉత్పత్తులను విక్రయించేందుకు మార్కెటింగ్ కు సంబంధించి సమాచారాన్ని ముందే అందించడం ద్వారా రైతులను అప్రమత్తం చేయొచ్చు.

వాట్సాప్ ద్వారానే సులభంగా పన్ను చెల్లింపులు చేయొచ్చు. వాట్సాప్ ద్వారా దేవాదాయ, రెవెన్యూ, మున్సి పల్ శాఖలకు సంబంధించిన సేవలను అందించవచ్చు. ఫేజ్–1లో 100 నుండి 150 సేవలను అందుబాటులోకి తీసుకురానున్నాం. ఆదాయ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్, క్యాస్ట్, స్టడీ సర్టిఫికేట్‌లను వాట్సాప్ ద్వారా ప్రజలకు చేర వేయవచ్చు.

సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... యూజర్లతో ఫ్రెండ్లీగా ఉండాలి. వాట్సాప్ ద్వారా సేవలందించే వ్యవస్థను దేశంలోనే మొదటిసారి తీసుకొస్తున్నాం. కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినప్పుడు సమస్యలు వస్తుంటాయి.. వాటిని పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలి.

**మంత్రి లోకేష్ మాట్లాడుతూ.....**

ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా వాట్సాప్ ద్వారా అవసరమైన సర్టిఫికేట్లను పొందవచ్చు. ఈ ప్రక్రియలో ఏదైనా సమస్యలు ఎదురైతే క్షేత్రస్థాయి నుండి కలెక్టర్లు ఫీడ్ బ్యాక్ ఇవ్వాలి. ప్రపంచంలో యూఏఈ దేశంలో తప్ప మరే దేశంలోనూ ఈ వాట్సాప్ గవర్నెన్స్ విధానం లేదు. యూఏఈ తర్వాత ఈ సేవలు తీసుకొస్తోంది ఒక్క మన రాష్ట్రమే. Ap.gov.in సైట్‌లో సమాచారం ఉంచుతాం. గవర్నెన్స్ స్ట్రీమ్ లైన్ చేయాలన్నది సీఎం చంద్రబాబు అభిప్రాయం. వాట్సాప్ ద్వారా 153 సేవలు అందించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేస్తున్నాం.

## సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి

● చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జయలక్ష్మి



**అమరావతి, మహానాడు:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెండోసారి జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సమావేశం ఇదని చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మిని్స్ట్రేషన్ జి.జయ లక్ష్మి అన్నారు. సమావేశానికి హాజరైన మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ప్రిన్సిపల్ సెక్రటరీలు, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులకు స్వాగతం. ఈ ఏడాది ఆగస్టులో మొదటిసారి కలెక్టర్ల సమావేశం జరిగింది. ఆ సమావేశంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. విజనరీ, డైనమిక్ లీడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమావేశంలో స్వర్ణాంధ్ర @ 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాల సాధనకు అవసరమైన దిశానిర్దేశం చేయనున్నారు.

చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## చేతి గుర్తుకు ఓటేస్తే చేతకాని సీఎంని
# తెలంగాణ నెత్తిన రుద్దారు

- ఢిల్లీకి అందే మూటలపై తప్ప.. మీరిచ్చిన మాటపై శ్రద్ధ లేదా
- తెలంగాణ బతుకు ఛిద్రం అవుతుంటే ప్రేక్షకపాత్ర వహిస్తారా
- మేము తలుచుకుంటే రాజీవ్ పేర్లు, ఇందిరా విగ్రహాలు ఉంటాయా
- ఈ నీచ సంస్కృతికి సీఎం ఫుల్ స్టాప్ పెట్టకపోతే జరగబోయేది అదే !
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ లేఖ





**హైదరాబాద్,మహానాడు:**

ఎన్నికల ముందు చేతికి ఓటు వేస్తే చేతగాని సీఎంను తమ నెత్తిన రుద్దారని తెలంగాణ ప్రజలు మీపై ఆగ్రహంతో ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ యువరాజు రాహును విమర్శించారు. ఆ మేరకు ఆయన రాహుల్‌కు ఘాటు లేఖ సంధించారు.

రాహుల్‌కు కేటీఆర్ రాసిన లేఖ పూర్తి పాఠమిదీ..

గౌరవనీయులైన రాహుల్ గాంధీ గారు

సరిగ్గా ఏడాది క్రితం కొలువుదీరిన మీ కాంగ్రెస్ సర్కారు తెలంగాణను ఆగం చేయడమే కాకుండా తెలంగాణ అస్థిత్వాన్ని కూడా దెబ్బతీస్తోంది. చేతకాని, మతిలేని ముఖ్యమంత్రిని తెలంగాణ నెత్తిన రుద్ది మీరు చేతులు దులుపుకోవడంతో అన్నదాతల నుంచి ఆడబిడ్డల దాకా ప్రతివర్గం అరిగోస పడుతోంది. వ్యవసాయ రంగం నుంచి పారిశ్రామిక వర్గం దాకా సంక్షోభంలో కూరుకుపోతోంది.

ఎన్నికల టైంలో మీరు ఊరురా తిరిగి ఊదరగొట్టిన గ్యారెంటీలన్నీ గారడీలేనని మీ ఏడాది పాలన చూస్తే అర్థమైపోయింది. మీరు చేసిన డిక్లరేషన్ల పట్ల మీకే డెడికేషన్ లేదని అక్షరాలా రుజువైపోయింది. మేనిఫెస్టోలో మీరిచ్చిన 420 హామీలు.. కాంగ్రెస్ చీటింగ్ చాప్టర్ లో భాగమేనని తెలంగాణ సమాజానికి తెలిసిపోయింది. గాలి మోటర్లో వచ్చి గాలిమాటలు చెప్పి ఏడాదిపాటు పత్తా లేకుండా పోయిన మీకు, మీ పార్టీకి తెలంగాణ పట్ల రవ్వంత కూడా బాధ్యత లేదని తేలిపోయింది.

ప్రగతిపథంలో పరుగులు పెట్టిన రాష్ట్రం అధోగతి పాలవుతుంటే తెలంగాణ వైపు కనీసం కన్నెత్తి చూడని మీ తీరును చూసి నాలుగు కోట్ల ప్రజలు నిత్యం రగిలిపోతున్నారు. సీఎం ఢిల్లీకి పంపే మూటలపై మీకున్న శ్రద్ధ, మీరు ప్రజలకు మీరిచ్చిన మాటపై లేకపోవడం నయవంచన, ద్రోహం కాక మరేంటి.

ఏడాది పాలనలో ఏ పేజీ తిప్పి చూసినా.. మోసం మీ నైజం.. అవినీతి మీ ఎజెండా, నియంతృత్వం మీ విధానమని అడుగడుగునా తేల్చిచెప్పారు. మనసులో విషం తప్ప మెదడులో విషయం లేని సీఎం చేతిలో తెలంగాణ బతుకు చిత్రం ఛిద్రమవుతుంటే మీరు ప్రేక్షకపాత్రకే పరిమితమైన వ్యవహారంపై ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకూ ప్రజాగ్రహం వెల్లువెత్తుతోంది.

కాంగ్రెస్ కు అధికారమిస్తే ఏకకాలంలో రైతులందరికీ డిసెంబర్ 9న 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాట నీటిమూటే అయ్యింది. రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరమైతే తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకున్నారు. అది కూడా నాలుగు విడతలుగా ఊరించి ఊరించి ఉసూరుమనిపించడంతో.. ఇప్పటికే దాదాపు 620 మంది రైతులు తెలంగాణలో ఆత్మహత్యలు చేసుకున్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రిలో చలనం లేదు.. కాంగ్రెస్ సర్కారులో కనీస మానవత్వం లేదు.

బీఆర్ఎస్ హయాంలో అప్రతిహతంగా కొనసాగిన పెట్టుబడి సాయానికి కాంగ్రెస్ రాగానే బ్రేకులు వేశారు. బీఆర్ఎస్ సిద్ధం చేసిన రైతుబంధు నిధులను ఒకసారి విడుదల చేశారే తప్ప.. ఏడాదైనా మీరు చెప్పిన రైతుభరోసాను అసలు మొదలే పెట్టలేదు. వానాకాలం సీజన్ లో పెట్టుబడి సాయాన్ని మొత్తానికే ఎగ్గొట్టి రైతాంగాన్ని నిలువునా ముంచారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, కౌలు రైతులకు కూడా రైతుభరోసా కింద 15 వేలు, రైతు కూలీలకు 12 వేల చొప్పున ఇస్తామన్న హామీకి ఏడాదైనా అతీ గతీ లేదు. ఎన్నికల ప్రచారంలో వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని నమ్మబలికి, తీరా గద్దెనెక్కాక సన్న వడ్లకు మాత్రమే అని సన్నాయి నొక్కులు నొక్కిన మీ సన్నాసి ప్రభుత్వ నిజస్వరూపాన్ని రైతులు అర్థం చేసుకున్నారు.

కాంగ్రెస్ ను నమ్మితే రైతుకు గోస తప్ప భరోసా లేదని తొలి ఏడాది పాలనలోనే తేల్చి చెప్పారు. బోనస్ మాట దేవుడెరుగు కనీసం పంట కొనుగోలు కేంద్రాలు, మద్దతు ధర లేక “సాగు” మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయింది. విత్తనాలు, ఎరువుల కోసం మళ్లీ క్యూలైన్లో చెప్పులు, పాసు పుస్తకాలు పెట్టే దుస్థితి తెచ్చిన కాంగ్రెస్ సర్కారును చూసి అన్నదాతలు అసహ్యించుకుంటున్నారు.

అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్ వేసి.. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మీరిచ్చిన హామీ గంగలో కలిసిపోయింది.

ఈ ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భర్తీ చేసిన ఉద్యోగాలు కేవలం 12,527 మాత్రమే. అంటే తెలంగాణ యువతకు మీ కాంగ్రెస్ ప్రభుత్వం అక్షరాలా 1,87,473 ఉద్యోగాలు బాకీ ఉందనే విషయాన్ని తెలంగాణ యువత మరిచిపోలేదు.

యువతకు ఇస్తామన్న 10 లక్షల వడ్డీ లేని రుణాలు ఏమయ్యాయని తెలంగాణ సమాజం మిమ్మల్ని సూటిగా ప్రశ్నిస్తోంది. ఇక అశోక్ నగర్ లో నిరుద్యోగులతో ఫోటోలకు ఫోజులుకొట్టి అడ్రస్ లేకుండా పోయిన మీరు కూడా కాంగ్రెస్ చేసిన మోసంలో భాగస్వాములేనని యువత బలంగా నమ్ముతోంది.

ఎన్నికల ప్రచారంలో ఆడబిడ్డలకు అరచేతిలో వైకుంఠం చూపించి నిలువునా మోసం చేశారు. అరకొరగా నడిచిన ఫ్రీ బస్సు స్కీమ్ తప్ప మహిళలకు ఒరిగిన ప్రయోజనం ఒక్కటీ లేదు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ .2500 హామీకి 365 రోజులు గడిచినా మోక్షం లేదు. నయా పైసా ఇచ్చే దిక్కులేదు కానీ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని మీ ఢిల్లీ పార్టీ చేసిన ప్రకటనలోని డొల్లతనాన్ని తెలంగాణ ఆడబిడ్డలు పసిగట్టేశారు.

కల్యాణలక్ష్మి పథకానికి తోడు తులం బంగారం ఇస్తామని మభ్యపెట్టి.. చివరికి అసలు పథకానికి కూడా ఎసరు పెట్టిన దగుల్బాజీ పాలన మీది. ఏడాది కాలంగా కల్యాణలక్ష్మి సాయం అందని పేద తల్లిదండ్రులు కాంగ్రెస్ కు శాపనార్థాలు పెడుతున్నారు.

వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇచ్చే పెన్షన్లను 4 వేలకు పెంచుతామని, దివ్యాంగుల పింఛన్ ను 6 వేలు చేస్తామని ఇచ్చిన హామీ ఏడాదైనా అమలు చేయకపోవడం కాంగ్రెస్ పార్టీ దగాకోరు విధానాలకు నిదర్శనం. ఇచ్చే పింఛన్లలో కూడా రెండు నెలలు ఎగ్గొట్టి నిరుపేదల నోటికాడి బుక్కను లాగేసుకున్న కాంగ్రెస్ సర్కారుకు వారి పాపం తగలక మానదు.

ఓవైపు కూల్చివేతలే కాదు.. బూటకపు ఎన్ కౌంటర్ల పేరిట కాల్చిచంపుతున్న కాంగ్రెస్ సంస్కృతిని మరోసారి తెలంగాణలో అమలుచేయడం దిగ్భ్రాంతి కారం. ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే అరెస్టులు అన్నట్టుగా సాగుతున్న మీ పాలనా తీరు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోంది. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా నిర్బంధం, సకల రంగాల్లో సంక్షోభమేనని ఈ ఏడాది పాలన రుజువుచేసింది.

ఓవైపు అల్లుడి ఫార్మా కంపెనీ కోసం, మరోవైపు అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ కోసం సొంత నియోజకవర్గం కొడంగల్ లో సీఎం బలవంతంగా భూములు లాక్కునే కుట్రను దళిత, గిరిజన ఆడబిడ్డలు ఢిల్లీ వేదికగా ఎండగట్టినా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిరాలేదు. ఫార్మా విలేజీ ప్లాన్ బెడిసికొట్టిందనే కక్షతో ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట మీ ప్రభుత్వం మరో కుతంత్రాన్ని తెరపైకి తెచ్చి పచ్చని భూముల్లో చిచ్చుపెట్టే పన్నాగాలను ప్రజలు మరోసారి తిప్పికొట్టడం ఖాయం.

అతి తక్కువ కాలంలో అత్యధిక ప్రజాధనాన్ని లూటీచేసిన సర్కారుగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఓ చీకటి చరిత్రను లిఖించింది. సీఎం బావమరిదికి కట్టబెట్టిన అమృత్ టెండర్ నుంచి మొదలుకుంటే.. 1100 కోట్ల పౌరసరఫరాల స్కామ్, మంత్రి పొంగులేటి కుమారిడికి అప్పజెప్పిన కొడంగల్ లిఫ్ట్ పనుల దాకా.. అడుగడుగునా వేల కోట్ల అవినీతే తాండవిచ్చింది.

ఇక మూసీ బ్యూటిఫికేషన్ పేరిట ఏకంగా లక్షన్నర కోట్లకు ముఖ్యమంత్రి రేవంత్ వేసిన స్కెచ్ ను చూసి యావత్ సమాజం నివ్వెరపోయింది. గోదావరి జలాలను మూసీకి తరలించే అంచనాలను 1100 కోట్ల నుంచి 5500 కోట్లకు అమాంతం పెంచేయడం మీ దోపిడీకి పరాకాష్ట. ఈ స్కాములే తాచుపాములై మీ కాంగ్రెస్ ను వెంటాడటం ఖాయమని ఘంటాపథంగా చెబుతున్నాను.

ఇక ఎప్పుడు చూసినా రాజ్యాంగ విలువలు వల్లెవేసే మీకు, ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ నిబంధనను ఉల్లంఘించి తన బావమరిదికి లబ్ధి చేకూర్చిన సీఎంను తప్పించే దమ్ముందా అని తెలంగాణ సమాజం పక్షాన సూటిగా ప్రశ్నిస్తున్నా. ఓవైపు సీఎంతో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న మీకు రాజ్యాంగాన్ని తాకే నైతిక హక్కు కూడా లేదని స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. కాంగ్రెస్ కు అధికారమిస్తే తెలంగాణకు అంధకారమేనని చేతల ద్వారా నిరూపించిన మీ పార్టీని చరిత్రే కాదు.. భవిష్యత్తు కూడా క్షమించదు.

ఉద్యమంలో కోట్లాది మందిలో స్ఫూర్తినింపిన తెలంగాణ తల్లి దివ్య, భవ్య స్వరూపాన్ని అవమానించి, ప్రజలపై కాంగ్రెస్ తల్లిని బలవంతంగా రుద్దే ప్రయత్నాన్ని రేవంత్ రెడ్డి చేస్తున్నాడు. ఒకప్పుడు బలిదేవత అని సోనియాగాంధీని తిట్టిపోసి, ఇప్పుడు చిల్లర పన్నాగాలకు తెరలేపాడు. తలరాతలు మారుస్తానని గద్దెనెక్కి తెలంగాణ తల్లిని, తెలంగాణ అస్థిత్వ ఆనవాళ్లను మార్చే కుటిల యత్నాలకు పాల్పడుతున్నాడు. ఈ నీచమైన, భావదారిద్ర్య చర్యలు భవిష్యత్తులో మీ పార్టీ మెడకే చుట్టుకోవడం ఖాయమని స్పష్టమైన హెచ్చరిక చేస్తున్నాను.

గత పదేళ్లు మేము తెలంగాణ పునర్నిర్మాణంపై దృష్టిపెట్టాం తప్ప.. పనికి మాలిన ఆలోచనలు చేయలేదు. రాజీవ్ ఆరోగ్యశ్రీని, రాజీవ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు పేర్లు మార్చలేదు, ఇందిరాగాంధీ విగ్రహాల జోలికి వెళ్లలేదు. కానీ మనసులో విషం తప్ప మెదడులో విషయం లేని సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వ ఆనవాళ్లను చెరిపేసే దారుణ కుట్రకు తెరలేపాడు.

అందులో భాగంగానే కాకతీయ కళాతోరణాన్ని, చార్మినార్ ని అధికార చిహ్నం నుంచి తొలగించాడు. తాజాగా తెలంగాణ తల్లి పేరుతో కాంగ్రెస్ తల్లిని తెలంగాణ ప్రజలపై బలవంతంగా రుద్దే కుట్ర చేశాడు. . డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం–అమరవీరుల స్తూపం మధ్య తెలంగాణ తల్లి కోసం కేటాయించిన స్థలంలో తెలంగాణ సమాజం యావత్తు వ్యతిరేకించినా, మీ తండ్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని బలవంతంగా ప్రతిష్టింపజేశాడు.

ఆత్మగౌరవం, స్వయంపాలన నినాదాలతో సాధించుకున్న తెలంగాణలో ఈ విష సంస్కృతిని తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదు.

సీఎం రేవంత్ చేసిన ఈ నీచమైన, కుటిల చర్యలకు ప్రతిస్పందనగా భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ గుర్తులు తెలంగాణలో చెరగడం ఖాయం అని గుర్తుంచుకోండి. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ అంటే గౌరవం ఉన్నప్పటికీ.. కేవలం రేవంత్ రెడ్డి చేసిన ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రతి స్పందనగా అసలైన తెలంగాణ చరిత్రను, సంస్కృతిని, ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపైన, తెలంగాణ సమాజంపైన ఉన్నది.

ప్రజల ఆశీస్సులతో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ మరియు ఇతర కాంగ్రెస్ నాయకుల పేర్లతో ఉన్న ప్రతి సంస్థ పేరును మార్చడంతో పాటు తెలంగాణ సచివాలయం ముందు ఏర్పాటుచేసిన కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని, మీ తండ్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని మీ పార్టీ కార్యాలయమైన గాంధీభవన్ కు సకల మర్యాదలతో సాగనంపుతామని నాలుగు కోట్ల ప్రజల సాక్షిగా స్పష్టంచేస్తున్నాను.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 12, డిసెంబర్ 2024






వెలగపూడి సచివాలయం 5 బ్లాక్‌లో జరిగిన రెండవ కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు అధికారులు





























జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 12, డిసెంబర్ 2024



# కలెక్టర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉండాలి

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్



అమరావతి, మహానాడు: స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాలను సాధించడం ద్వారా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ఈ రెండో సమావేశం ఎంతగానో దోహదపడనుంది. గతంలో జరిగిన తొలి కలెక్టర్ల సమావేశంలో ఎన్నో క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి దిశానిర్ధేశం చేయడంతో పాటు మంచి సూచనలు, సలహాలు, ఆదేశాలను జారీచేశారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వం ఈ మధ్య కాలంలో రూపొందించిన పలు పాలసీలపై జిల్లా కలెక్టర్లు సమగ్రమైన అవగాహన ఏర్పర్చుకుని, వాటిని విజయవంతంగా అమలు చేసే అంశంపై దృష్టి సారించాలి. అమరావతి అభివృద్ది పనులు, పోలవరం ప్రాజెక్టు పనులు పున:ప్రారంభం తదితర అంశాలపై అదికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రజల నుండి పెద్ద ఎత్తున వినతులు అందు తున్నాయి, వాటిలో చాల పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. కాబట్టి ప్రజా సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలి. రెవిన్యూ, పోలీస్, పంచాయితీ రాజ్, మున్సిపాలిటీ తదితర శాఖలు సర్వీసు డెలివరీ విధానాన్ని జిల్లా యంత్రాగం ఎంతో మెరుగు పర్చాల్సి ఉంది.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ ఎంతో ప్రముఖమైన పాత్రను జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్లు పోషించాల్సి ఉంది. అందుకు తగ్గట్టుగా కలెక్టర్లు ప్రోయాక్టివ్‌గా పనిచేయాలి.



బాపట్ల జిల్లా చీరాల పట్టణం నందు తాన్య షాపింగ్ మాల్‌ను స్థానిక చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్యతో కలిసి ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ మరియు ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ.




ఓబీసీల హక్కుల సాధనకు ఢిల్లీ లోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న శాసన మండలి ప్రతిపక్ష నేత ఎస్ .మధుసూధనా చారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తదితర బీఆర్ఎస్ నేతలు



రాజస్థాన్‌లోని జైపూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వాగతం పలికిన రాజస్థాన్ పీసీసీ అధ్యక్షుడు గోవింద్ సింగ్, సీఎల్పీ నేత తికారాం జల్లి, ఎమ్మెల్యే అమిత్ చరణ్, తదితరులు.



మడకశిర మండలం కె.గుండుమల గ్రామంలో ఉచిత వైద్య శిబిర కార్యక్రమంలో పాల్గొన్న మడకశిర తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి



అన్నదాతకు అండగా వైయస్ఆర్ సీపీ, దగాచేస్తున్న కూటమి సర్కార్‌పై నిరసన గళం, పోస్టర్ ఆవిష్కరించిన అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

## వైసీపీ నేత గౌతమ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

అమరావతి, మహానాడు:
వైసీపీ నేత గౌతమ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఉమామహేశ్వర శాస్త్రిపై హత్యాయత్నం కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ఆయన ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది.

## తాయిలాలతో తెలంగాణ ఆత్మగౌరవాన్ని కొనలేరు

◆ కాంగ్రెస్ ప్రభుత్వ సత్కారాన్ని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చిన ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిద్ధారెడ్డికి ధన్యవాదాలు తెలిపిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి




హైదరాబాద్,మహానాడు: నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల మనోభావాలను నందినీ సిద్ధారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియజెప్పారు. అబద్దాలతో అధికారంలోకి వచ్చి అహంకారంతో తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీస్తున్నారు. వైభవంగా ఉన్న తెలంగాణ తల్లిని ఏడాది పాలనతో బోసిపోయిన తెలంగాణ మాదిరిగా కాంగ్రెస్ పాలనకు ప్రతిరూపంగా నిలిపారు. తెలంగాణ తల్లిని మార్చడం ముమ్మాటికీ మూరత్వమే.

ఏడాది పాలనతో అన్నివర్గాల ప్రజలను నిలువునా వంచించారు.కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు కాదు ఏడో గ్యారంటీ ఉంది .. అదే పైన చెప్పిన ఆరు గ్యారంటీల్లో ఏదీ అమలు చేయకపోవడం అని ఆ రోజే చెప్పాం. చరిత్రను నిర్మించలేని వారే చరిత్ర ఆనవాలు చెరిపేసే ప్రయత్నం చేస్తారు.తెలంగాణ వెనకబాటులో పెద్ద చేయి కాంగ్రెస్ పార్టీదే.1956లో హైదరాబాద్ రాష్ట్ర విలీనం నుండి 1969లో విద్యార్థుల కాల్చివేత, కాంగ్రెస్ పాలనలో అసమానతలు, వివక్షకు వ్యతిరేకంగా తెలంగాణ యువత అడవుల బాట పట్టడం, ఆ తర్వాత బూటకపు ఎన్కౌంటర్లు, మలిదశ తెలంగాణ ఉద్యమంలో వందలాది మంది యువకుల బలిదానాలకు కారణం కాంగ్రెస్. తెలంగాణకు కాంగ్రెస్ చేసిన మోసాలకు లక్ష పుష్కరాల్లో మునిగినా పోదు. తల్లిని మారిస్తేనో, టీఎస్ టీజీగా చేస్తేనో, చార్మినార్, కాకతీయుల తోరణాలను మారిస్తేనో కాంగ్రెస్ పాపాలు, మోసాలను ప్రజలు మరిచిపోరు.

## రైస్ స్మగ్లింగ్ నిందితులపై పీడీ యాక్టు పెట్టండి

● కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆదేశం




అమరావతి, మహానాడు:
పౌర సరఫరాల శాఖ సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ధాన్యం కొనుగోలు సొమ్మును 24 గంటల్లోపే రైతులకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. గత అయిదేళ్ళుగా పిడిఎస్ రైస్ రీసైక్లింగ్ అవుతూ పెద్దఎత్తున రైస్ స్మగ్లింగ్ జరుగుతుంది. ఈ అక్రమ వ్యవహారానికి వేదికగా కాకినాడ పోర్టు నిలిచింది. ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా చాలా మంది భాగస్వామ్యులు అయ్యారు. ఇటువంటి అక్రమ కార్యక్రమాలను నియంత్రించేందుకు అవసరమైతే పీడీ యాక్టును కూడా వినియోగించాలి. నియంత్రణ బాధ్యత జిల్లా కలెక్టర్లు, ఎస్పీలపై ఉంది. పిడిఎస్ రైస్ ను ప్రజలు తినడానికి ఇష్టపడని పక్షంలో.. వారు ఇష్టపడే రకాన్ని రైతులు సాగు చేసేలా అందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## విడదల రజనీ రూ.2 కోట్లు తిన్నారు!

- విచారణలో తేల్చిన విజిలెన్స్

అమరావతి, మహానాడు: విడదల రజనీ మంత్రి పదవిని అడ్డం పట్టుకుని పోలీసు, మైనింగ్ అధికారులతో కలిసి వ్యాపారుల్ని బెదిరించి డబ్బులు దండుకున్న పాపాలు పండిపోయాయి. అధికారం పోవడంతో డబ్బులు ఇచ్చిన వారు ప్రభుత్వానికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా ఓ వ్యాపారి చేసిన



ఫిర్యాదుపై విజిలెన్స్ దర్యాప్తు చేయడంతో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

చిలుకలూరిపేట నియోజకవర్గంలో స్టోర్ క్రషర్ నిర్వహిస్తున్న యాజమాన్యానికి ముందుగా కప్పం కట్టాలని సమాచారం పంపారు. వారు కట్టలేమనడంతో అక్రమ మైనింగ్ చేశారని అధికారులతో రూ. 50 కోట్ల ఫైన్ వేయించారు. దాంతో ఆ వ్యాపారులు కాళ్ల బేరానికి వచ్చారు. పోలీసు ఉన్నతాధికారి జాషువా వారిని బెదిరించారు. అందరూ కలిసి రెండు కోట్ల ఇరవై లక్షలు వసూలు చేసుకున్నారు. ఇందులో రెండు కోట్లు విడదల రజని, పది లక్షలు ఆమె పీఏ, మరో పది లక్షలు పోలీసు అధికారి జాషువా తీసుకున్నారు. విజిలెన్స్ దీన్ని నిర్ధారించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

## శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



నరసరావుపేట, మహానాడు: పట్టణంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్థానిక 32 వ వార్డులో పర్యటించారు. కాలువలలో పూడికను తీశారు, సైడ్ కాలువల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు గడ్డిని తొలగించారు. స్థానికులతో వార్డు లోని సమస్యలను అడిగి తెలుసు కున్నారు. రాష్టంలో, నియోజకవర్గం పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమలను వివరించారు. సమస్యల పరిష్కరనికి అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడమే తన లక్ష్యమని ప్రతి రోజు వార్డుల్లో పర్యటిస్తూ మున్సిపాల్ కార్మికుల ను, పార్టీ కార్యకర్తలను వెంట తీసుకొని కాలువలను రోడ్లను, ప్రజల సమస్యలను పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జేసీ, నరసరావుపేట ఆర్డీవో, మునిసిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



నందివాడ, మహానాడు: గ్రామాల్లో నెలకొన్న భూముల సమస్యలను పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని.. ప్రజలకు మంచి చేసేందుకే సీఎం చంద్రబాబు ప్రాధాన్యత ఇస్తున్నారని గుడివాడ ఎమ్మెల్యే వెనీగండ్ల రాము పేర్కొన్నారు. నందివాడ మండలం పోలుకొండ గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో కూటమి నాయకులు.. అధికార యంత్రాంగంతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు, ప్రజల నుండి స్వీకరించిన భూ సమస్యల అర్జీలను పరిశీలించారు. ప్రజల నుండి స్వీకరించిన భూ సమస్యల అర్జీలను పరిశీలించారు. సభలో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... వైసీపీ పరిపాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తుందని.. రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల సమస్యలు పరిష్కారం ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కుర్మా శ్రీనివాసరావు, సర్పంచ్ మానేపల్లి ఝాన్సీ కుమారి, తహశీల్దార్ గురు మూర్తి రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ కిరణ్, మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటరావు, ఆర్.ఐ. గణేష్, సర్పంచ్ సుబ్బారావు, మండల పార్టీ నాయకులు లక్ష్మీ వరపు శ్రీనివాసరావు, అరికపూడి రామశాస్త్రి, ఉప్పల వెంకటేశ్వరరావు, చాట్రగడ్డ రవి, తమ్మారెడ్డి శ్రీనివాసరావు, బాబ్జి, మీగడ ప్రేమ్ కుమార్, గుత్తికొండ నరసింహారావు, బొర్రా శ్రీనివాసరావు, ఐటీడీపీ కూచిపూడి అజిత్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## విశాఖ సెంట్రల్ పార్క్‌లో మ్యూజికల్ ఫౌంటెన్

◆ ఎమ్మెల్యే వంశీ కృష్ణ, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ వెల్లడి

విశాఖ, మహానాడు: విశాఖ సెంట్రల్ పార్క్‌ను మరింత ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూస్తామని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, ఎంఎల్ఏ వంశీ కృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్ ఎదురుగా ఉన్న విశాఖ సెంట్రల్ పార్క్ ను వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్, ఇతర విభాగాల




అధికారులు, సిబ్బందితో కలిసి బుధవారం సందర్శించారు. పార్క్ లో ఉన్న వాకర్లతో మాట్లాడి అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. పార్క్ అంత పరిశీలించారు. అనంతరం వీఎంఆర్డీఏ చైర్మన్ మాట్లాడుతూ అతి త్వరలో పార్క్‌లో మ్యూజికల్ ఫౌంటెన్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పారు. పార్క్‌కి పిల్లల కోసం క్రీడ పరికరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఓపెన్ జిమ్ పరికరాలు మరమతులు చేపట్టాలని ఆదేశించారు.

అనంతరం పార్క్ ఆవరణలో దివిస్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన మంచినీటి ప్లాంట్ ను ఎమ్మెల్యే, వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ తో కలిసి వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈ భవానీ శంకర్, డీఎఫ్‌వో శివాని, ఇతర సిబ్బంది, కూటమి పార్టీలకు చెందిన నాయకులు వానపల్లి గాయత్రి, ఫణి కుమారి, మహేష్ యాదవ్, నక్కా కనకరాజు, బాయిన సునీల్, వాకర్ల ప్రతినిధి పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

08

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 12, డిసెంబర్ 2024

# ప్రజా ప్రతినిధులు తెచ్చిన సమస్యలకు ప్రాధాన్యమివ్వాలి

- ప్రతి సమస్యా పరిష్కరించాల్సిందే..
- ఆర్థికేతర సమస్యలన్నీ పరిష్కారమవ్వాలి
- అందులో రాజీపడే ప్రసక్తే లేదు
- ఇది పొలిటికల్ గవర్నెన్స్
- ప్రజా ప్రతినిధుల తీసుకొచ్చే సమస్యలకు ప్రాధాన్యమివ్వాలి
- వచ్చే కలెక్టర్ల సదస్సులో జీరో పెండెన్సీ ఉండాలి
- మనం చేయడానికి వీలు లేని సమస్య గురించి ప్రజలకు వివరించి చెప్పాలి
- కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచన
- జూన్ నుంచి నవంబరు వరకు 1.69 లక్షల ఫిర్యాదుల స్వీకరణ
- అందులో 1.39 లక్షలు పరిష్కరించామని చెప్పిన అధికారులు



**అమరావతి, మహానాడు:** పరిష్కార వేదిక ద్వారా స్వీకరించే ప్రతి సమస్యా పరిష్కారం అవ్వాల్సిందేనని, ఆర్థికేతర సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కావాలని, ఇందులో ఏమాత్రం రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) పై కలెక్టర్ల సదస్సులో అధికారులు ఇచ్చిన ప్రజెంటేషన్ పై ముఖ్యమంత్రి స్పందిస్తూ అధికారులు, కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

మనం సమస్యలు పరిష్కరిస్తున్నప్పటికీ ప్రజా సంతృప్తి రాకపోతే మనం చేస్తున్న పనికి ప్రజల అంచనాలకు మధ్య ఎక్కడో తేడా ఉందని, దాన్ని అంచనా వేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆర్థికేతర సమస్యలు వందశాతం పూర్తి చేయాలని తెలిపారు. దీనిపైన తాను చాలా సీరియెస్ గా ఉన్నానని చెప్పారు. జిల్లా కలెక్టర్లు కూడా సమస్యల పరిష్కారం ఎలా అవుతున్నాయనే దానిపై ర్యాండమ్ గా ప్రజలను అడిగి వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని సూచించారు. కొన్ని సమస్యలను కొంతమంది మళ్లీ మళ్లీ తీసుకొచ్చి వాటికోసం కార్యాలయాల వెంట తిరుగుతుంటారని అలాంటి వాటిని గుర్తించి మనం వాటిని పరిష్కరించగలమా, పరిష్కరించలేమా అనేది చూసి, ఒక వేళ పరిష్కరించలేకపోతే ఆ విషయం ఆ పౌరుడికి స్పష్టంగా తెలియజేయాలన్నారు.

కోర్టు కేసులు కొన్ని ఇతరత్ర కారణాల వల్ల కొన్ని సమస్యలను మనం పరిష్కరించలేమని, అలాంటి వాటిని కూడా మానవీయ కోణంలో పరిశీలించి దాన్ని పరిష్కరించడానికి సాధ్యమైనంత వరకు ప్రయత్నించాలని, ఒకవేళ అప్పటికీ ఆ సమస్యను పరిష్కరించడం సాధ్యం కాకపోతే ఆ విషయం ఆ ఫిర్యాదుదారుడికి తెలియజెప్పాలి. అలాగే పోర్టల్ లో కూడా ఆ విషయం తెలియజేసి పారదర్శకంగా ఉండాలన్నారు. కోర్టు కేసుల్లో పేదవాడు బలవంతుడితో పోరాడలేకపోతున్నారు. న్యాయం పేదవాడి వైపు ఉందని మనకు అనిపిస్తే అలాంటి వారికి అవసరమైతే న్యాయ సహాయం అందించే వీలుందేమో పరిశీలించాలని, మానవీయ కోణంలో సమస్యలను చూడాలన్నారు. సమస్యల పరిష్కారంలో క్వాలిటేటివ్ డిస్పోజల్ చాలా ముఖ్యమన్నారు.

## ప్రజా ప్రతినిధుల తెచ్చిన సమస్యలకు ప్రాధాన్యమివ్వాలి

తమది పొలిటికల్ గవర్నెన్స్ అని సీఎం స్పష్టం చేశారు. ప్రజలు ఎన్నో ఆకాంక్షలు, ఆశలతో తమను గెలిపించారని, ప్రజాప్రతిధులు ప్రజల సమస్యలు తీసుకొచ్చినప్పుడు వారిని గౌరవించి, వారు తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజలకు ప్రజాప్రతినిధుల పట్ల ఆకాంక్షలు ఎక్కువగా ఉంటాయని, వారి వద్దకు సమస్య తీసుకొచ్చినప్పుడు వాటిని అధికారులు పరిష్కరించకపోతే ఎలా అన్నారు. చట్టం పరిధిలో, నిబంధనలకు లోబడి సమస్యలను పరిష్కరించాలన్నారు.

## ఆరు నెలల్లో 1.69 లక్షల ఫిర్యాదుల స్వీకరణ

గత ఆరు నెలల్లో ప్రజల నుంచి 1,69,200 అర్జీలు స్వీకరించామని సాధారణ పరిపాలన కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. పీజీఆర్ఎస్ పై కలెక్టర్ల సదస్సులో ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. జూన్ 15 నుంచి నవంబరు 30 వరకు ప్రజల నుంచి ప్రభుత్వానికి మొత్తం 1.69 లక్షల ఫిర్యాదులు అందాయని, అందులో ఇప్పటికే 1.39 లక్షల ఫిర్యాదులు పరిష్కరించామని, 10వేల సమస్యలను మళ్లీ పరిష్కారం కొరకు రీఓపెన్ చేశామని తెలిపారు.

పది శాఖల నుంచి మొత్తం 76 సమస్యలు వస్తున్నాయని, అందులో రెవెన్యూ శాఖ కు సంబంధించిన సమస్యలే అధికంగా ఉన్నాయన్నారు. ల్యాండ్ రికార్డులు, క్రైమ్, భూ కబ్జాలు, సచివాలయ ఉద్యోగులపై ఫిర్యాదులు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయని వివరిం చారు. జీరో పెండెన్సీ దిశగా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్లు అందరూ పని చేయాలని కోరారు.

---

# మా పథకాలేవని ప్రజలు నిలదీస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి..)

ఇలాంటి పరిస్థితి చూస్తున్నాం.

2019-24 మధ్య మనం పాలన చేశాం. మన పాలనలో రాష్ట్రంలో ఎప్పుడూ జరగని విధంగా, ఎప్పుడూ చూడని విధంగా, విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. మన ప్రభుత్వం రానంత వరకు మేనిఫెస్టో ప్రాధాన్యత ఏమిటన్నది తెలియదు. అలా అంతకు ముందు పాలకులు వ్యవహరించారు. ప్రతి ఎన్నికల్లో రాజకీయ నాయకులు ప్రజలకు మేనిఫోస్టో చూపిస్తారు.

అందులో హామీలన్నీ ఊదరగొడతారు. దానిపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తారు. ఎన్నికలై పోగానే మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసిన పాలనను మన కంటే ముందు చూశాం. తొలిసారిగా ఆ చరిత్రను మార్చిన పాలన వైయస్సార్సీపీ హయాంలోనే జరిగింది. మొట్టమొదటిసారిగా మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్ గా భావిస్తూ.. ఎన్నికలప్పుడు చెప్పిన ప్రతి మాటను తూచ తప్పకుండా బడ్జెట్ తో పాటు సంక్షేమ క్యాలెండర్ కూడా ప్రకటించి, ఏ నెలలో, ఏ పథకం అమలు చేయబోతున్నామో చెప్పాం. ఆ నెల వచ్చేసరికి బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేసిన పాలన మన ప్రభుత్వ హయాంలోనే జరిగింది. అంత గొప్పగా ప్రజలకు మంచి చేశాం.

మనం రానంత వరకు ప్రజలకు ప్రభుత్వ పథకాలు లంచాలు లేకుండా ఇవ్వడం సాధ్యమేనా వివక్ష లేకుండా పథకాలు ఇవ్వడం సాధ్యమేనా అన్న పరిస్థితి నుంచి ఔను, ఇవన్నీ సాధ్యమే. కచ్చితంగా చేయగలం.. అని రాష్ట్రానికి, దేశానికే కాకుండా, ప్రపంచానికి కూడా చూపింది వైయస్సార్సీపీ పాలన మాత్రమే.

ఎప్పుడు చూడని విధంగా స్కూళ్లు మారాయి. పేదవాడు పేదరికం నుంచి బయటకు వచ్చి సమాజంతో పోటీ పడేలా చదువులు కేవలం వైయస్సార్సీపీ హయాంలోనే అందాయి. బడులలో ఎప్పుడూ చూడని మార్పులు తెచ్చాం. ప్రభుత్వ బడుల కన్నా ప్రైవేటు బడులు ముందుంటాయి అన్న పరిస్థితి నుంచి ప్రైవేటు బడులే ప్రభుత్వ బడులతో పోటీ పడే పరిస్థితిలోకి తెచ్చాం.

ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిషు మీడియం, మూడో తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, సీబీఎస్ఈ నుంచి ఐబీ పరకు ప్రయాణం, నాడు%-%నేడుతో సమూల మార్పులు, ఆరో తరగతి నుంచి ప్రతి తరగతి డిజిటలైజ్ చేశాం. ఎనిమిదో తరగతి పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చాం.

వైద్య రంగంలో కూడా ఎప్పుడూ చూడని మార్పులు చేశాం. గ్రామంలోనే విలేజ్ క్లినిక్. ప్రతి 15 రోజులకొకసారి ప్రభుత్వ వైద్యుడు గ్రామానికే వచ్చి ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందించే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు చేశాం. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు విస్తరించాం. గతంలో ఆరోగ్యశ్రీలో 1000 ప్రొసీజర్లు ఉంటే వాటిని 3300కు పెంచాం. దేశమంతా ప్రభుత్వ రంగంలో స్పెషలిస్టు డాక్టర్ల కొరత 61 శాతం ఉంటే, మన వద్ద జీరో వేకెన్సీ పాలసీతో దాన్ని 4 శాతానికి లోపే తీసుకువచ్చాం. డబ్ల్యూహెచ్ ఓ, జీఎంపీ ప్రమాణాలతో మందులు అందించాం.

వ్యవసాయంలో కనీవినీ ఎరగని మార్పులు తెచ్చాం. గ్రామంలో రైతును చేయి పట్టుకుని నడిపించే వ్యవస్థ గ్రామంలో కనిపిస్తుంది. అక్కడే అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ రైతులకు సలహాలు, సూచనలు అందించే పరిస్థితి. తొలిసారిగా పారదర్శకతకు పెట్టపీట వేస్తూ ఇ%-%క్రాపింగ్, దాని ద్వారా ఉచిత పంటల బీమా అందించాం. రైతులకు ఏ ఇబ్బంది రాకుండా రైతు పంట వేసే సమయానికే పెట్టుబడి సాయం చేశాం. రైతుల వద్ద నుంచి దళారీ వ్యవస్థను తీసివేయడం సాధ్యమేనా అన్న వాళ్లకు.. ఇది సాధ్యమేనని వైయస్సార్సీపీ హయాంలోనే చేసి చూపించాం.

ధాన్యం కొనుగోళ్లను ఆర్బీకే స్థాయి నుంచే మొదలుపెట్టి ప్రతి ఒక్క రైతుకూ కనీస మద్దతు ధర అందేటట్టు చేయడంతో పాటు, రైతులకు బోనస్‌గా జీఎల్‌టీ (గన్నీ బ్యాగులు, లేబర్, ట్రాన్స్‌పోర్టు)గా ఎకరాకు రూ.10 వేలు అందించింది కూడా వైఎస్సార్సీపీ ప్రభుత్వమే.

'జగన్ ప్రతి ఇంటికి పలావు పెట్టాడు. చంద్రబాబు ప్రతి ఒక్కరికీ బిర్యానీ పెడతానన్నాడు. తీరా ఎన్నికలయ్యాక పలావు పోయింది. బిర్యానీ కూడా పోయిందన్న'.. మాట ప్రతి ఇంట్లోనూ వినిపిస్తోంది. ఆరోజు చంద్రబాబు అలా ప్రచారం చేసినప్పుడు చాలా మంది నా దగ్గరకు వచ్చి.. .అన్నా నువ్వు ఏం చెప్పనంటున్నావు. చంద్రబాబు మాత్రం ఇంట్లో ఎవ్వరినీ వదిలిపెట్టడం లేదు. చిన్న పిల్లలకు దగ్గర నుంచి ఎవరు కనిపించినా వదలడం లేదు. పిల్లలు కనిపిస్తే నీకు రూ.15వేలు, వాళ్ల తల్లులు కనిపిస్తే నీకు రూ.18 వేలు అంటున్నాడు.

వాళ్ల అత్తలు, అమ్మలు కనిపిస్తే నీకు రూ.48 వేలు అని, అదే ఇంట్లో నుంచి 20 ఏళ్ల యువకుడు బయటకు వస్తే నీకు రూ.36 వేలు అంటున్నాడు. అదే ఇంట్లో నుంచి కండువా వేసుకుని రైతు బయటకు వస్తే నీకు రూ.20 వేలు అని అంటున్నాడు. ఎవ్వరినీ వదలిపెట్టడం లేదు. మనమూ చెప్పాలని అన్నారు.

నేను ఒక్కటే చెబుతున్నాను. ఈ క్యారెక్టర్, క్రెడిబులిటీ వల్లనే మనం మళ్లీ అధికారంలోకి వస్తాం. నా దగ్గరకు వచ్చిన మన పార్టీ నేతలు మీలో అతి మంచితనం, అతి నిజాయితీ అనే సమస్యలు ఉన్నాయని చెబుతారు. కానీ ఆ రెండు గుణాలే మళ్లీ మనల్ని అధికారంలోకి తెస్తాయి.

ప్రజలకు అబద్ధాలు చెప్పినప్పుడు అది మోసం అవుతుంది. అది ప్రజల్లో కోపం కింద మారుతుంది. ఆ కోపమే చంద్రబాబు పాలనలో ప్రజల్లో ఇప్పుడు విపరీతంగా కనిపిస్తుంది.

ప్రజలు నిలదీసే పరిస్థితుల్లోకి వస్తున్నారు. నా రూ.15 వేలు ఏమయ్యాయని చిన్నపిల్లలు, నా రూ.18 వేలు ఏమయ్యాని వాళ్ల తల్లులు, నా రూ.48 వేలు ఏమయ్యాయని అమ్మమ్మలు, నా రూ.36 వేలు ఏమయ్యాయని యువకులు, నా రూ.20 వేలు ఏమ్యయాని రైతులు అడుగుతున్నారు. దీనికి సమాధానం చెప్పలేని తెలుగుదేశం పార్టీ పెద్దలు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారు.

దీంతో దిక్కు తోచని స్థితిలో వారు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. జూన్‌లో రుషికొండ భవనాలు అని, జూలైలో శ్వేతపత్రాలు అని, మదనపల్లె ఫైల్స్ అని, ఆగస్టులో ముంబై నటి కాదంబరి జెత్వానీ అని, సెప్టెంబరులో ప్రకాశం బ్యారేజీని బోట్లుతో ఢీకొట్టి కూలగొట్టాలన్న కుట్ర చేశామని, అక్టోబరులో నా కుటుంబాన్ని తెచ్చి, నవంబరులో బడ్జెట్‌పై దృష్టి మరలించడానికి రూ.14 లక్షల కోట్లు అప్పు అని డైవర్షన్ చేశారు. ఇప్పుడు డిసెంబరులో రేషన్ బియ్యం అక్రమ రవాణా అంటూ నానా హంగామా చేస్తూ, దుష్ప్రచారం చేస్తున్నారు.

కాకినాడ పోర్టుకు వెళ్లి అక్కడ హంగామా చేయడం.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 రాతలు చూస్తే ఆశ్చర్యం అనిపిస్తుంది. ప్రభుత్వంలో మనమున్నామా వాళ్లున్నారా అనిపిస్తుంది. ఈ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడిచాయి. అధికారులు, మంత్రులు, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎమ్మార్వోలు, పోలీసులు అంతా వాళ్ల అధికారులే. చెక్ పోస్టులు వాళ్లవే. పోర్టులో కస్టమ్స్ అధికారులు, సీఐఎస్ఎఫ్ పోలీసులు వాళ్లు పోత్తులో ఉన్న కేంద్ర ప్రభుత్వ మనుషులే. ఇవన్నీ దాటుకుని ఏదైనా మెటీరియల్ పోర్టులోకి పోగలుగుతుందా.

ఆశ్చర్యంగా పవన్ కళ్యాణ్ వెళ్లి పరిశీలించి బోటు పక్కదే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వియ్యంకుడు శ్రీనివాసరావుది. పట్టాభి రైస్ ఎక్స్ పోర్ట్స్ పేరుతో అదే పోర్టు నుంచి ఆయన ఎగుమతి చేస్తున్నారు. అక్కడికి మాత్రం పవన్ కళ్యాణ్ వెళ్లడు. ఎవరు ప్రభుత్వంలో ఉన్నారు, ఎవరు చేస్తున్నారని నాకు ఆశ్చర్యం అనిపించింది.

'వైయస్సార్‌సీపీ కార్యకర్తల వ్యవస్థీకృత నేరాలు' అంటూ ఈనాడులో రాశారు. అసలు వ్యవస్థీకృత నేరాలు చేస్తున్నది వాళ్లు అయితే, మన మీద వేలెత్తి చూపిస్తున్నారు. ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయని చూస్తే.. బియ్యం ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ దశాబ్దాలుగా నెంబర్ వన్ గా ఉంది. తెలంగాణా నుంచి కూడా బియ్యం మన దగ్గరకే వస్తాయి. అందులో పట్టాభి ఎక్స్ పోర్ట్స్ పేరుతో ఎగుమతి చేస్తున్న పయ్యావుల కేశవ్ వియ్యంకుడు శ్రీనివాసరావు ఆంధ్రాలో నెంబర్ వన్.

మన ప్రభుత్వంలో తొలిసారిగా బియ్యం పంపిణీలో డీలర్ల వ్యవస్థ పక్కన పెట్టి.. ఇంటి వద్దకే బియ్యం పంపిణీ చేశాం. ఇందులో బాగంగా ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్) ఏర్పాటు చేసి ఇంటి వద్దకే సార్టెక్స్ చేసి వాళ్లు తినగలిగే బియ్యాన్ని ఇచ్చాం. వాళ్లు అమ్ముకునే పరిస్థితి లేకుండా దానికి ఫుల్‌స్టాప్ పెట్టే కార్యక్రమం వైఎస్సార్సీపీ హయాంలో జరిగింది.

ఈరోజు ప్రభుత్వం పథకం ప్రకారం ఇంటి వద్దకే బియ్యం ఆపేశారు. మనం సార్టెక్స్ చేసి స్వర్ణ వంటి మధ్యస్థ సన్నబియ్యం ఇస్తే.. ఇవాళ దాన్ని నిర్వీర్యం చేశారు. వీళ్లు ఇవన్నీ చేస్తుంటే.. వీళ్ల తప్పిదాలతో నాసిరకం బియ్యం సరఫరా కావడం వల్ల మరలా ప్రజల దగ్గర నుంచి వివిధ రూపాల్లో ఎమ్మెల్యేల ద్వారా ఎగుమతి జరుగుతుంది.

ఈ డైవర్షన్ పాలిటిక్స్ మధ్య ఈరోజు మనం పార్టీ బలోపేతం చేయడంతో పాటు, ప్రజల తరపున పోరాటం చేయడానికి సన్నద్ధం అయ్యాం. చంద్రబాబు చేస్తున్న పాలన చూసి ప్రజలకు తోడుగా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. వారి తరపున పోరాటం చేయాల్సిన సమయం వచ్చింది.

ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వాళ్లకు మేమున్నామనే భరోసా ఇవ్వగలిగినప్పుడే ప్రజలకు మన మీద నమ్మకం కలుగుతుంది. అటువైపు ప్రజల్లో వ్యతిరేకత ప్రతి అడుగులోనూ కనిపిస్తుంది. వ్యవస్థలన్నీ పూర్తిగా నీరుగారి పోయాయి. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలన్నీ నాశనమయ్యాయి.

మరోవైపు బాదుడే బాదుడు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ లేవు. వ్యవస్థలన్నీ పూర్తిగా దిగజారిపోయాయి. కరెంటు బిల్లులు ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. రూ.6 వేల కోట్ల బాదుడుతో మొదటి డోసు ఇది. నవంబరు, డిసెంబరు బిల్లులో ఏ ఇంటికి వెళ్లినా రూ.300 కనీసం తేడా కనిపిస్తోంది. రానున్న నెలలో మరో రూ.9 వేల కోట్ల భారం వేస్తున్నారు.

ఊళ్లలో రోడ్డెక్కితే చాలు డబ్బు కట్టాల్సిందే అట. అది జాతీయ రహదారులపై చూశాం కానీ, గ్రామీణ రోడ్లు బాగు చేయడం కోసం వాటిపై టాక్స్ వేసే కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుడుతున్నాడు. ఆయన హయాంలో, మన హయాంలో తేడా చూస్తే.. మన హయాంలో రూ.43 వేల కోట్లు రోడ్లపై ఖర్చు చేస్తే, అంతకు ముందు చంద్రబాబు హయాంలో అది రూ.27 వేల కోట్ల మాత్రమే. అక్కడ కూడా ఇన్ని సంక్షేమ పథకాలు చేస్తూ మనమే ఎక్కువ ఖర్చు పెట్టాం. ఇవాళ చంద్రబాబు హయాంలో సంపద సృష్టి అంటే బాదుడే బాదుడు అని అర్థం.

రామాయపట్నం పోర్టు దశాబ్దాల కల. దాన్ని కట్టింది వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమే. ఒకవైపు మనం కడుతున్న మెడికల్ కాలేజీలు, పోర్టులను చంద్రబాబు అమ్ముతానం టున్నాడు. మనం రాకముందు నాలుగు ప్రాంతాల్లో ఆరు పోర్టులు ఉంటే మనం వచ్చిన తర్వాత నాలుగు పోర్టులు కట్టాం. ఇప్పుడు ఆ పోర్టులన్నీ శనక్కాయలకు, బెల్లాలకు అమ్ముతాడంట.

## సంపద సృష్టి అంటే ఇదీ..:

పోర్టులు, మెడికల్ కాలేజీలు కూడా అలాంటివే. దీన్ని సంపద సృష్టి అంటారు. ఈ పోర్టుల నిర్మాణం పూర్తైతే ఉద్యోగాలు వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు ఆదాయాలు పెరుగుతాయి. దీన్ని సంపద సృష్టి అంటారు. ఈ పోర్టు కట్టడానికి ఇవాళ రూ.4 వేల కోట్లు అవసరం అయితే పదేళ్ల తర్వాత రూ.10 వేల కోట్లు అవసరం అవుతుంది. ఈ పోర్టులన్నింటినీ చంద్రబాబు తన వాళ్లకు అమ్మే కార్యక్రమం పెట్టాడు.

వెలిగొండ ప్రాజెక్టులో రెండు టన్నెళ్లు పూర్తయ్యాయి.

నల్లమల సాగర్ రిజర్వాయరు కూడా పూర్తయింది. లక్ష ఎకరాలకు నీళ్లు అందించగలిగే ప్రధాన కాల్వల నిర్మాణం కూడా పూర్తయింది. కేవలం ఆర్ అండ్ ఆర్ పరిహారం మాత్రమే చెల్లించాలి. అది కూడా రూ.1200 కోట్లు డబ్బుస్తే నీళ్లు నింపవచ్చు. దాన్ని ఈ ఏడాది చేయాలనుకున్నాం. అలా పూర్తి చేసిన ప్రాజెక్టు ఈ రోజుకూ అలా ఉండిపోయింది. పూర్తైన ప్రాజెక్టుకు కూడా ఆర్ అండ్ ఆర్ డబ్బులు ఇవ్వకుండా పక్కన పెట్టారు. మార్కాపురం మెడికల్ కాలేజీ కూడా దాదాపు పూర్తి కావచ్చింది. దాన్ని అమ్మడానికి సిద్ధపడుతున్నారు. ఇలాంటి వాళ్లని చూస్తే ఆశ్చర్యమనిపిస్తుంది.

అందుకే మనం అంతా కూడా పోరుబాటు పట్టాల్సిందే. ఈ నేపథ్యంలో మీలో కూడా ఎవరైనా నాయకత్వ దిశగా ఎదగాలనుకుంటే ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఎదగడానికి అవకాశం వస్తుంది. ప్రజలకు మనం దగ్గర కావాలి. ప్రజలకు దగ్గరవుతూ పోరాటంలో వాళ్లకు తోడుగా నిలబడగలిగితేనే మనకు సానుకూలంగా తయారవుతుంది. ప్రతి ఒక్కరూ అది గుర్తుపెట్టుకొండి. చంద్రబాబు మనల్ని త్వరగా రోడ్డు మీదకు వచ్చేలా చేశాడు.

ప్రజల తరపున పోరాటంలో బాగంగా మనం మూడు కార్యక్రమాలు చేపట్టాం. ఈ నెలలో డిసెంబరు 13న అన్నదాతలకు అండగా సమస్యలపైన కార్యక్రమం పెట్టాం. గతంలో మనం రైతుభరోసా రూ.13500 ఇచ్చాం. ఇందులో ఆరు వేలు కేంద్రమే ఇస్తుందని టీడీపీ వాళ్లు అన్నారు. అంటే కేంద్రం ఇస్తున్నది కాకుండా ఏడాదికి మరో రూ.20 వేలు ప్రతి రైతుకూ ఇస్తామన్నట్టుగా భావన కల్పించారు. కానీ ఇప్పుడు ఏమీ ఇవ్వడం లేదు. నిలదీసే కార్యక్రమం జరగాలి. ధాన్యం కనీస మద్దతు ధరకోసం కూడా చేస్తున్నాం. ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశాడు.

వీటన్నింటి మీద ప్రశ్నిస్తూ రైతుల తరపున కలెక్టర్లు వినతి పత్రం ఇస్తాం. అదే మాదిరిగా డిసెంబరు 27న కరెంటు చార్జీల మీద మరో కార్యక్రమం చేస్తున్నాం. కరెంటు ఛార్జీల విషయంలో కూడా ఇలాగే చంద్రబాబు అన్నాడు. ఎన్నికల ప్రచారంలో నేనున్నా.. నేను తగ్గిస్తా.. అన్నాడు . తీరా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే రూ.15000 కోట్లు పెంచాడు. దీనిపైన ఈనెల 27న కార్యక్రమం పెట్టాం.

జనవరి 3వ తేదీన రీయింబర్స్‌మెంట్ కోసం మరో కార్యక్రమం చేస్తున్నాం. క్వార్టర్ అయిపోయిన వెంటనే నాలుగో నెలలో వెరిఫై చేసి ఐదో నెలలో పిల్లల తల్లుల చేతుల్లో విద్యాదీవెన, వసతి దీవెన కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ మనం ఇచ్చే వాళ్లం. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికి నాలుగు త్రైమాసికాల నుంచి విద్యాదీవెన అందలేదు. అలాగే వసతి దీవెన డబ్బులు కూడా ఇవ్వలేదు.

విద్యాదీవెన, వసతి దీవెన అందక పిల్లలు చదువులు మానేసి పొలం పనులు చేసుకుంటున్నారు. ఫీజులు కట్టకపోతే కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వని పరిస్థితులు. ఆ పిల్లల తరపున చంద్రబాబును ప్రశ్నిస్తూ జనవరి 3న చేస్తున్నాం. ఈ మూడు కార్యక్రమాలను విజయవంతం చేయడంలో మీ పాత్ర చాలా కీలకం. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించాలి.

## జనవరి నుంచి జిల్లాల పర్యటన

ఇవే కాకుండా పార్టీని మరింత బలోపేతం చేయాలి. దీన్ని వ్యవస్థీకృత విధానం (ఆర్గనైజ్డ్ స్ట్రక్చర్)లోకి తీసుకురావాలి. ఇందులో భాగంగా పార్టీలో క్రియాశీల మార్పులు తీసుకు వచ్చాం. సంక్రాంతి తర్వాత ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో రెండు రోజులు ఉంటాను. బుధ, గురువారాలు పార్లమెంటు నియోజకవర్గంలో ఉంటాను. అవసరాన్ని బట్టి శుక్రవారం కూడా ఉండేలా ప్లాన్ చేస్తున్నాను.

'కార్యకర్తలతో జగనన్న. పార్టీ బలోపేతానికి దిశ నిర్దేశం' పేరుతో ఈ కార్యక్రమంలో పాల్గొంటాను. నా కార్యక్రమం ప్రారంభమయ్యేలోపు జిల్లా కమిటీలు, నియోజకవర్గ కమిటీలు, మండల స్థాయి కమిటీలు పూర్తి చేయాలి. సంక్రాంతి లోపే అవన్నీ పూర్తి కావాలి. నా కార్యక్రమం మొదలైన తర్వాత మండల స్థాయి నుంచి గ్రామ స్దాయి వరకు కమిటీలు పూర్తి చేద్దాం.

ప్రతి ఒక్కరికీ సోషల్ మీడియా ఎక్కౌంట్ ఉండాలి. అన్యాయం జరిగితే దాన్ని కచ్చితంగా ప్రశ్నించాలి. ఎక్కడ అన్యాయం జరిగినా ఫోటో తీసి ప్రశ్నించాలి. ఎందుకు అమ్మఒడి రావడం లేదు మా విలేజ్ క్లినిక్ పరిస్థితి ఎందుకు ఇంత దారుణంగా ఉంది. ఫోటోలు తీసి అప్ లోడ్ చేయాలి. తద్వారా ప్రజలకు దగ్గర కావాలని వైయస్ జగన్ దిశా నిర్దేశం చేశారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 12, డిసెంబర్ 2024

## ఆర్థిక ఇబ్బందులున్నా.. పథకాలు అమలు చేస్తున్నాం..

- **ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ ౦ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్**



**గుంటూరు, మహానాడు:** వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు స్వేచ్ఛ స్వతంత్రాలను పోగొట్టుకున్నారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ ఆరోపించారు. బుధవారం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడారు. గడిచిన ఆరు నెలల నుంచి ప్రజలు స్వేచ్ఛ స్వతంత్రాలను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కాలంలో ప్రజలు తమ సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వానికి చెప్పుకుంటున్నారన్నారు. సంక్షేమం విషయంలో వైసీపీ ప్రభుత్వానికి టీడీపీ ప్రభుత్వానికి నక్కకి, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందంటూ వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా ఎక్కడా ప్రజా సంక్షేమానికి ఇబ్బంది కలగకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. జగన్ రెడ్డి తను చేసిన అక్రమాలను, కుంభకోణాల నుంచి దృష్టి మళ్లించడానికి కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. జగన్ నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడు తున్నారని మండిపడ్డారు.

## బంగ్లాదేశ్ ఉదంతంలో పౌరు సమాజం స్పందించాలి

- **బీజేపీ అధికార ప్రతినిధి ఆర్.డి.విల్సన్**




**కావాలి, మహానాడు:**

బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న అరాచకాలకి వ్యతిరేకంగా యావత్ భారత్ సమాజం స్పందించాలని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.డి విల్సన్ పిలుపునిచ్చారు. బుధవారం కావాలి ప్రెస్ క్లబ్‌లో జరిగిన పాత్రికేయ సమావేశం లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అంచె పాక కమల, బీజేపీ కావలి నియోజకవర్గం కన్వీనర్ సీవీసి సత్యం, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, పట్టణ ప్రధాన కార్యదర్శి మంద కిరణ్, సవింద్ర తదితరులతో కలిసి మాట్లాడారు. నోబుల్ బహుమతి పొందిన ప్రస్తుత బంగ్లా దేశ్ అధ్యక్షుల యానస్ బంగ్లా దురాగతాలకు కారణమన్నారు. ఇప్పటికే అరెస్ట్ చేసిన బంగ్లాదేశ్ హిందువులను విడుదల చెయ్యాలి అన్నారు. లక్షల మంది బంగ్లాదేశ్ హిందువుల మీద అరాచకాలు జరుగుతుంటే భారత్ లోని కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు పెదవి విప్పడం లేదన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులు మతం మారాలని తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తున్నారని, ఒకవేళ ఇక్కడే ఉండాలంటే పన్నులు కట్టాలని (జిజియా పన్నుల తరహాలో )వత్తిడి చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు అక్కడ హిందువులు ఆస్తులు అమ్ముకొని బయటికి రావాలన్నా రాలేని పరిస్థితిలోకి నెట్టి వేయబడ్డారని విల్సన్ తెలిపారు. బంగ్లాలో సెక్యులర్ రాజ్యాంగలో ఉన్నప్పటికీ దమనకాండ జరుగుతుందన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి జషీయుద్దీన్ ఇది మా దేశ అంతర్గత విషయం అని అనడం దుర్మార్గం అని అన్నారు. మానవ హక్కులు అక్కడ ధ్వంసం అవుతుంటే ప్రశ్నించలేకపోవడం దారుణం అన్నారు. బంగ్లా హిందువులకు భారత్ సమాజం అండగా ఉంటుందన్నారు. బంగ్లాలోని హిందువులకు మద్దతుగా మాట్లాడుతున్న ఇస్కాన్ సంస్థ బాధ్యులు చిన్మ య్ ని అరెస్ట్ చేయడాన్ని విల్సన్ తీవ్రంగా ఖండించారు. బంగ్లాలోని జమైతే ఇస్లామీ తీవ్రవాదులు, బీఎన్ పీ పార్టీ కార్యకర్తలు క్రూరంగా వ్యవహరిస్తున్నారన్నారు.

## పోలీస్ కస్టడీకు విజయ్ పాల్

**గుంటూరు, మహానాడు:** మాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలు పెట్టిన కేసులో నిందితుడిగా ఉన్న సీఐడీ విశ్రాంత అడిషనల్ ఎస్పీ ఆర్. విజయ్‌పాల్‌ను ఐదు రోజులు కస్టడీ విచారణకు పోలీసులు కోర్టును కోరారు. అయితే, కోర్టు రెండు రోజుల కస్టడీకు అనుమతి ఇచ్చింది. ఈ నెల 13, 14 తేదీల్లో విజయ్ పాల్ ను పోలీసులు కస్టడీ విచారణ చేయనున్నారు.



## ఐదేళ్ల వైసీపీ అరాచకం స్థానంలో అభివృద్ధికి బాటలు

**చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**



**వినుకొండ, మహానాడు:** రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ అరాచకం స్థానంలో కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలు అభివృద్ధి బాటలు చూస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే ఆంజనేయులు అన్నారు. నాడు నేడు ఇదే బడ్జెట్ ఇదే వనరులున్నా కూటమి ప్రభుత్వం చేస్తున్న ఇదే అభివృద్ధిని జగన్ ఎందుకు ఎందుకు చేయలేక పోయారో చెప్పగలరా అని ప్రశ్నలు సంధించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బుధవారం జీవీ మీడియాతో మాట్లాడారు. వైసీపీ, జగన్ తీరుపై నిప్పులు చెరిగిన జీవీ కూటమి అభివృద్ధి బాట చూస్తున్న ప్రజలు జగన్ పోరుబాటను పట్టించుకునే పరిస్థితుల్లో లేరని ఎద్దేవా చేశారు. వైసీపీ అరాచకాలు, గంజాయి, గుట్కా వద్దని ప్రజలే ఛీకొట్టిన విషయం జగన్ గుర్తుంచుకోవాలని ఇకనైనా తీరు మార్చుకుంటే మేలని హితవు పలికారు.

## జిల్లాల అభివృద్ధికి కలెక్టర్‌లు విభిన్నంగా ఆలోచించాలి

- **సీఎం చంద్రబాబు నాయుడు**



**అమరావతి, మహానాడు:**

విజన్ ఆంధ్రా-2047 డాక్యుమెంట్‌లో ప్రస్తావించిన "ప్రస్తుత ధరల వద్ద స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి అంచనాలు" పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సదస్సు లో మాట్లాడారు. 2022-23 లో విశాఖపట్నం జిడిపిఎస్ రూ.1,19,268 కోట్లు ఉండగా అది 2028-29 నాటికి మనం నిర్దేశించుకున్న లక్ష్యం రూ.2,64,781 కోట్లకు చేరుకోవడంలో పరిశ్రమలు, సేవా రంగాల పాత్ర అధికంగా ఉండబోతుంది. తిరుపతి, కృష్ణపట్నం, శ్రీసిటీ, నెల్లూరు, చెన్నై ట్రై సిటీ హబ్‌గా తిరుపతికి లాజిస్టిక్ అవకాశాలు ఉండటం వల్ల ఆ జిల్లా ప్రస్తుత జిడిపిఎస్ రూ.67,487 కోట్లు 2028-29 నాటికి రూ.1,69,469 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసినట్టు తెలిపారు. ఇంకా, సీఎం ఏమన్నారంటే..

ఒకప్పుడు అనంతపురం, కర్నూలు, కడప చాలా వెనుకబడిన జిల్లాలుగా ఉండేవి. అవి ఇప్పుడు బాగా అభివృద్ధి చెందాయి. ఇందుకు కారణం ఆయా జిల్లాలోని వాతావరణ పరిస్థితులను బట్టి ఉద్యాన వన పంటలను ప్రోత్సహించడమే. ఒకప్పుడు తూర్పు గోదావరి జిల్లా ఎంతో అభివృద్ధి చెందిన జిల్లాగా ఉండేది. అయితే అది ఇప్పుడు వెనుకబడిపోయింది. అందుకు కారణం పరిశ్రమలు రాకపోవడం, సేవా రంగం అభివృద్ధి చెందకపోవడం, సంప్రదాయంగా వస్తున్న వరి, కొబ్బరి పంటలనే సాగుచేయడం. ప్రస్తుత వినూత్న ఆర్థిక వ్యవస్థలో నాలెడ్జ్ ఎకానమీని ఉపయోగించుకోకపోవడమే ప్రధాన కారణం.

ఇటువంటి పరిస్థితుల్లో విభిన్నంగా ఆలోచిస్తూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయా జిల్లాల సమగ్రాభివృద్ధికై సంబంధిత జిల్లా కలెక్టర్లు చొరవ చూపాలి. అందుకే ఈ సమావేశంలో ఇటువంటి అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. విజన్ ఆంధ్రా-2047 డాక్యుమెంట్‌లో 50 శాతం వృద్ధిరేటును లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 3,000 డాలర్ల లోపే ఉన్న జిడిపిఎస్ 23 సంవత్సరాల కాల వ్యవధిలో 15 రెట్లు అభివృద్ధి చెందాలి. అంటే 42,000 డాలర్లకు తీసుకు వెళ్లాలనే లక్ష్యంతో విజన్ డాక్యుమెంట్ రూపొందించారు. కాబట్టి ప్లానింగ్, ఎగ్జిక్యూషన్ లో వినూత్నంగా ఆలోచించి ఫలితాలు సాధించాలి. తలసరి ఆదాయం పెరిగితేనే జీవన ప్రమాణాలు పెరుగుతాయి. అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలి.

# ఉదయం నుంచీ ఉత్కంఠ

- **మంచు ఫ్యామిలీ వివాదం**
- **దవాఖానాలో మోహన్‌బాబు.. సీపీ ముందు మనోజ్**
- **సైలెంట్‌గా విష్ణు.. సాయంత్రం మళ్లీ హడావుడి**
- **కోర్టులో మోహన్‌బాబుకు ఊరట**
- **మంచు కుటుంబీకులకు సీపీ సీరియస్ వార్నింగ్**
- **లక్ష బాండ్‌తో వెనక్కి తగ్గిన మనోజ్**
- **మనోజ్‌పై దాడి కేసులో ఒకరు అరెస్ట్**

**హైదరాబాద్, మహానాడు:**

మంచు ఫ్యామిలీ వార్ పీక్‌కు చేరింది. మోహన్ బాబు కుటుంబ వివాదం రోడ్డు పైకి వచ్చింది. పోలీసు కేసులు.. కోర్టులో విచారణలు జరుగుతున్నాయి. మోహన్ బాబు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మనోజ్ తన తండ్రి దేవుడి లాంటి వారని చెబుతూనే…తన తండ్రి భుజం పై తుపాకి పెట్టి తనను లక్ష్యంగా చేసుకున్నారని చెప్పుకొచ్చారు. విష్ణు ఈ వివాదంలో బయటి వ్యక్తులు సాయంత్రంలోగా వదిలి వెళ్లాలని అల్టిమేటం ఇచ్చారు. ఇదే సమయంలో హైకోర్టు మోహన్ బాబు అభ్యర్థనల పైన కీలక ఆదేశాలు ఇచ్చింది. మోహన్ బాబు పిటీషన్ లో మంచు కుటుంబం లో వివాదం తారా స్థాయికి చేరుకుంది. ఘర్షణలు.. దాడుల వరకు వెళ్లింది. కేసు లు నమోదయ్యాయి.

### ఆదివారం మొదలై…!

మంచు మోహన్ బాబు కుటుంబంలో నెలకొన్న వివాదం హీట్ పెంచింది. పోలీస్ స్టేషన్ నుంచి హైకోర్ట్ దాకా వెళ్లింది. ఇటు కోర్టు ఆదేశాలు, అటు సీపీ హెచ్చరికల నేపథ్యంలో వివాదానికి తాత్కాలికంగా బ్రేక్‌పడింది. అయితే, బుధవారం సాయంత్రం ఉన్నఫళంగా జల్పల్లి ఫాంహౌస్‌కు వెళ్లిన మంచు మనోజ్‌తో.. మంచు విష్ణు గొడవకు దిగినట్లు బయటకు వచ్చింది. ప్రైవేట్ వ్యక్తులు ఇక్కడ ఉండవద్దు అంటూ మనోజ్ చెప్పడంతో.. ఇక్కడ ప్రైవేట్ వ్యక్తులు ఎవరూ లేరంటూ విష్ణు ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం. కానీ, వివాదం వెంటనే ముగిసినట్లు తెలిసింది. ఇక, మనోజ్‌పై దాడి కేసులో మోహన్‌బాబు మేనేజర్ కిరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం మొదలైన ఈ వివాదం నాలుగు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. తనపై మోహన్‌బాబు దాడిచేశారని మంచు మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆ తర్వాత మనోజ్, మౌనికపై మోహన్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్తి పంపకాల విషయంలో కుటుంబ సభ్యులు కూర్చుని మాట్లాడుతుండగా గొడవ జరగడంతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నట్లు ప్రచారం జరిగింది. ఆదివారం మంచు మనోజ్ పోలీసులకు ఫోన్ చేసి తనపై తండ్రి మోహన్‌బాబు, ఆయన అనుచరులు దాడి చేశారని సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత రాత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మనోజ్ వెనక్కి తగ్గకపోవడంతో ఫ్యామిలీ వార్ రోడ్డుకెక్కింది. సోమవారం మోహన్‌బాబు సైతం మంచు మనోజ్, మౌనిక తమపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మనోజ్ ఫిర్యాదుపైన, మోహన్‌బాబు కంప్లైంట్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మంగళవారం దుబాయి నుంచి మోహన్‌బాబు పెద్ద కుమారుడు విష్ణు హైదరాబాద్ వచ్చారు. ఆ తర్వాత మోహన్‌బాబు ఇంటి వద్ద మనోజ్, విష్ణు తరపున బౌన్సర్లు భారీగా మోహరించారు. ఒకానొక దశలో ఇరు వర్గాలకు సంబంధించిన బౌన్సర్లు ఘర్షణకు దిగిన విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి తన తండ్రికి ఆరోగ్యం బాగోలేదని హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో మోహన్‌బాబును విష్ణు అడ్మిట్‌చేశారు. మరోవైపు పోలీసులు విచారణకు హాజరుకావాలంటూ మోహన్‌బాబు, మనోజ్‌కు నోటీసులు జారీ చేశారు. పోలీసుల విచారణకు హాజరైన తర్వాత మంచు మనోజ్ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది.

### పోలీసుల విచారణ తర్వాత

విచారణకు రావాలని పోలీసులు పిలవడంతో మంచు మనోజ్ బుధవారం విచారణకు హాజరయ్యారు. బుధవారం సాయంకాలం మీడియాతో మాట్లాడటానని, అన్ని విషయాలు వివరిస్తానని చెప్పిన మంచు మనోజ్ పోలీసుల విచారణ తర్వాత మీడియా సమావేశాన్ని రద్దు చేసుకున్నారు. తమ కుటుంబంలో చోటుచేసుకున్న వివాదం త్వరలోనే సమసి పోతుందని, తన తండ్రి దేవుడిలాంటి వారని, కొందరు వ్యక్తుల ప్రభావానికి ఆయన లోనయ్యారని మనోజ్ చెప్పుకొచ్చారు. మరోవైపు మోహన్‌బాబు ఆసుపత్రిలో చేరడం, కుటుంబ వివాదం రచ్చకెక్కడంతో అనేకమంది తీవ్రంగా విమర్శలు చేయడంతో పాటు.. సినీ రంగంలో కొందరు ప్రముఖులు ఈ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని, రోడ్డుకెక్కద్దని చెప్పడంతో మనోజ్ ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాలనే ఆలోచనకు వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు మోహన్‌బాబు సైతం మనోజ్‌తో వివాదానికి ఎండ్ కార్డు పెట్టాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మనోజ్, మోహన్‌బాబు మధ్య మధ్యవర్తిత్వం కోసం హైదరాబాద్ సిటీకి చెందిన ఓ ప్రముఖ వ్యక్తి రాయబారం నడిపినట్లు తెలుస్తోంది.

ఇక, ఎప్పుడు మంచి జోష్‌లో ఉండే విష్ణు ఫ్యామిలీ వివాదంలో కొంచెం వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ప్రస్తుత వివాదం చిలికి చిలికి గాలివానగా మారడంతో తండ్రి, కొడుకుల మధ్య సెటిల్‌మెంట్ కోసం విష్ణు ఒక అడుగు వెనక్కి వేశారనే ప్రచారం జరుగుతోంది. నిజంగానే మంచు ఫ్యామిలీలో వివాదం ఇంతటితో సద్దుమణుగుతుందా.. లేదా కొనసాగుతుందా అనేది తెలియాలంటే ఒకట్రెండు రోజులు వేచిచూడాల్సిందే.

### కోర్టులో మోహన్‌బాబు పిటిషన్

మోహన్ బాబు, - విష్ణు తమ హాజరు పై మినహాయింపు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో లంచ్ మోషన్ పిటీషన్ దాఖలు చేశారు. తన ఇంటి వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇవ్వాలని కోరారు. తాను సెక్యూరిటీ కోరినప్పటికీ భద్రత కల్పించలేదని, వెంటనే తనకు భద్రత కల్పించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటీషన్ పైన హైకోర్టులో వాదనలు జరిగాయి. మోహన్ బాబు తరఫున సీనియర్ న్యాయవాదులు నగేష్ రెడ్డి, మురళీ మనోహర్ తమ వాదనలు వినిపించారు. మోహన్ బాబుకు మంగళవారం జరిగిన ఘర్షణలో గాయాలయ్యాయని పిటీషన్ లో వివరించారు. పోలీసుల విచారణ హాజరుకు మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు. దీంతో, కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. విచారణకు హాజరు పై మోహన్ బాబుతో పాటుగా విష్ణుకు ఈ నెల 24వ తేదీ తదుపరి విచారణ వరకు మినహాయింపు ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా మోహన్ బాబు ఇంటి వద్ద భద్రత ను ప్రతీ రెండు గంటలకు ఒకసారి పర్యవేక్షించాలని కోర్టు ఆదేశించింది.



### సీపీ ముందు మనోజ్

బుధవారం మంచు మనోజ్ రాచకొండ సీపీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. వివాదం పూర్వా పరాలను వివరించారు. గత మూడు రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాలు .. దీని వెనుక ఉన్న వ్యక్తుల గురించి సమాచారం ఇచ్చారు. మనోజ్ ఈ వివాదానికి తన అన్న విష్ణు, వినయ్ ప్రధాన కారణంగా చెబుతున్నట్లు తెలుస్తోంది. అయితే, విష్ణు మాత్రం వినయ్ తనకు అన్న లాంటి వాడని చెబుతున్నారు. తన తండ్రి ఇంట్లో ఉండవద్దని చెబితే ఎవరైనా ఉండే హక్కు లేదని పరోక్షంగా మనోజ్ ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

### మీ కారణంగా శాంతిభద్రతలకు -విఘాతం : సీపీ సీరియస్ వార్నింగ్

మంచు ఫ్యామిలీ వివాదం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నది. ఈ వ్యవహారంలో మంచు మనోజ్ బుధవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ సీపీ కార్యాలయంలో హాజరయ్యారు. సీపీ ముందు విచారణకు వచ్చారు. సీపీ సుధీర్ బాబు ముందు వ్యక్తిగతంగా విచారణకు హాజరుకాగా.. ఈ సందర్భంగా సీపీ కీలక కామెంట్స్ చేశారు. మంచు మనోజ్, మోహన్ బాబు, విష్ణు వల్ల శాంతి భద్రతల విఘాతం కలిగాయని సీపీ నోటీసులు ఇచ్చారు. మరోసారి శాంతి భద్రతలకు విగాథం కలిగేలా వ్యవహరించొద్దని వార్నింగ్ ఇచ్చారు. ఏడాది వరకు ఎలాంటి గొడవలు గానీ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం గానీ చేయొద్దని స్పష్టం చేశారు. అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ హోదాలో సీపీ ఈ దేశాలిచ్చారు. ఒకవేళ ఎలాంటి ఘర్షణ వాతావరణం క్రియేట్ చేసినా.. లక్ష రూపాయల జరిమానా ఉంటుందని సీపీ సుధీర్ బాబు హెచ్చరించారు.

### రూ.లక్ష బాండ్ సమర్పించిన మనోజ్

రాచకొండ సీపీ సుధీర్ బాబు ఎదుట హాజరైన మనోజ్.. సీపీకి బాండ్ రాసిచ్చారు. ఈ సందర్భంగా గన్ అప్పగించాలని సీపీ ఆదేశించారు. అనంతరం వివాదాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్‌బాబు.. పలు ఆంక్షలు విధించారు. ఆ తర్వాత మనోజ్.. పోలీసులకు బాండ్ రాసిచ్చారు. ఇక నుంచి తనంతట తాను గొడవలకు దిగనని, శాంతి భద్రతలకు విఘాతం కల్గించనని మనోజ్ బాండ్ రాసిచ్చాడు. ప్రస్తుతం తాను పదేపదే విచారణకు రానని, గొడవలకు కూడా వెళ్లనని బాండ్‌లో పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం తన తల్లి ఆస్పత్రిలో లేరని, ఇంట్లోనే ఉన్నారని, ఆస్పత్రిలో ఉన్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ సందర్భంగా పోలీసులకు చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న వివాదాల నేపథ్యంలో తన తండ్రి మోహన్‌బాబు, తమ్ముడు విష్ణుతో కూర్చుని మాట్లాడుకోవడానికి తాను సిద్ధం అని మనోజ్ ప్రకటించారు.

### నాన్నంటే నాకు చాలా ఇష్టం : మంచు మనోజ్

" మా నాన్నను అన్న విష్ణు, వినయ్ ట్రాప్ చేశారని.. ఆయన దృష్టిలో నన్ను శత్రువుగా చిత్రీకరించారు" అని నటుడు మంచు మనోజ్ ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా ప్రతినిధులుపై దాడి చేసిన నటుడు మోహన్ బాబు, అన్న మంచు విష్ణు తరపున మంచు మనోజ్ క్షమాపణలు చెప్పారు. ఆయన మీడియాపై చేసిన దాడిని మనోజ్ ఖండించారు. ఇలాంటి రోజు వస్తుందని అనుకోలేదన్నారు. జర్నలిస్టులకు తానెప్పుడు తోడుంటానన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన తన కోసం వచ్చిన మీడియాకు ఇలా జరగడం చాలా బాధకరం అన్నారు. మంచు మనోజ్ మీడియాతో మాట్లాడుతున్న సమయంలో భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. నాన్న అంటే తనకు చాలా ఇష్టమంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

### అందుకే బయటికి గెంటేశా : విష్ణు

తన తండ్రి మోహన్ బాబు చెప్పినందుకే.. ఇంట్లోకి వచ్చిన వారందరినీ బయటికి గెంటేశానని, ఆయన చెప్పిందే తనకు వేదవాక్కు అని నటుడు, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన తండ్రి అనుమతి లేకుండా ఎవరూ ఇంట్లోకి వెళ్లకూడదని చెప్పారు. మీడియాతో మాట్లాడాలని తన తండ్రి నమస్కరిస్తూ వచ్చే సమయలో అంతా తోసుకుంటూ రావడం వల్ల.. ఒక తండ్రిగా ఆయన రియాక్ట్ అయ్యారని పేర్కొన్నారు. మీడియాకు తాను క్షమాపణ చెప్తున్నానని, గాయపడిన జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. 'ఇది మాట్లాడితే కాంట్రవర్సీ అవుతుంది. మా కుటుంబంలో బయటి వ్యక్తులు ప్రమేయం ఉంటే.. వారికి ఇవాళ సాయంత్రం వరకు టైమ్ ఇస్తున్నాము. వారంతట వారే తప్పుకుంటే మంచిది. లేదంటే.. అందరి పేర్లు నేనే బయడపెడతాను. మా నాన్న చెప్పిందే వేద వాక్కు. ఆయన చెప్పింది నేను చెస్తాను. కానీ నా తమ్ముడిపై నేనెప్పుడు దాడులు చేయను. నా సినిమా, మా అసోసియేషన్ గురించి తప్ప నేను ఏ విషయంలో మాట్లాడను. కానీ నాకు కనుక అవకాశం ఉంటే ఫిర్యాదులు, వాయిస్ మెసెజ్ కూడా బయటికి వచ్చేది కాదు. సమయమే అన్ని సమస్యలకు సమాధానం ఇస్తుంది. అమెరికా నుంచి ఇక్కడికి వచ్చే క్రమంలో నరకం చూశాను. మీ తల్లి మీకు ఫోన్ చేసి ఎడుస్తుంటే దాన్ని మించిన బాధ ఇంకేమి ఉండదు.' అంటూ విష్ణు ఆవేదన వ్యక్తం చేశారు.

### ఒకరి అరెస్ట్

మంచు మనోజ్ పై దాడి కేసులో మోహన్ బాబు మేనేజర్(ప్రధాన అనుచరుడు) కిరణ్ కుమార్ ను పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. తనపై దాడి చేసి సీసీ టీవీ ఫుటేజ్, హార్డ్ డిస్క్ లు ఎత్తుకెళ్లారని కిరణ్,విజయ్ అనే ఇద్దరి వ్యక్తులపై డిసెంబర్ 9న మనోజ్ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కిరణ్ ను బుధవారం అరెస్ట్ చేయగా.. మనోజ్ పై దాడి జరిగినప్పటి నుంచి విజయ్ అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు.

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 12, డిసెంబర్ 2024

# జల సంరక్షణ చర్యలు చేపట్టండి

- భూగర్భ జలాల పెంపుపై దృష్టి సారించండి
- కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశం.
- 2027 జూన్ కల్లా పోలవరం పూర్తి చేస్తాం
- జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జి. సాయిప్రసాద్

అమరావతి,మహానాడు:

జిల్లాల్లో జల వనరుల సంరక్షణ చర్యలకు అధిక ప్రాధాన్యమిచ్చి పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో జలవనరుల విభాగం ఇచ్చిన ప్రజెంటేషన్ పై ఆయన స్పందిస్తూ జలవనరులను సమర్థవంతంగా నిర్వహించడం చాలా ముఖ్యమన్నారు. దురదృష్టవశాత్తు గత ఐదేళ్లు డ్యామ్ లు, కాలువ నిర్వహణ, గేట్ల మరమ్మత్తులు పూర్తిగా వదిలేశారని, ప్రాజెక్టు గేటు కొట్టుకుపోతే తిరిగి అమర్చేందుకు కాంట్రాక్టర్లు కూడా ముందుకురాని దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అయితే ఈ సారి మనం సమర్థవంతంగా జలవనరులను ఉపయోగించు కున్నామన్నారు. నీరు వృధా కాకుండా దాదాపుగా అన్ని రిజర్వాయర్లను నీళ్లతో నింపుకోగలిగామన్నారు. కాలువల మరమ్మతులు పర్యవేక్షించాలన్నారు. వచ్చే రెండు సీజన్లలో కనీసం 8 మీటర్లలో భూగర్భ జలాలుండేలా చూసుకోవాలన్నారు. నదుల అనుసంధానం క్లిష్టమైన లక్ష్యమని, దానికి రూ.లక్ష కోట్లు అవుతుందని, అయితే కేంద్రం సహకారంతో ఎలా ముందుకెళ్లాలనేది ఆలోచిస్తామన్నారు. కృష్ణా-గోదావరి నదులను అనుసంధానం చేస్తే రాయలసీమ సస్యశామలవుతుందన్నారు.

### 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేస్తాం

పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తున్నామని జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయి ప్రసాద్ తెలిపారు. ఈసారి వరుణుడు కరుణించాడని, అన్ని జలాశయాలు నింపుకోగలిగామన్నారు. అయితే క్లౌడ్ బరస్ట్‌లు ఎక్కువగా సంభవిస్తున్నాయన్నారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో క్లౌడ్ బరస్ట్ లు జరగడం వల్ల జిల్లాలో అనూహ్యంగా వర్షాలు కురిశాయన్నారు. బుడమేరు ఎగువ ప్రాంతంలో కూడా అనూహ్యంగా ఇలా జరగడం వల్లే వరదలు సంభవించాయన్నారు. భవిష్యత్తులో ఈ క్లౌడ్ బరస్ట్ లు ఎక్కువ జరిగే అవకాశాలున్నాయని, వాటిని ఎలా ఎదుర్కోవాలనేదానిపైన పనిచేస్తున్నామన్నారు. జిల్లాల్లో కలెక్టర్లంతా నరేగా పనుల్లో చెక్ డ్యామ్ ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాల్లో అధనంగా నీరు నిల్వ చేయడానికి అవకాశమున్న కొత్త ప్రాంతాలను అన్వేషించాలన్నారు. పులిచింతల డ్యామ్ నిండుగా ఉందని, ఈ డ్యామ్ నుంచి వచ్చే జూన్ ఖరీఫ్ సీజన్ కు నీళ్లు విడుదల చేస్తామన్నారు. వర్షాలు బాగా కురవడం వల్ల రాష్ట్రంలో భూగర్భ జల మట్టం కూడా పెరిగిందన్నారు.



తొలిరోజు కలెక్టర్ల సదస్సు అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులతో కలిసి సచివాలయంలో డిన్నర్ చేశారు. జిల్లాల్లోని పలు అంశాలకు సంబంధించి కలెక్టర్లు, ఎస్పీలతో ముచ్చటించారు.

# పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన

- ఐదు వందల మందికి ఒక సర్వేయర్
- 31వ తేదీ నాటికి పరిశీలన పూర్తి చేయాలి
- సామాజిక సర్వేకు తుదిగడువు 13వ తేదీ
- 14వ తేదీన సంక్షేమ హాస్టల్ విద్యార్థులతో సహపంక్తి భోజనం
- 15,16 తేదీల్లో జరిగే గ్రూప్ -2 పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు
- కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ ,హౌసింగ్. సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, మహానాడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్. సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన , గ్రూప్ -2 పరీక్షల నిర్వహణ, మెస్ ఛార్జీలపెంపు, సామాజిక సర్వే తదితర అంశాలపై బుధవారం సచివాలయం నుంచి ముఖ్యమంత్రి సలహా దారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ " ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈనెల 31వతేదీ లోగా పూర్తిచేయాలి. పరిశీలన చేసిన సర్వే వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి, ప్రతి ఐదు వందల మందికి ఒక ఉద్యోగి ( సర్వేయర్) ను నియమించుకోవాలి. సర్వే లో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలి, రాష్ట్రంలో ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కాక పోతే వెంటనే ఏర్పాటు చేసుకోవాలి, ఏ గ్రామంలో సర్వే నిర్వహిస్తారో ఆ ముందు రోజు రాత్రి గ్రామంలో చాటింపు చేయాలి. అంతేగాక స్థానిక పరిస్థితులను బట్టి కలెక్టర్‌లు ప్రణాళికలు రూపొందించుకోవాలి, ఏ ఒక్క దరఖాస్తును విడిచిపెట్టకుండా చిన్న చిన్న పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా పకడ్బందీగా సర్వే నిర్వహించాలి, సర్వే వివరాలపై ప్రతి రోజు కలెక్టర్ లు సమీక్షించాలి, ప్రతి జిల్లా కేంద్రంలో ఫిర్యాదులు, సలహాలకోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఓ నిరంతర ప్రక్రియ ఈ ఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించబోతున్నాం "కలెక్టర్ లకు మంత్రి సూచించారు.

గత ప్రభుత్వం పది సంవత్సరాలలో ప్రభుత్వ వసతి గృహాలలో చదువుకొనే విద్యార్థుల మెస్ ఛార్జీలను ఒక్కసారి కూడా పెంచలేదు. మా ప్రభుత్వం ఏడాది లోపే 40 శాతం మెస్ ఛార్జీలు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల 7.65 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగింది. కలెక్టర్లు తరచూ హాస్టళ్లను తనిఖీ చేసి విద్యార్థులకు అందించే సరుకుల క్వాలిటీ, క్వాంటిటీపై ప్రధానంగా దృష్టి సారించాలి. ఈనెల 14వ తేదీన మంత్రులు , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ,పార్లమెంటు సభ్యులు స్థానికంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను సందర్శించి అక్కడే విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తాం. ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొనాలి.

### సామాజిక సర్వే

రాష్ట్రంలో 1కోటీ 16 లక్షల కుటుంబాలకు గాను 1కోటీ 12 లక్షల కుటుంబాల సామాజిక సర్వే (99.09 శాతం) పూర్తిచేయడం జరిగింది. ఇందుకు కృషి చేసిన అధికారులకు ముఖ్యమంత్రి గారి తరపున, రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈనెల 13వ తేదీ సామాజిక సర్వేకు తుదిగడువు. ఆ తర్వాత ప్రజా పాలన సేవా కేంద్రాలలో కూడా కుటుంబ సర్వే వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఈనెల 15, 16 తేదీలలో జరిగే గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

# పెరిగిన ఎన్నికల ఖర్చు సమాజానికి చేటు!

- శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

హైదరాబాద్, మహానాడు: ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ఇన్స్టిట్యూట్ లో తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ఏర్పాటు లేజిస్లేచర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ను తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన సభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గెలిచిన తరువాత ప్రమాణస్వీకారం రోజునే ఐడి కార్డ్ తో పాటు రూల్స్ అండ్ రెగులేషన్స్ పుస్తకాలు ఇస్తాం కానీ వాటిని ఎవరు కూడా చదవడం లేదు.

ప్రస్తుతం ఎన్నికల ఖర్చు కూడా విపరీతంగా పెరిగింది. ఇది సమాజానికి మంచిది కాదు. అతి సామాన్యుడు కూడా పోటీ చేసే విధంగా ఉండాలి. రాజకీయాల్లో ఉన్నప్పుడు విమర్శలు రావడం సహజం కానీ ఆ విమర్శలకు భయపడకుండా ప్రతివిమర్శతో ముందుకు వెళ్ళాలి. చట్ట సభలను ఎన్ని రోజులు అయినా నడిపించడానికి సిద్ధంగా ఉన్నాం. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.... చట్టాల రూపకల్పనతో పాటుగా అనంతరం వాటి అమలు తీరు, ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడు తున్నాయని కూడా చర్చించాల్సిన అవసరం ఉంటుంది.

శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ లేజిస్లేచర్ మీటింగ్ కి పార్టీలకు ఎలాంటి సంబంధం లేదు. బి ఆర్ యస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాకపోవడం శోచనీయం. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని ఎక్కువ రోజులు నడిపితే అంత మంచిది. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు, 65 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.



# న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం కొత్త అధ్యక్షురాలిగా వాణి ఏనుగు ఎంపిక

- అమెరికా, తెలంగాణలకు వారధిగా పనిచేయనున్న నైటా కొత్త కార్యవర్గం




న్యూయార్క్: న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (NYTTA) కొత్త అధ్యక్షురాలిగా శ్రీమతి వాణి ఏనుగు ఎంపికయ్యారు. స్థానిక రాడిసన్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో నైటా కొత్త కార్యవర్గం ఎంపిక జరిగింది. న్యూయార్క్‌లో ఉంటున్న ఎన్.ఆర్.ఐలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై, కొత్త కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అమెరికాలో అతిపెద్ద నగరానికి, తెలంగాణకు వారధిగా ఉన్న న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం కొత్త అధ్యక్షురాలిగా శ్రీమతి వాణి ఏనుగు, సెక్రటరీగా హరిచరన్ బొబ్బిలి, వైస్ ప్రెసిడెంట్ గా రవీందర్ కోడెల, ట్రెజరర్‌గా నరోత్తమ్ రెడ్డి బీసమ్, ఎన్నికయ్యారు.

న్యూయార్క్ కాంగ్రెస్ మెన్ థామస్ రిచ్చర్డ్ సౌజ్ (Thomas Richard Suozzi) ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై, కొత్త కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నైటా అధ్యక్షురాలిగా సమర్థవంతంగా పనిచేస్తానని, కార్యవర్గం, మొత్తం తెలుగు కమ్యూనిటీని కలుపుకుని కార్యక్రమాల నిర్వహణ చేపడతామని శ్రీమతి వాణి ఏనుగు తెలిపారు. న్యూయార్క్ మహానగరంలో నివసించే తెలుగు వారికి ఒక వేదికగా, తెలుగువారి ముఖ్యంగా తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అమెరికాలోనూ అందించాలన్నఉద్దేశ్యంతో న్యూయార్ తెలంగాణ తెలుగు సంఘం ఏర్పాటైంది. ప్రతీయేటా కమ్యూనిటీ కార్యక్రమాలు, సంస్కృతీ సంప్రదాయాలు, పండగలు, వేడుకలను నిర్వహణలో భాగం అవుతూ నైటా ఎనలేని కృషి చేస్తోంది.

అమెరికాలో ఎన్.ఆర్.ఐ ప్రముఖులు డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి, గూడూరు శ్రీనివాస్, నైట్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ డాక్టర్ రాజేందర్ రెడ్డి జిన్నా, లక్ష్మణ్ ఏనుగు, సతీష్ కాల్వ, అడ్వయిజరీ కమిటీ సభ్యులు తమ కుటుంబాలతో సహా ఈ కార్యక్రమానికి హాజరై, కొత్త కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

(డాక్టర్ పైళ్ల మల్లారెడ్డిగారి స్వగ్రామమైన నల్లగొండ జిల్లా సుంకిశాలలో జన్మించిన వాణి, తమ తాతగారైన పైళ్ల సత్యనారాయణ రెడ్డి వద్ద హైదరాబాద్ లో చదువుకున్నారు. ఏనుగు లక్ష్మణ్‌తో వివాహం తర్వాత, మల్లారెడ్డిగారి సహకారంతో పాతికేళ్ల కిందట అమెరికా చేరుకున్నారు. భార్యగా, తల్లిగా, ఫార్మసిస్ట్ గా త్రిపాత్ర అభినయం చేయటమే కాదు, భారతదేశం నుంచి న్యూయార్క్ వచ్చే అతిధులు, తెలంగాణ కవులు, కళాకారులకు ఆతిధ్యం ఇచ్చి, అన్నం పెట్టడం వాణి ఏనుగు ప్రత్యేకత.)

# రేపటి నుంచి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్



హైదరాబాద్, మహానాడు: తెలంగాణ సచివాలయంలో డిసెంబర్ 12 నుంచి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ అమలు కానుంది. సచివాలయంలో పనిచేసే అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి దీనిని వర్తింపజేయనున్నారు. ఔట్ సోర్సింగ్, సచివాలయం హెడ్ నుంచి వేతనాలు పొందే ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా ఫేషియల్ అటెండెన్స్ అమల్లో ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

# బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

- ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏమైంది ?
- వడ్డెర సంఘం నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు ఆసుపత్రల పాలవ్వడంతో, సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో వారి పిల్లల క్షేమం పట్ల భయాందోళన నెలకొంది
- పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనం
- సారంగాపూర్ కస్తూర్బా పాఠశాల ఘటనపై ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్,

కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ తో పాటు ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిన ఇతర హామీలను అమలను త్వరగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు.

తెలంగాణ వడ్డెర సంఘం నాయకులు బుధవారం నాడు ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో కలిశారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపుపై బీసీ డెడికేటెడ్ కమిషన్ కు తెలంగాణ జాగృతి సంస్థ తరఫున నివేదిక సమర్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఏడాది గడిచినా ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, ప్రతి జిల్లా కేంద్రంలో రూ. 50 కోట్లతో బీసీ ఐక్యత భవనాలను నిర్మిస్తామని ఇచ్చిన హామీల అమలు కనీస చర్య తీసుకోలేదని ఎండగట్టారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, దాన్ని అమలు చేయడంలో తాత్సారం చేయవద్దని సూచించారు. కులవృత్తుల వారికి ఈ ప్రభుత్వం కనీస మద్ధతునివ్వడం లేదని విమర్శించారు.

### సారంగాపూర్ కస్తూర్బా పాఠశాల ఘటనపై ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ

జగిత్యాల జిల్లా సారంగాపూర్ కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారనే వార్త ఆందోళన కలిగించిందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత తెలిపారు. ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు ఆసుపత్రల పాలవ్వడంతో, సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో వారి పిల్లల క్షేమం పట్ల భయాందోళన నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించక పోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనంగా మారిందని విమర్శించారు.విద్యా శాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, ఏడాది కాలంలో ఒక్కసారి కూడా సంక్షేమ పాఠశాలలకు వెళ్లి అక్కడి పరిస్థితులను, విద్యార్థుల సమస్యలను తెలుసుకోలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే సంక్షేమ పాఠశాలలను సందర్శించాలి. వాటి పరిస్థితులపై సమీక్ష చేసి ఇలాంటి పరిస్థితుల్లో పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 12, డిసెంబర్ 2024

## తనయుడి కోసం మైండ్ బ్లోయింగ్ స్కెచ్


నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ఎట్టకేలకు వెండితెరకు పరిచయం అవుతున్న విషయం తెలిసింది. కొన్ని సంవత్సరాల నుంచి బాలయ్య అభిమానులు ఎప్పుడా ఎప్పుడా అని ఎదురుచూస్తుండగా ఎట్టకేలకు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో పరిచయం అవబోతున్నాడు.



పురాణాలు, ఇతిహాసాల నుంచి స్ఫూర్తిగా తీసుకొని కథను తయారు చేసిన దర్శకుడు బాలయ్య తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. పాన్ ఇండియా సినిమాగా రూపుదిద్దుకోబోతోంది. దీనితర్వాత మోక్షజ్ఞ రెండో సినిమాను కూడా బాలకృష్ణ సిద్ధం చేసి ఉంచారు. ఎంతోమంది కథానాయకులను పరిచయం చేసిన వైజయంతీ మూవీస్ బ్యానరుపై ఈ చిత్రం నిర్మించబోతున్నారు. దర్శకుడిగా నాగ్ అశ్విన్ అశ్వనీదత్ నిర్మాతగా వ్యవహరించే ఈ సినిమాకు దర్శకుడు ఎవరో కాదు.. ఆయన అల్లుడు.. కల్కి డైరెక్టర్ అయిన నాగ్ అశ్విన్. ఈ కాంబినేషన్ ను ఇంతవరకు ఎవరూ ఊహించలేకపోయారు. నాగ్ అశ్విన్ మోక్షజ్ఞ కోసం ఎటువంటి కథ తయారుచేస్తాడా అనే ఉత్కంఠలో అభిమానులున్నారు. దీంతో మొదటిసినిమాతోపాటు మరో బ్లాక్ బస్టర్ కొట్టడం ఖాయమంటున్నారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తీయబోయే సినిమాను శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్, లెజెండ్ సినిమాస్ బ్యానర్ పై చెరుకూరి సుధాకర్, మతుకుమల్లి తేజస్విని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ‘ఫంకీ’

వైవిధ్యమైన కథలు,పాత్రలతో ప్రేక్షకుల మనసు గెలుచుకుంటున్న మాస్ కా దాస్ విశ్వక్ సేన్, తన తదుపరి చిత్రం కోసం బ్లాక్ బస్టర్ దర్శకుడు అనుదీప్ కె.వి తో చేతులు కలిపారు. పూర్తిస్థాయి




ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి ‘ఫంకీ’ అనే ఆసక్తికర టైటిల్ ను ఖరారు చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. హైదరాబాద్‌లో నటీనటులు మరియు సాంకేతిక బృందం సమక్షంలో ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. దర్శకుడు నాగ్ అశ్విన్ క్లాప్ కొట్టగా, దర్శకుడు కళ్యాణ్ శంకర్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. నిర్మాత ఎస్. నాగవంశీ స్క్రిప్ట్‌ను చిత్రబృందానికి అందజేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ ఆకట్టుకుంటోంది. ప్రేమ గుర్తులతో, చూడగానే అందరి దృష్టిని ఆకర్షించేలా ఫంకీ టైటిల్ ను డిజైన్ చేసిన తీరు బాగుంది. ఆ టైటిల్ డిజైన్‌తో పాటు, పోస్టర్ మీద రాసి ఉన్న ‘ఫ్యామిలీ ఎంటర్‌టైనర్’ అనే పదాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఫంకీ సినిమా ప్రేమ, వినోదంతో కూడిన ఓ మంచి కుటుంబ కథా చిత్రమనే భావన పోస్టర్ చూస్తే కలుగుతోంది. విశ్వక్ సేన్, అనుదీప్ కలయికపై ఉండే అంచనాలకు తగ్గట్టుగా, ఫంకీ చిత్రం పూర్తిస్థాయిలో ప్రేక్షకులను మెప్పించేలా ఉంటుందని నిర్మాతలు హామీ ఇచ్చారు. వినోదాన్ని పంచడంలో దర్శకుడు అనుదీప్ ది విభిన్న శైలి.

## ‘బచ్చలమల్లి’ వెరీ మీనింగ్ ఫుల్ క్యారెక్టర్ చేశా..

**- అమృత అయ్యర్**

హీరో అల్లరి నరేష్ అప్ కమింగ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘బచ్చల



మల్లి’. సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగాదేవి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అమృత అయ్యర్ హీరోయిన్ గా నటిస్తున్నారు. సామజవరగమన, ఊరు పేరు భైరవకోన బ్లాక్ బస్టర్స్ తర్వాత హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలై టీజర్, పాటలకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. బచ్చల మల్లి డిసెంబర్ 20న క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అమృత అయ్యర్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**బచ్చలమల్లి ప్రాజెక్ట్ లోకి ఎలా వచ్చారు**

-హనుమాన్ షూట్ చేస్తున్నపుడు ఈ కథ విన్నాను. స్క్రిప్ట్, క్యారెక్టర్ చాలా నచ్చింది. ఇందులో క్యారెక్టర్ కి కథలో చాలా ఇంపార్టెన్స్ వుంది.

**ఇందులో మీ క్యారెక్టర్ ఎలా వుంటుంది**

-80లో బ్యాక్ డ్రాప్ లో జరిగే కథ ఇది. టౌన్ అమ్మాయి అయినప్పటికీ సిటీ కల్చర్ వున్న క్యారెక్టర్ లో కనిపిస్తాను. తను చాలా సెన్సిటివ్, వెరీ ఎమోషనల్ క్యారెక్టర్. ఫ్యామిలీకి చాలా ఇంపార్టెన్స్ ఇచ్చే అమ్మాయి. ఇందులో నాకు, నరేష్ గారి మధ్య మంచి ఎమోషనల్ సీన్స్ వున్నాయి. ఇప్పటివరకూ నేను చేసిన క్యారెక్టర్స్ కి డిఫరెంట్ గా ఉంటుంది.

**నరేష్ గారితో వర్క్ చేయడం ఎలా అనిపించింది**

-నరేష్ గారు అద్భుతమైన యాక్టర్. ఎలాంటి ఎమోషనైనా పండించగలరు. అన్ స్క్రీన్ అగ్రెసివ్ క్యారెక్టర్ వుంటుంది. కానీ అఫ్ స్క్రీన్ ఆయన చాలా సాఫ్ట్ పర్సన్. చాలా ఫ్రెండ్లీ. ఆయనతో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్ పీరియన్స్.

**హనుమాన్ తర్వాత మీ కథ ఎంపిక ఎలాంటి మార్పు వచ్చింది**

-మొదటి నుంచి మీనింగ్ ఫుల్ క్యారెక్టర్స్ చేయాలనేదే నా ఆలోచన. బచ్చలమల్లి లో కూడా చాలా మంచి పాత్ర. చాలా మంచి ఎమోషన్స్, కంటెంట్ వున్న సినిమా ఇది. తప్పకుండా మంచి హిట్ అవుతుంది.

**డైరెక్టర్ సుబ్బు గారి గురించి**

సుబ్బు గారు చాలా క్లియర్ విజన్ వున్న డైరెక్టర్. చాలా ఫోకస్ గా వుంటారు. ఎమోషన్స్ ని చాలా అద్భుతంగా తీశారు. బచ్చల మల్లి ఎమోషనల్ డ్రామా. ఖచ్చితంగా అందరికీ నచ్చుతుంది.






## వెయ్యికోట్లు రాబట్టిన సినిమాలివే

భారత సినిమా చరిత్రలో 1000 కోట్ల గ్రాస్ మార్క్‌ను అధిగమించడం అనేది ఇప్పుడు ప్రతీ పాన్ ఇండియా మేకర్స్ కు మొదటి టార్గెట్. ఇక టాలీవుడ్ సినిమాలకు ఇది సాధ్యం అవుతుందని ఎవరు ఊహించలేదు. కొన్నేళ్ల క్రితం వరకు బాలీవుడ్ సినిమాలే బాక్సాఫీస్ ను ఎలాయి. ఇక బాహుబలి నుంచి సౌత్ సినిమాలు ఆ టార్గెట్ ను అందుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇక బాహుబలి 2 అనంతరం ఆర్ఆర్ఆర్, కేజీఎఫ్ 2 వంటి సినిమాలు ఈ మార్క్‌ను అధిగమించడమే కాదు, కొత్త రికార్డులను సృష్టించాయి. అయితే ఇప్పుడు ఆ రికార్డులను కొత్త దశకు తీసుకెళ్లిన చిత్రం పుష్ప 2: ది రూల్. అల్లు అర్జున్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా కేవలం ఆరు రోజుల్లోనే 1000 కోట్ల గ్రాస్ మార్క్‌ను చేరి అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన ఇండియన్ ఫిల్మ్‌గా నిలిచింది.

పుష్ప 2: ది రూల్ సునామీని ఇండియన్ బాక్సాఫీస్‌తో పాటు అంతర్జాతీయ బాక్సాఫీస్ కూడా ఎదుర్కొంటోంది. కేవలం ఆరు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా 1000 కోట్ల గ్రాస్‌ను రాబట్టి ఇండియన్ సినిమాల్లోనే అత్యంత వేగంగా ఈ క్లబ్‌లో చేరిన చిత్రంగా రికార్డు సృష్టించింది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, అల్లు అర్జున్ కెరీర్ లోనే అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇక పాత రికార్డులను సైతం తుడిచిపెట్టింది. అంతకుముందు ఈ ఘనత బాహుబలి 2కి దక్కింది. బాహుబలి 2 సినిమా 10 రోజుల్లో 1000 కోట్ల మార్క్‌ను దాటింది. ఆ తర్వాత ఆర్ఆర్ఆర్, కేజీఎఫ్ 2 సినిమాలు ఈ ఘనతను 16 రోజుల్లో అందుకున్నాయి. కాగా, షారుఖ్ ఖాన్ నటించిన జవాన్ 18 రోజుల్లో 1000 కోట్ల గ్రాస్ మార్క్‌ను చేరింది. ఆ తర్వాత పఠాన్ సినిమా 27 రోజుల్లో ఈ ఘనత సాధించి, అదే ఏడాది బాలీవుడ్‌ను రిప్రజెంట్ చేసింది. కానీ పుష్ప 2 ఈ లెక్కలన్నింటినీ కొత్త ఎత్తుకు చేర్చింది. పుష్ప 2 కోసం ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్ రికార్డులను బ్రేక్ చేసే స్థాయిలో ఉంది. సుకుమార్ తన డైరెక్షన్‌తో ఈ సినిమాను పాన్-ఇండియా హిట్‌గా మార్చాడు. ముఖ్యంగా మాస్ మరియు క్లాస్ ప్రేక్షకులను సమానంగా ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ దగ్గర సునామీ సృష్టిస్తోంది. ఈ సినిమాలో అల్లు అర్జున్ నటన, మ్యూజిక్, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా ఈ చిత్రానికి పుష్ప 1 క్రేజ్



ఎంతగానో హెల్ప్ అయ్యింది. దీంతో హిందీలో బాక్సాఫీస్ లెక్కలు జెట్ స్పెస్ లో దూసుకుపోతున్నాయి. ఇకపై 1000 కోట్ల క్లబ్‌లో చేరే సినిమాల సంఖ్య పెరుగుతుండడం చూస్తుంటే, టాలీవుడ్ సినీ పరిశ్రమ ప్రపంచ స్థాయిలో ఎదుగుతున్నట్లు స్పష్టమవుతోంది.

పుష్ప 2 సాధించిన రికార్డు ఇతర దర్శకులకు, నటులకు స్ఫూర్తిగా నిలుస్తుంది. అల్లు అర్జున్, రష్మిక మందన్న ఈ సినిమా ద్వారా తమ కెరీర్‌లో మరో బిగ్గెస్ట్ రికార్డ్ అందు కున్నారు. మొత్తానికి, పుష్ప 2 తన శక్తిని ప్రపంచానికి చాటింది. 1000 కోట్ల క్లబ్‌ను అత్యంత వేగంగా చేరిన ఈ చిత్రం, ఇండియన్ సినిమాకు గర్వకారణంగా నిలిచింది. మరి టోటల్ గా ఈ నెంబర్ ఇంకా ఎంతవరకు వెళు తుందో చూడాలి.




## మొదలైన దండోరా

నేషనల్ అవార్డ్ గెలుచుకున్న చిత్రం ‘కలర్ ఫోటో’.. బ్లాక్‌బస్టర్ మూవీ ‘బెదురులంక 2012’ చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్ మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని మరో సిని మాకు శ్రీకారం చుట్టారు. ఈ నిర్మాణ సంస్థలో ‘దండోరా’ సినిమా రూపొందనుంది. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఈ మూవీ ఫిల్మ్ నగర్‌లోని రామా నాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలను లాంఛ నంగా పూర్తి చేసుకుంది. ఈ కార్యక్రమానికి పలువురు సెలబ్రిటీలు హాజరై చిత్ర యూనిట్‌ను అభినందించారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత సాహు గారపాటి క్లాప్ కొట్టగా.. బేబీ నిర్మాత ఎస్ కే ఎన్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. యంగ్ ప్రొడ్యూసర్ సూర్యదేవర నాగవంశీ గౌరవ దర్శకత్వం వహించారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో ‘దండోరా’ సినిమాను రూపొందిం చనున్నారు. మన పురాతన ఆచారాలు, సాంప్రదాయా లను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమా తెరకెక్కనుంది. విలక్షణ నటుడు శివాజీతో పాటు నవదీప్, రాహుల్ రామకృష్ణ, రవికృష్ణ, మనీక చిక్కాల, అనూష తదితరులు ప్రధాన పాత్రలతో మెప్పించనున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు.

## దూసుకుపోతున్న డుగ్గు డుగ్గు బుల్లెట్ బండి

తెలుగు ప్రేక్షకులకు జయతి పేరును ప్రత్యేకంగా పరిచయం చేయవలసిన అవసరం లేదు. ఒకప్పుడు జెమినీ మ్యూజిక్ లో వెన్నెల అనే షో ద్వారా వీడియో జాకీగా అలరించిన జయతికి అప్పట్లో చాలా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండేది. విపరీతమైన ఫాలోయింగ్ ఉండటం మాత్రమే కాదు, ఆంధ్ర మాధురి దీక్షిత్ లా ఉంది అంటూ ఆమె అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తూ ఉండేవారు. ఇక వీడియో జాకీగా పనిచేసిన తర్వాత ఆ అమ్మడు సినిమాల్లోకి కూడా ఎంట్రీ ఇచ్చింది. అది కూడా నిర్మాతగా. తన సొంత నిర్మాణ సంస్థలో, లచ్చి అనే హారర్ కామెడీ జానర్ సినిమాను



నిర్మిస్తూ అదే సినిమాలో హీరోయిన్గా కూడా నటించింది.

ఆ అనంతరం కాస్త గ్యాప్ తీసుకున్న ఆమె ఇప్పుడు ఆల్బమ్ సాంగ్స్ చేస్తూ నటనకు మళ్లీ దగ్గరవుతోంది. తాజాగా డుగ్గు డుగ్గు బుల్లెట్ బండి అనే ఒక ఆల్బమ్ సాంగ్ తో ఆమె ప్రేక్షకుల ముందుకు వచ్చి హిట్టు అందుకుంది. నివృతి వైబ్స్ యూట్యూబ్ ఛానల్ లో రిలీజ్ అయిన ఈ సాంగ్ ట్రెండింగ్‌లో ఉంది.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144